www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 220 | మంగళవారం | 30 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

బీహార్‌లో జమిలి సాధ్యం కాదు
సిఎం నితీశ్‌కుమార్

10



జమిలి జనహితం

పార్లమెంట్ ఉభయసభల వేదిక నుంచి రాష్ట్రపతి కోవింద్

- ఏకకాల ఎన్నికలే శ్రేయస్కరం
- మైనారిటీల బుజ్జగింపుకాదు, సాధికారత
- ట్రిపుల్ తలాక్ బిల్లుకు ఆమోదం సాధిస్తాం
- సీమాంతర ఉగ్రవాదులను తిప్పికొడుతున్నాం
- ప్రపంచ మాంద్యంలోనూ అధిక వృద్ధిరేటు
- పార్లమెంట్ బడ్జెట్ భేటీ తొలిరోజున రాష్ట్రపతి వివరణ

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సోమవారం ఆరంభమయ్యాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలిసారిగా ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. పదే పదే ఎన్నికలు నిర్వహించడం వల్ల వనరులపై పెనుభారం పడుతోందని, అభివృద్ధి ప్రక్రియ కుంటుపడుతున్నందున రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు ఏకకాలం నిర్వహించడం మంచిదని అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టులు, నిరంతర విద్యుత్తు, పేదలకు ఎల్‌పిజి కనెక్షన్ల వంటివి ఉదాహరణగా ఆయన ఉటంకించారు. ఏకబిగిన ట్రిపుల్ తలాక్ చెప్పడాన్ని నిరోధించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొంది చట్టంగా మారుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. దానివల్ల ముస్లిం మహిళలు ధైర్యంగా, గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించే అవకాశం ఉంటుందన్నారు. సెంట్రల్ హాల్‌లో ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన తొలి ప్రసంగాన్ని చేసినప్పుడు ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, తరువాయి 6లో



కాళేశ్వరం మోడీ శ్రీకారం?

ప్రాజెక్టు తొలిదశను జూన్‌లో ప్రధాని చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేయాలని సిఎం సంకల్పం

మన తెలంగాణ/ హైదరాబాద్ : జూన్ నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు తొలి దశను ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభమయ్యేలా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఆలోచిస్తున్నారు. అతి తక్కువ కాలంలో మొదటి దశను పూర్తి చేసిన గుర్తింపును ఇప్పటికే పొందిన తెలంగాణ యావత్తు దేశానికి ఒక సందేశాన్ని ఇవ్వనుంది. అందులో భాగమే ప్రధానిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించి ప్రారంభోత్సవం చేయించాలన్నది కెసిఆర్ ఆలోచన. ఉత్తర తెలంగాణ జీవధారగా భావిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుపై సిఎం కెసిఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. 13 జిల్లాల్లోని 18.25 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 18.82 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో రాష్ట్రాన్ని పచ్చల తోరణంలా మార్చడానికి కాళేశ్వరం ప్రాజెక్టే శరణ్యమని ముఖ్యమంత్రి భావన. లక్షలాది ప్రజలకు తాగు, సాగునీరు ఇవ్వడంతో పాటు 125 కిలో మీటర్ల మేర గోదావరి నదినే సజీవంగా మార్చేలా అత్యంత వ్యయ ప్రయాసలకు వెనుకాడకుండా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. వచ్చే వానాకాలం సీజన్లో నీటిని ఎత్తిపోయాల్సిందేనని గడువు విధించి మరీ ఏజెన్సీలతో పనులు చేయిస్తున్నారు. ఇందుకోసం తానే స్వయంగా బ్యారేజీలు, పంపుహౌస్‌ల నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. లైవ్ కెమెరాలతో మేడిగడ్డ మొదలు మిడ్ మానేరు వరకు బ్యారేజీలు, పంపుహౌస్‌ల నిర్మాణ పనులను హైదరాబాద్ నుంచే చూస్తుంటారు. ఇదే పంథాను మంత్రి హరీశ్‌రావు కొనసాగిస్తూ లైవ్ కెమెరాలతో క్షేత్రస్థాయిలో సమీక్షలు జరుపుతున్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను 2018, జూన్, జులై నాటికే పూర్తిచేసేలా యాక్షన్ ప్లాన్ రూపొందించారు. కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ పనులను 2018 డిసెంబరు నాటికి పూర్తి తరువాయి 6లో

వృద్ధిరేటు లక్ష్యం 7.5 శాతం

- పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి పర్యవసానాల సవాళ్లను అధిగమించాం
- పెరుగుతున్న చమురు ధరలే భవిష్యత్తులో పెనుముప్పు
- ఆర్థిక సర్వేలో అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు, సరకులు – సేవల పన్ను (జిఎస్‌టి) ప్రభావం వదుల్చుకుని భారత దేశ ఆర్థిక వ్యవస్థ చురుగ్గా మెరుగుపడుతోందని ఇక్కడ విడుదలయిన ఆర్థిక సర్వే ప్రకటించింది. 2018–19 ఏడాదికి వృద్ధిరేటు 7 – 7.75 శాతంగా విస్తరించి, ప్రపంచంలో అత్యంత వేగంగా తరువాయి 6లో



ఉత్పత్తిలో ఉన్నతం

తయారీరంగ ఎగుమతుల్లో.. పై ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి : మంత్రి కెటిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : వివిధ రకాల ఉత్పత్తుల ఎగుమతుల్లో (మాన్యుఫ్యాక్చరింగ్ రంగం) ప్రస్తుతం దేశంలోని తొలి ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటిగా ఉందని, త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు వ్యాఖ్యానించారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ ఉత్పత్తి రంగంలో అగ్రగామి రాష్ట్రాల సరసన నిలువడం గర్వకారణంగా ఉందన్నారు. దేశంలో మొత్తం ఎగుమతుల్లో 70 శాతం గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుండే జరుగుతున్నాయని కేంద్ర ఆర్థిక శాఖమంత్రి అరుణ్ జైట్లీ సోమవారం విడుదల చేసిన ఎకనామిక్ సర్వే (2017) తేల్చడాన్ని కెటిఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గచ్చిబౌలిలోని టి హబ్‌లో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఇసి) ఇన్నోవేషన్ ప్లాట్ ఫాంను మంత్రి కెటిఆర్ సోమవారం ప్రారంభించారు. ఆర్ఇసి ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాంకు సంబంధించిన ఒప్పంద పత్రాలను మంత్రి కెటిఆర్ సమక్షంలో ఆర్ఇసి లిమిటెడ్ చైర్మన్ అండ్ ఎండి డా. పివి. రమేష్, టి హబ్ సిఇఒ జయకృష్ణన్‌లు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలకు సాంకేతికతను జోడించి వినూత్న ప్రయోగాలకు నాంది తరువాయి 6లో







జాతరమ్మ.. జాతరో

రేపటి నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ కుంభమేళా

మన తెలంగాణ/ వరంగల్ : తెలంగాణ కుంభమేళా సమ్మక్క సారలమ్మ జాతరకు మేడారం ముస్తాబయింది. భక్తికి, విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే మేడారం కుగ్రామం ఇప్పటికే మహానగరంగా మారింది. నాలుగు రోజులపాటు జరిగే మహాసంబురంలో కోటి 20 లక్షల మంది భక్తులకు విడిది ఇవ్వనున్నది. ప్రాంతాలకు, మతాలకు, భాషలకు అతీతంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశాలతోపాటు యావత్ భారత దేశం నుంచి భక్తులు తరలిరానున్నారు. జనవరి 31నుంచి ఫిబ్రవరి 3 వరకు నాలుగు రోజులపాటు వైభవోపేతంగా జరిగే జాతరలో మొదటి రోజు సారలమ్మ కన్నెపల్లి నుంచి మేడారంలోని గద్దెలపైకి రావడంతో జాతర ప్రారంభమవుతుంది. ఫిబ్రవరి 1న చిలకలగుట్ట నుంచి మేడారం గద్దెలపై సమ్మక్క రావడంతో జాతర ప్రధాన ఘట్టం ఆవిష్కృతమవుతుంది. సమ్మక్క రాక కోసం పూనుగండ్ల నుంచి భర్త పగిడిద్దరాజు, మేనల్లుడు గోవిందరాజు ముందుగానే మేడారం చేరుకొని ఎదురు చూస్తుంటారు. సమ్మక్క ఆగమనానికి ముందుగా వారిరువురు తరువాయి 6లో





కుంచెపోటు



క్రికెటర్లు అమ్ముడుపోతే గొప్పట, మనం అమ్ముడుపోతే తప్పట.. ఇదేం న్యాయం?

సిఐ డ్రంక్ డ్రైవ్

- రాంగ్‌రూట్లో వెళ్లి ఆటో, టూవీలర్లను ఢీకొన్న ఇన్నోవా
- భార్యాభర్తల పరిస్థితి విషమం?



మన తెలంగాణ/ జవహర్ నగర్ : హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట్ పోలీసు శిక్షణా కేంద్రంలో ట్రైనీ ఇన్‌స్పెక్టర్‌గా విధులను నిర్వహిస్తున్న గిరీష్‌రావు తన ఇన్నోవా వాహనంతో బీభత్సం సృష్టించాడు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ రాంగ్‌రూట్‌లో వచ్చి ఒక తరువాయి 6లో

కెటిఆర్ ఉత్తుత్తి పెట్టుబడులు

దావోస్ నుంచి ఆహ్వానం రాలేదు, అందరిలాగే రిజిస్టర్ చేయించుకొని వెళ్లారు : ఉత్తమ్



మన తెలంగాణ / హైదరాబాద్ : దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు మంత్రి కెటిఆర్ అందరిలాగే రిజిస్ట్రేషన్ చేయించుకొని వెళ్ళారే తప్ప అధికారికంగా ఆహ్వానం రాలేదని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమకుమార్ రెడ్డి ఆరోపించారు. దావోస్‌లో కెటిఆర్‌కు అపూర్వ స్వాగతం, అరుదైన అవకాశం అంటూ బూటకపు ప్రచారాలు చేసుకొని మోసం చేస్తున్నారని అన్నారు. అక్కడ వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెబుతున్న మాటలు పూర్తిగా అబద్ధమని, బి.ఆర్. శెట్టి అనే వ్యాపారి రూ.4 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నట్టు ప్రచారం బూటకమని విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం నాడు రంగారెడ్డి జిల్లా మాల్ గ్రామ సర్పంచ్ పద్మ టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరారు. ఆమెతో పాటు టిఆర్ఎస్ నాయకులు జహంగీర్, పలువురు వార్డుసభ్యులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు క్యామ మల్లేశం అధ్యక్షతన జరిగిన సభలో ఉత్తమ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ బి.ఆర్.శెట్టి అనే వ్యాపారి పెట్టుబడులు తరువాయి 6లో

ఎదురులేని టిఆర్ఎస్

పంచాయతీ ఉప ఎన్నికల్లో 16 సర్పంచ్‌లు అధికారపార్టీ కైవసం, 4 కాంగ్రెస్, ఒకటి బిజెపి, ఇద్దరు స్వతంత్రులు విజయం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో వివిధ కారణాలతో ఖాళీ అయిన సర్పంచ్, వార్డులకు సోమవారం జరిగిన ఉప ఎన్నికల్లో అధికార టిఆర్ఎస్ మద్దతు కలిగిన అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో గెలుపొందారు. 28 జిల్లాల్లో 23 సర్పంచ్ స్థానాలకు, 165 వార్డులకు సోమవారం ఉపఎన్నికలు జరిగాయి. పోలింగ్ ప్రశాంతంగా జరిగిన ఎన్నికల్లో పదహారు చోట్ల టిఆర్ఎస్, నాలుగుచోట్ల కాంగ్రెస్, ఒకచోట బిజెపి మద్దతు కలిగిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా గెలుపొందారు. మరో రెండు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. టిఆర్ఎస్‌కు గట్టి పునాది ఉన్న సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో కాంగ్రెస్ అనుకూల అభ్యర్థులు గెలుపొందడం విశేషం. సిపిఎంకు కంచుకోటగా ఉన్న సుజాతానగర్ (భద్రాద్రి కొత్తగూడం జిల్లా) లో అన్ని పార్టీలు ఏకమై అభ్యర్థిని నిలబెట్టినా టిఆర్ఎస్ మద్దతు అభ్యర్థి 1126 తరువాయి 6లో

సత్యసాయి స్ఫూర్తితో సేవ : పవన్



పుట్టపర్తి: సత్యసాయిబాబా చూపిన బాటలోనే జనసేన పయనిస్తుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వెల్లడించారు. సోమవారం ఉదయం ఆయన పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు చేయలేని ఎన్నో పనులను సత్యసాయిబాబా చేసి చూపించారన్నారు. సత్యసాయి స్ఫూర్తితోనే జనసేన సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లా, రాష్ట్రం, దేశానికే పరిమితం కాకుండా సత్యసాయి సేవా సంస్థలు ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. రామకృష్ణ పరమహంస, సత్యసాయిబాబా ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇచ్చిన మహనీయులని కొనియాడారు. సత్యసాయిబాబా పేరుతో ఓ జిల్లాను ఏర్పాటు చేయాలనేది జనసేన పార్టీ అభిలాషని పవన్ పేర్కొన్నారు. తాను చెన్నైలో ఉన్న సమయంలోనే సత్యసాయి సేవల గురించి తెలుసు కున్నట్టు ఆయన వెల్లడించారు. సత్యసాయి ఆశ్రమాన్ని సందర్శించడం తన అదృష్టమని ఆయన తెలిపారు.

పంచాయతీరాజ్‌కు రూ.464.23 కోట్లు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి

మన తెలంగాణ/హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రభుత్వం రూ. 464.23 కోట్ల నిధుల విడుదలకు పరిపాలనా అనుమతుల్ని మంజూరు చేసింది. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ ఇందుకు సంబంధించిన ఉత్తర్వుల్ని సోమవారం జారీ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017–18) బడ్జెట్ కేటాయింపు ప్రకారం 14వ ఆర్థిక సంఘం నిబంధనల మేరకు ఈ నిధులకు ఆయన అనుమతులు ఇచ్చారు. ఉన్నత స్థాయి కమిటీ ఆమోదించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం నిధుల వినియోగానికి సంబంధించి వినియోగ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో వికాస్‌రాజ్ పేర్కొన్నారు.

వర్గీకరణ బిల్లుకు కేంద్రంపై ఒత్తిడి

- సిఎం ముందుకు రాకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఢిల్లీకి అఖిలపక్షం
- ఎంఆర్‌పిఎస్ పోరుకు అఖిలపక్షం సహకారం



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు త్వరలోనే ఢిల్లీకి వెళ్లాలని అఖిలపక్షం నిర్ణయించింది. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికార టిఆర్‌ఎస్ మినహా ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, రాజకీయ జెఎసి ప్రతినిధులు పాల్గొని వర్గీకరణ పోరుకు మద్దతు తెలిపారు. సిఎం కెసిఆర్ శాసనసభలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సమావేశం డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి ముందుకు రాని పక్షంలో ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లేందుకు సిపిఐ సంసిద్ధత వ్యక్తం చేసింది. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లేందుకు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ చొరవ చూపాలని, లేదంటే సిపిఐ చొరవ తీసుకుని అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తుందని ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రకటించారు. సిపిఐ నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధమని పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రెండు రోజుల్లో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళుతామని శాసనసభలో ముఖ్యమంత్రి ప్రకటించిన విషయాన్నిఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కెసిఆర్ పాలనలో నిర్బంధాలు పెరిగిపోయాయని, ఇంట్లో నిరసన తెలుపడానికి కూడా అవకాశం లేకుండా మందకృష్ణను అరెస్టు చేసి జైలుకు పంపడం చూస్తే తెలంగాణలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందనడానికి మరో ఉదాహరణ అవసరం లేదన్నారు. ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదంటున్న సిఎం కెసిఆర్ ప్రధాని హైదరాబాద్ వచ్చినపుడు ఎందుకు అఖిలపక్షాన్ని కల్పించలేదని ప్రశ్నించారు. వర్గీకరణ బిల్లు విషయమై పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీతో మాట్లాడుతానని అన్నారు. అంతకుముందు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఎంఆర్‌పిఎస్ అలుపెరగని పాత్ర పోషించిందని, త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణలో నిర్బంధాలు పెరిగాయని విమర్శించారు. సిఎం తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానిపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. టిజెఎసి చైర్మన్ ప్రొ.కోదండరామ్ మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ ఉద్యమం మాదిగలు ఆత్మగౌరవంతో నిలిచేలా చేసిందన్నారు. అసెంబ్లీలో ప్రకటించినట్లుగా సిఎం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ వర్గీకరణ న్యాయ సమ్మతమైందని, బిజెపి సిద్ధాంతపరంగా వర్గీకరణకు సానుకూలమని అన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామన్న ముఖ్యమంత్రి ముందుకు రాకపోగా, ఉద్యమం చేస్తున్న నేతలను అరెస్టు చేసి అమానుషంగా ప్రవరిస్తున్నారని విమర్శించారు. బుధవారం ఢిల్లీకి వెళ్లి పార్టీ అధ్యక్షుడితో ఈ విషయమై చర్చించనున్నట్లు తెలిపారు. టిడిపి అధ్యక్షుడు ఎల్.రమణ మాట్లాడుతూ వర్గీకరణకు పూర్తి సహకారం ఉంటుందన్నారు. వర్గీకరణ కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాములు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు అందరూ సమర్థిస్తున్నా ఎందుకు డిలే అవుతుందని ప్రశ్నించారు. బిజెపి, కాంగ్రెస్ తల్చుకుంటే ఇది పెద్ద సమస్య కాదన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ కులపిచ్చి ఉద్య మం కాదని, అదో కుల స్పృహ కలిగిన ఉద్యమమని అన్నారు. అందుకే ఎంఆర్‌పిఎస్ ఉద్యమానికి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. మందకృష్ణకు పూర్తి సహకారం ఉంటుందన్నారు. తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ వర్గీకరణ బిల్లు కోసం జాతీయ స్థాయిలో ఒక ఫ్రంట్ ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటించాలన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసి కార్యదర్శి వర్గ సభ్యులు గోవర్ధన్ మాట్లాడుతూ వర్గీకరణకు ఈ సమావేశాల్లోనే బిల్లు పెట్టాలని, ఇందు కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమించాలన్నారు.

విధి నిర్వహణలో ఆదర్శంగా నిలవాలి

- శిక్షణ ముగించుకున్న కానిస్టేబుళ్లకు డిజిపి మహేందర్‌రెడ్డి పిలుపు



మన తెలంగాణ/హైదరాబాద్: విధి నిర్వహణలో ఆదర్శంగా నిలవాలని శిక్షణ ముగించుకున్న కానిస్టేబుళ్లకు రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు (టిఎస్‌ఎస్‌పి)కు ఎంపికైన 935 మంది కానిస్టేబుళ్లు తొమ్మిది నెలల శిక్షణ అనంతరం సోమవారం ఇబ్రహీంపట్నం అక్టోపస్ శిక్షణ కేంద్రం ఆవరణలో నిర్వహించిన పాసింగ్ అవుట్ పెరేడ్‌కు మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలకు అందించే సేవలపై, విధివిధానాలు, తదితర నైపుణ్యాలపై తొమ్మిది నెలల శిక్షణ అందించడం జరిగిందన్నారు. ప్రతీ పోలీసు లక్ష్యాలు సాధించే దిశగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజల రక్షణ అవసరాలు దృష్టిలో ఉంచుకొని సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధించేందుకు ఎప్పటికప్పుడు అందించే సేవలపై జవాబుదారీతనం, ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం చాలా అవసరం అని పేర్కొన్నారు. ప్రతీ అధికారి వారు నిర్వహించే విధులను పరిశీలించుకోవాలన్నారు. తద్వారా శాఖాపరమైన విజయాలు సాధించడం సాధ్యపడుతుందన్నారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ నైతిక మార్గంలో నడిచేందుకు కుటుంబ సభ్యులు తోడుగా ఉండాలని ఆయన కోరారు. ప్రజలను రక్షించేందుకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసేందుకు ప్రతీ అధికారి తమ ఆలోచనలో, విధి నిర్వహణలో ప్రజల పట్ల సేవాభావం కలిగి ఉండాలన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టే అధికారులు చట్టాన్ని గౌరవించి నడుచుకోవాలని, శాఖలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టే మొదటిరోజు నుంచే ఉత్సాహం, దేహదారుఢ్యం పదవీ విరమణ రోజు వరకు ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్, బెటాలియన్ ఐజి అభిలాష భీష్ట్, అపరేషన్స్ ఐజి కె.శ్రీనివాస్‌రెడ్డి, సిఐడి ఐజి షికా గోయల్, ఐజి రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇంత ఎక్కువ సంఖ్యలో కానిస్టేబుళ్లు ఒకేసారి శిక్షణ పూర్తి చేసుకొని పరేడ్‌లో పాల్గొనడం రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇదే మొదటిసారి.

అక్రమ సంబంధానికి దారితీసిన ఫేస్‌బుక్ పరిచయం



మన తెలంగాణ/శంషాబాద్: ఫేస్‌బుక్ పరిచయంతో ఓ మహిళ కట్టుకున్న భర్తను, కొడుకుని అర్థాంతరంగా వదిలి ప్రియుడితో పారిపోయిన సంఘటన సోమవారం శంషాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలోని మొఘల్‌పురా పోలీసు స్టేషన్‌లో చోటుచేసుకుంది. భర్త నాగారాజ్ తెలిపిన వివరాల ప్రకారం నాగరాజ్, స్నేహలకు 2013లో వివాహం జరిగిందన్నారు. వీరికి మూడేళ్ల వయస్సు బాబు ఉన్నాడు. అయితే కొంతకాలం క్రితం స్నేహకు మొఘల్‌పపురా పోలీ సు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సందీప్ కుమార్‌తో ఫేస్‌బుక్‌లో పరిచయం అయిందన్నారు. ఈ పరిచయం అక్రమ సంబంధానికి దారి తీయడంతో నెల రోజుల క్రితం పుట్టింటికి అంటూ బా బుతో వెళ్లి సందీప్‌తో కలిసి అనంతగిరి కొండకు వెళ్లినట్లు తెలిపారు. అయితే గత 15రోజుల క్రితం తన బాబును ఇక్కడ వదిలేసి ప్రియుడితో కలిసి వెళ్తునట్లు చెప్పిందన్నారు. భార్య స్నేహ, కానిస్టేబుల్ సందీప్‌పై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తునట్లు ఆర్‌జిఐఎ ఎస్‌ఐ పైడినాయుడు తెలిపారు.

సింగరేణిని సందర్శించిన కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి

మన తెలంగాణ/గోదావరిఖని: సింగరేణిలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి సుశీల్‌కుమార్ సోమవారం పర్యటించారు. ఆర్జీ1 పరిధిలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్1, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్2, జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లలో సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఎఎస్ శ్రీధర్ వాటి స్థితి గతులను, విధి, విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాజెక్టుల ప్లాన్‌లను వ్యూ పాయింట్ వద్ద నుండి ఓపెన్ కాస్ట్‌లో జరుగుతున్న ఓబి రిమూవింగ్, కోల్ బెంచ్‌లు, కోల్ ట్రాన్స్ పోర్టేషన్, సంస్థ స్థితి గతులను తెలిపారు.

వచ్చే ఏడాది 'తప్పనిసరి తెలుగు'

- సిలబస్ రూపకల్పనపై అధికారులకు ఉప ముఖ్యమంత్రి కడియం ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి మొదలు ఇంటర్ వరకు తెలుగు భాషను తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాల్సిందేనని, ఇందుకు అవసరమైన సిలబస్, పుస్తకాలను రూపొందించాలని సంబంధిత అధికారులకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి స్పష్టం చేశారు. అన్ని స్థాయిల్లోని విద్యార్థులకు ఇబ్బంది కలగని తీరులో తెలుగు భాషను తప్పనిసరిగా అమలుచేసేలా, ఆస్తకికర సబ్జెక్టుగా, స్కోరింగ్ సబ్జెక్టుగా రూపొందించాలని ఆదేశించారు. విద్యాశాఖ మంత్రి కూడా అయిన కడియం శ్రీహరి అధ్యక్షతన సచివాలయంలో సోమవారం సాయంత్రం ఉప కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్ష జరిగింది. తమిళనాడు, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో మాతృభాషను తప్పనిసరి సబ్జెక్టుగా అమలుచేస్తున్న విధానాన్ని, అక్కడికంటే తెలంగాణలో ఉత్తమంగా ఈ విధానాన్ని అమలు చేయడానికి రూపొందించాల్సిన వివరాల పై ఈ సమావేశంలో చర్చ జరిగింది. వివిధ రా ష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం చేయాల్సిందిగా గతంలో ముఖ్యమంత్రి కెసి ఆర్ ఆదేశం మేరకు పర్యటించి వచ్చిన అధికా రులు నివేదికను ఉప ముఖ్యమంత్రికి అంద జేశారు. ఒక్క సంవత్సరంలోనే తెలుగు భాషను సుల భంగా నేర్చుకునేలా పుస్తకాలను రూపొందించనున్న ట్లు, ఆసక్తికర సబ్జెక్టు స్థాయి నుంచి మార్కుల స్కోరిం గ్ సబ్జెక్టుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు వివరించారు. సిబిఎస్‌ఇ, ఐసిఎస్‌ఇ సిలబస్‌లో చదువుకున్న విద్యార్థులకు కూడా తప్పనిసరి తెలుగును అమలుచేసేలా ఇప్పటికే సంబంధిత అధికారులతో మాట్లాడామని, ఎలాంటి అభ్యంతరం లేదన్న సమాధానం వచ్చినట్లు అధికారులు వివరించారు.

భాషా పండితుల అప్‌గ్రేడేషన్

భాషా పండితుల అప్ గ్రేడేషన్‌పై అధికారులతో ఉప ముఖ్యమంత్రి ఈ సమావేశంలో చర్చించారు. సిఎం కెసిఆర్ గత నెలలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఇచ్చిన హామీ మేరకు భాషా పండితుల అప్‌గ్రేడేషన్ అమల్లోకి రావాలని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. న్యాయ సలహా తీసుకుని ఈ అంశంలో తగిన పరిష్కార మార్గాలను సూచించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు కిషన్, తెలుగు భాషను తప్పనిసరిగా చేసే అమలు ఉప కమిటీ చైర్మన్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ ఇంట్లో చోరీకి యత్నం



మన తెలంగాణ/కామారెడ్డి: కామారెడ్డి జాయింట్ కలెక్టర్ సత్తయ్య ఇంట్లో చోరీ యత్నం జరిగింది. జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ కాలనీ లోని జాయింట్ కలెక్టర్ సత్తయ్య ఇంట్లో ఆదివా రం అర్ధ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తా ళాన్ని పగులగొట్టి ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. జెసి సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కామా రెడ్డి కలెక్టర్ సత్యనారాయణ అనుమతితో హైదరాబాద్‌కు వెళ్లానని, సోమవారం ఉదయం ఇంటి పని మనిషి వచ్చి చూసే సరికి తాళం పగుల గొట్టి ఉందని గుర్తించామన్నారు. ఇంట్లో ఉన్న లాకర్లు, బీరువాలను దొంగలు వెతికినట్లు తెలిపారు. ఇంట్లో ఏమీ లేకపోవడం వల్ల దొంగతనానికి వచ్చిన దుండగులు వెనుదిరిగినట్లు వివరించారు. ఎలాంటి నష్టం జరగలేదని ఆయన తెలిపారు. జెసి ఇంటి సమీపంలోనే ఎస్‌పి శ్వేతా రెడ్డి క్యాంపు కార్యాలయం ఉంది. దుండగులు జెసి ఇంట్లోనే కన్నం వేయడంపై జిల్లా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని అతి పురాతనమైన గోపాలస్వామి మందిరంలో ఆర కోటికి పైగా విలువ గల కృష్ణ, సత్యభామ, రుక్మిణి పంచ లోహ విగ్రహాలను దుండగులు దొంగిలించిన విషయం విధితమే. జిల్లా ప్రజలు ఈ ఘటన మరువక ముందే ఏకంగా జెసి ఇంట్లోనే చోరీ జరగడంతో ఆందోళనకు గురవుతున్నారు. రోజు రోజుకు ఈ ఘటనలు పెరగ డంతో పోలీసులకు సవాలుగా మారింది.



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాదు

మన తెలంగాణ/ హైదరాబాద్ : వచ్చే ఎన్నికల్లో మొత్తం 119 శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవదని టిఆర్ఎస్ పరకాల ఎంఎల్‌ఎ చల్లా ధర్మారెడ్డి అన్నారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మహాకూటమి కట్టే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉన్నట్టు కనబడుతోందని, ఎన్ని కూటములు కట్టినా విజయం టిఆర్ఎస్‌దేనని చెప్పారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో పాత కాంగ్రెస్ వారే మళ్ళీ కాంగ్రెస్‌లో చేరిన సభలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 70 సీట్లు గెలుస్తామని ప్రగల్భాలు పలికారన్నారు. అవి ఉత్తర కుమార ప్రగల్భాలలాగా ఉన్నాయన్నారు. టిఆర్ఎస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిపై ఉత్తమ్ తో బహిరంగ చర్చకు సిద్ధమని, ఒక్క పరకాల నియోజకవర్గానికే గత మూడేళ్ళలో వెయ్యి కోట్ల నిధులు వచ్చాయని చెప్పారు.

దమ్ముంటే నాపై పోటీ చేయ్ : ఉత్తమ్‌కు దమ్ముంటే పరకాలలో తనపై పోటీ చేసి గెలవాలని, రేవంత్‌రెడ్డి వచ్చి పోటీ చేసినా సరే, వారిద్దరిలో ఎవరు గెలిచినా రాజకీయ సన్యాసం తీసుకుంటానని ధర్మారెడ్డి అన్నారు.

వ్యవసాయంపై వాతావ'రణం'

- **పడిపోతున్న పంట దిగుబడులకు వాతావరణ మార్పులే కారణం**
- **సగటున 15 నుంచి 18 శాతం ఆదాయంపై ప్రభావం**
- **జాతీయ ఆర్థిక సర్వేలో వెల్లడి**
- **సదస్సులు ఎన్ని నిర్వహిస్తున్నా.. దొరకని పరిష్కారం !**

మన తెలంగాణ/హైదరాబాద్ : వాతావరణంలో చోటు చేసుకుంటున్న పెను మార్పుల కారణంగా రానున్న కాలంలో వ్యవసాయం మరింత కష్టం కానుందా? దేశానికే అన్నం పెడుతున్న అన్నదాత ఆదాయాన్ని తీవ్రంగా దెబ్బతీయనుందా?అంటే...అవుననే సమాధానం వస్తోంది. ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావంతో మన దేశంలో ప్రస్తుతం ఏటా రూ. 64,122 కోట్లు వ్యవసాయోత్పత్తులు నష్టపోతున్నట్లు అంచనా. కేంద్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ఆర్థిక సర్వే 2017–18

ఆర్థిక సర్వే వ్యవసాయ ఆదాయంపై ప్రభావం

సీజన్	తీవ్రమైన ఎండలు (శాతం)	తీవ్రమైన వర్షాలు (శాతం)
ఖరీఫ్(ఇరిగేటెడ్)	7	7
ఖరీఫ్(అన్‌ఇరిగేటెడ్)	5.1	14.3
ఖరీఫ్ సగటు	4.3	7
రబీ(ఇరిగేటెడ్)	3.2	4
రబీ (అన్‌ఇరిగేటెడ్)	5.9	6.6
రబీ సగటు	4.1	5.5

కూడా ఇదే విషయాన్ని మరోమారు స్పష్టం చేసింది. వాతావరణంలో వస్తున్న తీవ్రమైన మార్పులు వ్యవసాయ ఆదాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంది. సర్వే ప్రకారం వాతావరణ మార్పులు సగటున 15 నుంచి 18 శాతం, వర్షాధార సాగు ప్రాంతాల్లో 20 నుంచి 25 శాతం వరకు రైతుల ఆదాయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. 2020 నాటికి ఇది మరింత వికృత రూపం దాల్చనుందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. దీనిపై రైతాంగంతో పాటు ప్రభుత్వాలు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. వ్యవసాయోత్పత్తులను దారుణంగా దెబ్బతీస్తున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులు మారితేనే ఉత్పాదకత కూడా పెరుగుతుందని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. అయితే ప్రస్తుతం ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం గమనార్హం.వాతావరణ మార్పులు దేశవ్యాప్తంగా పలు విధాలుగా రూపు తీసుకుంటున్నాయి. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకమైన తేడా ఉన్నా దేశవ్యాప్తంగా పలుచోట్ల వేసవిలో వర్షపాతం పెరగడం, మొత్తంగా వర్షం కురిసిన రోజుల సంఖ్య తగ్గడం కనిపిస్తోంది. మన రాష్ట్రంలో గత 8 సంవత్సరాల వర్షాకాలాన్ని పరిశీలిస్తే వాతావరణం పంటలపై ఎలాంటి ప్రభావం చూపిందో స్పష్టమౌతోంది. 2009–10 నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017–18 వరకు నైరుతి రుతుపవనాలు సకాలంలో రాక, వర్షాలు సరైన సమయంలో పడక పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ మొత్తం వ్యవధిలో 6 సార్లు లోటు వర్షపాతమే నమోదైంది. వాస్తవానికి జూన్, జూలై, ఆగస్టు మాసాలలో వర్షాలు తగినంతగా కురవడం లేదు.అయితే వాతావరణంలో మార్పుల కారణంగా వర్షకాలం ముగిసిన తరువాత పంట చేతికొచ్చే సమయానికి అక్టోబర్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి. గత రెండు సంవత్సరాలుగా మన రాష్ట్రంలో ఈ పరిస్థితులు చోటుచేసుకున్నాయి.



వానకాలంలో వర్షాలు సమయానికి పడకపోగా, యాసంగిలో పంట తీసే సమయానికి అకాల వర్షాలు, వడగండ్లు కురవడం ఇందుకు ఉదాహరణ. వాతావరణంలో వస్తున్న మార్పులు మార్పుల మూలంగా హానికరమైన, మేలుచేసే క్రిమికీటకాల మధ్య సహజమైన సమతూకం దెబ్బతింటోందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇవి చీడపీడలుపెరగడానికి దోహదం చేయనున్నాయి. 2017–18 వానకాలం సాగుకు వచ్చేసరికి తీవ్రమైన 'డ్రై స్పెల్స్' వచ్చి పత్తి పంటకు గులాబీ రంగు పురుగు సోకిన విషయం తెలిసిందే. అలాగే వరికి దోమ పోటు ఆశించి దిగుబడులు రాకుండా తీవ్రమైన నష్టం కలిగించింది. మరో వైపు వాతావరణ మార్పుల కారణగా ఉష్ణోగ్రతల పెరుగుదలతో రాష్ట్రంలో మొక్కజొన్న, వరి లాంటి పంటల్లో 25 శాతం వరకు దిగుబడులు తగ్గినట్లు, గోధుమలో 7 శాతం తగ్గుతుందని పరిశీలనాత్మకంగా నిరూపిత మైంది. ఇప్పటివరకువాతావరణ మార్పులు – వ్యవసాయం అనే అంశంపై ఎన్నో సమావేశాలను, సదస్సులను అంతర్జాతీయంగా, జాతీయంగా ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు నిర్వహించినప్పటికీ సరైన పరిష్కార మార్గాన్ని కనుగొని, ఆ దిశగా సాగే ప్రయత్నాలను మాత్రం చేయకపోవడం గమనార్హం.

'మిషన్'కు రూ.553.26కోట్ల రుణం

- **మంజూరు చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియా**

మన తెలంగాణ/హైదరాబాద్: మిషన్‌భగీరథ ప్రాజెక్టుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా 553.26 కోట్ల రుణం మంజూరు చేసింది. చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో తాగునీటి వసతి కల్పించే పనులకు ఈ నిధుల్ని వినియోగించాల్సి ఉంటుంది. వీటితో పాటు మహబూబ్‌నగర్ జిల్లా యెల్లూర్ రిజర్వాయర్ నుంచి నీరును తీసుకునేందుకు ప్రైమరీ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ నుంచి సెకండరీ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్, శ్రీశైలం–గుడిపల్లి సెకండరీ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ పనులకు ప్రభుత్వం ఉపయోగించనుంది. ఈ పనుల మొత్తం అంచనా వ్యయం 691.57 కోట్ల రూపాయలు కాగా బ్యాంక్ ఆఫ్ ఇండియా 553.26కోట్ల రూపాయలను 'టర్మ్ లోన్' కింద మంజూరు చేసింది. బ్యాంకు రుణం పొందేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఈ మేరకు సంబంధిత పత్రాలు అందచేసి ఒప్పందం కుదుర్చుకోవాలని తెలంగాణ వాటర్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్(టిడిడబ్ల్యుఎస్‌సిఎల్)కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. మిషన్ భగీరథ కోసం వివిధ బ్యాంకుల నుంచి మొత్తం 6365.22కోట్ల రూపాయలు రుణం తీసుకునేందుకు టిడిడబ్ల్యుఎస్‌సిఎల్ ఎండికి అనుమతినిచ్చింది. దీనికి ప్రభుత్వం పూచికత్తు ఇవ్వడంతో పాటు బడ్జెట్ నుంచి 1591.30కోట్ల రూపాయలు మార్జిన్ మనీ ఇవ్వనుంది. ఇందులో భాగంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి మంజూరైన 553.26 కోట్ల రూపాయలతో చేపట్టే పనులకు ప్రభుత్వం 138.31 కోట్ల రూపాయలు మార్జిన్ మనీ అందచేయనుంది.

బొడ్డు శ్రీనివాస్ హత్యపై కాంగ్రెస్‌ది అబద్ధపు ప్రచారం



మన తెలంగాణ/ హైదరాబాద్ : నల్గొండలో బొడ్డు శ్రీనివాస్ హత్య రాజకీయ పరమైంది కాదని పోలీసులు ఆధారాలతో సహా బయట పెట్టినా కాంగ్రెస్ నేతలు ఇంకా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. స్ట్రీట్ ఫైట్‌ను స్టేట్ ఫైట్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్న కోమటిరెడ్డి బ్రదర్స్ యత్నాల్లో సఫలం కాబోవన్నారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో టిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, పైలా శేఖర్‌రెడ్డి, ఎంఎల్‌సి పూల రవీందర్‌లతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బొడ్డు శ్రీనివాస్ హత్య జరిగిన వెంటనే ఆయన భార్య లక్ష్మి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో అనుచరులే నమ్మించి చంపారని ఆరోపించారని పల్లా చెప్పారు. కొన్ని గంటల తర్వాతే లక్ష్మిని కలిసిన కోమటిరెడ్డి ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా మాట్లాడాలనిఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి మీద ఆరోపణలు చేయడం జానారెడ్డికి తగదన్నారు. పూల రవీందర్ మాట్లాడారు.


రెండు పంటల బీమాకు ఒకటే ఇన్సూరెన్స్ కంపెనీ

మన తెలంగాణ/హైదరాబాద్ : గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రధాన మంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమాను అమలు చేయాలని రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ (ఎస్‌ఎల్‌సిసి) నిర్ణయించింది. అయితే ఈ రెండు పంటల బీమాను ఒకే ఇన్సురెన్సు కంపెనీ అమలు చేయనుంది. సచివాలయంలో వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారథి అధ్యక్షతన సోమవారం ఎస్‌ఎల్‌సిసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ జిల్లాలకు ఆరు క్లస్టర్స్‌లో ఉమ్మడిగా నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. బీమా ప్రీమియం చెల్లించిన మొత్తంలో నష్టం వాటిల్లితే 80 శాతం పరిహారం చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు. విధి విధానాలు రూపొందించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పంటల బీమా గడువు తేదీలు కూడా వానకాలం–2017 లాగే ఉండనుంది.

ఎస్‌టి విచారణ కమిషన్ గడువు పొడిగింపు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఎస్‌టి విచారణ కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగించింది. ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలపై విచారణ జరిపేందుకు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్ కింది రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎస్.చెల్లప్ప చైర్మన్‌గా ఎస్‌టి విచారణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరి 31తో కమిషన్ గడువు ముగుస్తున్నందున మరో ఏడాది (జనవరి 31, 2019) పాటు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిషన్‌లో రిటైర్డ్ ఐపిఎస్ కె.జగన్నాథ్‌రావు, రిటైర్డ్ లేబర్ అదనపు కమిషనర్ హెచ్.కె.నాగులు సభ్యులుగా ఉన్నారు. కమిషన్ గడువును గతంలో ఏడాది పాటు పొడిగించారు.

కలెక్టర్ ఆమ్రపాలి వివరణ కోరిన సిఎస్



మన తెలంగాణ/హైదరాబాద్ : గణతంత్ర దినోత్సవం రోజున ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే సమయంలో తడబడిన జిల్లా కలెక్టర్ కాటా ఆమ్రపాలిని ప్రధాన కార్యదర్శి వివరణ కోరారు. ప్రసంగిస్తున్న సమయంలో పదాలను పలకడంలో తడబడడమే కాకుండా నవ్వడంపై విమర్శలు వెల్లువెత్తడంతో సిఎస్ ఎస్పిసింగ్ సోమవారం ఆమె నుంచి ఫోన్‌లో వివరణ కోరారు. తెలుగు ప్రసంగంలో పదాలు పలకడంలో ఇబ్బంది ఎదురైందని, ఉద్దేశపూర్వకంగా తాను తప్పు చేయలేదని ఆమె వివరణ ఇచ్చారు. పదేపదే పొరపాటు దొర్లడం, పదాలను సరిగ్గా పలకలేకపోవడంతో నవ్వు వచ్చిందే తప్ప మరో కారణం లేదని సిఎస్‌కు వివరించినట్లు తెలిసింది.

మేడారం ముగింపు ఉత్సవాలకు ఉప రాష్ట్రపతి!

మన తెలంగాణ/హైదరాబాద్: మేడారం జాతర ముగింపుకు భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు హాజరుకానున్నారు. గత నెల రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, అటవీశాఖ మంత్రి జోగు రామన్న స్వయంగా ఢిల్లీ వెళ్లి ఉప రాష్ట్రపతిని మేడారం జాతరకు రావాలని ఆహ్వానించారు. జనవరి 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర మేడారంలో జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై ఉప రాష్ట్రపతి కార్యాలయం నుంచి ప్రభుత్వానికి సమాచారం వచ్చినట్లు తెలిసింది. ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం మేడారం చేరుకొని సమ్మక్క, సారలమ్మ గద్దెలను దర్శించుకుంటారు. సుమారు రెండు గంటల పాటు అక్కడే గడపనున్నట్లు తెలిసింది.

రైల్వే ఉద్యోగి స్టీఫెన్ ఆదిత్యకు జైలు శిక్ష ఖరారు

హైదరాబాద్: రైల్వే ఉద్యోగి స్టీఫెన్ ఆదిత్యకు సిబిఐ కోర్టు సోమవారం జైలు శిక్ష ఖరారు చేసింది. ఆదిత్యకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. రైల్వేలో ట్రైనీ ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న స్టీఫెన్ ఆదిత్య ఉద్యోగాల పేరిట పలువురిని మోసం చేశాడు. దీంతో 2013లో రైల్వే విజిలెన్స్ అధికారులు ఆదిత్యను సిబిఐకి అప్పగించారు.

పోలీసులనే కిడ్నాప్ చేశాడు

భోపాల్: పన్నా జిల్లా బాముర్హా గ్రామంలో ఓ దుండగుడు పోలీసులనే కిడ్నాప్ చేశాడు. ఆ దుండగుడు 100 నెంబర్‌కు డయల్ చేసి పోలీసులకు ఏ దో చెప్పాడు. తక్షణమే స్పందించిన పోలీసులు ఘ టనాస్థలికి చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడాన్ని పోలీసులు గమనించారు. అతడికి సహాయం చేద్దామనుకునే లోపలో ఆ వ్యక్తి లేచి పోలీసులకు గన్ గురిపెట్టాడు. మరో నలుగురుదుండగులు అతడితో జాయిన్ అయ్యారు. ఈ క్రమంలో ఇద్దరు పోలీసులను కిడ్నాప్ చేసి పోలీస్ వాహనంలోనే పారిపోయారు. అదే వాహనంలో ఓ యువతిని కూడా కిడ్నాప్ చేశారు. కొంతదూరం వెళ్లిన తరువాత పోలీసులను, వాహనాన్ని వదిలేసిన దుండగులు ఆ యువతిని మాత్రం తీసుకొని వెళ్లిపోయారు. దుండగుల కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నట్టు పన్నా ఎస్‌పి రియాజ్ ఇక్బాల్ తెలిపారు.

నిత్యానందను అరెస్ట్ చేయండి

చెన్నై : స్వయం ప్రకటిత భగవాన్ నిత్యానందను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చాలని సోమవారం మద్రాస్ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. తప్పుడు ప్రకటనలు, తప్పుడు సమాచారం ఇచ్చి కోర్టును తప్పుదోవ పట్టించాడని నిత్యానందపై కోర్టు మండిపడింది. పలు మార్లు హెచ్చరించినప్పటికీ తన తప్పులను సరిదిద్దుకోలేదని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అతడేమీ అందరికీ అతీతుడు కాదని హైకోర్టు జడ్జి జస్టిస్ మహాదేవన్ పేర్కొన్నారు. కోర్టు రిజిస్ట్రీ నుంచి వారెంట్ తీసుకొని నిత్యానందను అరెస్ట్ చేయాలని పోలీసులకు సూచించారు.

ఆన్‌లైన్‌లో మారణ ఆయుధాల కొనుగోలు



- **12మంది అరెస్ట్, ఆన్‌లైన్ సంస్థపై కేసు నమోదు**

మన తెలంగాణ/సికింద్రాబాద్ : మారణాయుధాలు కలిగి ఉన్న పలువురిని నార్త్‌జోన్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. నార్త్ జోన్ డిసిపి రాధా కిషన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో మారణాయుధాలతో సంచరిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆన్‌లైన్ ద్వారా నిషేధించిన కత్తులు, డాగర్ వంటి మారణాయుధాలు కొనుగోలు చేసి దగ్గర ఉంచుకోవడమే కాకుండా శుభకార్యాలలో మారణాయుధాలతో ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పోస్టింగులు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న 12 మంది నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 కత్తులు, 02 డాగర్‌లు, 02 పెద్ద కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆయుధాలను సమకూర్చుకొని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సోషల్ మీడియాలో పోస్టింగులు చేస్తున్న సూద్ అమర్‌సింగ్, తుషాం కునాల్ సింగ్, సుదీర్‌సింగ్, మహ్మద్ సలామ్, ముస్తఫా హుస్సేన్, బిసెంట్ శశికాంత్ సింగ్, మహ్మద్ యాసిన్ ఆహ్మద్, మహ్మద్ రవూఫ్, సల్మాన్ ఖాన్, మహ్మద్ సిరాజుద్దీన్, మహ్మద్ సోహాయిల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నగరంలోని ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నివాసముంటున్న వీరిపై విశ్వసనీయ సమాచారం మేరకు దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆన్ లైన్ సంస్థ పై కూడా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. నిషేధించిన మారణాయుధాలను ప్రత్యక్షంగా గాని, ఆన్ లైన్ ద్వారా కాని కొనుగోలు చేయడం, చట్టాన్ని ఉల్లంఘించి మారణాయుధాలతో సంచరించడం, సోషల్ మీడియాలో పోస్టులు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

మాజీ ఎంఎల్‌ఎ లింగయ్యకూ ప్రాణహాని

- **ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు**
- **బొడ్డుపల్లి హత్య కేసులో మిర్చి బండి యాజమానిని ప్రశ్నించలేదేం? : కోమటిరెడ్డి**



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఒకటి, రెండు నెలల్లో నకిరేకల్ మాజీ ఎంఎల్‌ఎ చిరుమర్తి లింగయ్యను చంపేయబోతున్నారని సిఎల్‌పి ఉప నేత, నల్లగొండ ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పటికే టిఆర్ఎస్ ఎంఎల్‌ఎ వేముల వీరేశం మనుషుల నుండి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని పోలీసులకు నెంబర్‌లతో సహా లింగయ్య ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నల్లగొండ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య వెనుక సిఎం హస్తం లేదని నిరూపించుకోవాలంటే తక్షణమే ఆ కేసును సిబిఐకి అప్పగించాలని, లేదంటే తాము సిబిఐ దర్యాప్తు కోరుతూ కోర్టులో పిటిషన్ వేస్తామన్నారు. శాసనసభ మీడియా హాల్‌లో కాంగ్రెస్ నేత వి.హనుమంతరావుతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. బొడ్డుపల్లి శ్రీనివాస్‌ది ముఖ్యమంత్రి కెసిఆర్ మద్దతుతో డిఎస్‌పి, ఎంఎల్‌ఎ వీరేశం చేయించిన రాజకీయ హత్య అని ఆరోపించారు.

కోదండరామ్‌ను లేపేస్తారేమో: విహెచ్ : పోలీసులు ప్రభుత్వం ఏదీ చెబితే అది చేస్తారని, సిఎం కెసిఆర్ ఎన్నికలు దగ్గరకు వస్తుండడంతో అందరినీ భయభ్రాంతులకు గురి చేసేందుకు చూస్తున్నారని వి.హనుమంతరావు ఆరోపించారు. పరిస్థితులు చూస్తుంటే కోదండరామ్‌ను లేపేసినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. సిఎం కెసిఆర్‌ను దింపాలంటే అందరూ ఏకం కావాల్సిందేనని అభిప్రాయపడ్డారు.

సిట్‌కు అప్పగించాలి : పొంగులేటి : రాష్ట్రంలో విచ్చలవిడిగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలపై దాడులు జరుగుతున్నాయని, బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసును సిట్ కు అప్పగించాలని సిఎల్‌పి ఉప నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

నన్ను ఎన్‌కౌంటర్ చేయడానికి ప్రభుత్వం యత్నం

- **ఒంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపణ**

మన తెలంగాణ/మాదన్నపేట్: కెసిఆర్ ప్రభుత్వం నాపై అక్రమ కేసులు నమోదు చేయడమే కాకుండా, నన్ను ఎన్‌కౌంటర్ చేయాడానికి ప్రయత్నిస్తుందని టిడిపి రైతు నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం చంచల్‌గూడ జైలు నుంచి తమ నాయకుడు విడుదలవుతున్నాడని తెలియడంతో గజ్వేల్ ప్రజలు భారీ సంఖ్యలో చంచల్‌గూడ జైలుకు చేరుకున్నారు. జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన అనంతరం ఆయన మాట్లాడుతూ మూడున్నర సంవత్సర కాలంలో కెసిఆర్ నాపై 11 అక్రమ కేసులు నమోదు చేయించారన్నారు. నా స్వగ్రామానికి చెందిన ఒయూ విద్యార్థి మురళీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకుంటే చూడటానికి వెళ్లిన నన్ను పోలీసులతో నిర్భందించి నాపై దాడి చేయించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం 80 గంటలు దీక్ష చేస్తున్న నాకు మద్దతు పలికిన కెసిఆర్ రాష్ట్రానికి నియంతలా వ్యవహరిస్తున్నారు. కెసిఆర్ కు టుంబంలా నేను అవినీతికి పాల్పడలేదన్నారు. నాపై సిఎం కక్ష్య సాధింపు చర్యలు సరికాదన్నారు.

విడాకుల ఖరీదు రూ.5 లక్షలు





మన తెలంగాణ/హైదరాబాద్: విడాకులకు డిసిపి బాబురావు రూ.5 లక్షల బేరం పెట్టారు. దీంతో అవాక్కయిన అతని భార్య వేదశ్రీ సున్నితంగా తిరస్కరించారు. ఈ సంఘటన విజయవాడ ఫ్యామిలీ కోర్టులో సోమవారం బాబురావు దంపతులకు జరిగిన ఫ్యామిలీ కౌన్సిలింగ్‌లో చోటుచేసుకుంది. హైదరాబాద్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు హెడ్‌క్వార్టర్‌లో డిసిపిగా పనిచేస్తున్న బాబురావుపై విజయవాడ ఫ్యామిలీ కోర్టులో అతని భార్య వేధశ్రీ మనోవర్తి (జీవన భృతి) కేసు వేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 7న కౌన్సిలింగ్ హాజరు కాని బాబురావు సోమవారం కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. కౌన్సిలింగ్‌లో వేధశ్రీ తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను సరిగా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తనకు పెళ్లికి ఎదిగిన పిల్లలు ఉన్నారని, వారి ఆలన పాలన కూడా చూడడం లేదని కన్నీటిపర్యంతం అయ్యారు. బాబురావు మాత్రం కౌన్సిలింగ్‌లో కొంత అసహానికి గురయ్యారు. దీంతో కౌన్సిలింగ్‌ను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా పడింది. అతని తరపు న్యాయవాదులు వేదశ్రీతో మాట్లాడుతూ రూ.5 లక్షలు పరిహారంగా బాబురావు ఇస్తారు, విడాకులు ఇచ్చేయండి అని రాయబారం నడిపారు. అయితే తనకు పరిహారం వద్దని, తనకు భర్తే కావాలని బాబురావు తరపు న్యాయవాదితో చెప్పానని వేదశ్రీ మీడియాతో వాపోయింది. తనకు న్యాయస్థానంపై నమ్మకం ఉందని, తనకు, తన పిల్లలకు న్యాయస్థానం న్యాయం చేస్తుందనే నమ్మకం తమకుందని ఆమె అన్నారు. హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టులో బాబురావు వేసిన విడాకుల కేసులో తనకు రూ.5 లక్షలు ఇస్తాననడం ఎంత వరకు సమంజసమన్నారు. తన భర్త తన వద్దకు వస్తానంటే బాబురావుకే రూ.5లక్షలు ఇస్తానని ఆమె చెప్పారు.

ధూల్‌పేట వాసులకు ఆటోల పంపిణీ

- **గుడుంబా తయారీని మానేసినందుకు పునరావాసంలో భాగంగా అందజేత**



మనతెలంగాణ/హైదరాబాద్: గుడుంబాను తయారు చేయడం మానేసిన ధూల్‌పేట్ వాసులకు పునరావాసంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, అబ్కారీ మంత్రి పద్మారావులు సోమవారం ఆటోలను పంపిణీ చేశారు. పీపుల్స్ ప్లాజాలో జరిగిన ఈ కార్యక్రమంలో గుడుంబా మానిన ధూల్‌పేట వాసులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. గుడుంబా తయారీని మానేయడం శుభసూచకమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధూల్‌పేటలో పరిశ్రమ స్థాపనకు కృషి చేస్తామన్నారు. పునరావాస కార్యక్రమంలో భాగంగా 47 కుటుంబాలకు ఆటోలను అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 6066 కుటుంబాలకు ఆర్థిక సహాయం ఇప్పటి వరకు అందించడం జరిగిందన్నారు. గుడుంబా రహిత రాష్ట్రంగా తెలంగాణాను మార్చేందకు చిత్తశుద్ధితో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా గుడుం బా నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గతంలో బ్రతుకు తెరువు కోసం గుడుంబా వ్యాపారం నిర్వహించిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అబ్కారీ మంత్రి పద్మారావు, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్, అబ్కారీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సోమేష్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్, ఎమ్మెల్యే రాజాసింగ్, కలెక్టర్ యోగితారానా పాల్గొన్నారు.



"ఒక్కొక్క సిరా బిందువుకు కోట్లకొలది ప్రజలను ఆలోచింపచేయగల శక్తి ఉంటుంది. – బైరన్"

మోడీ సర్కారు ఆత్మతృప్తి

సంపాదకీయం

సోమవారంనాడు పార్లమెంటు ఉభయ సభల సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన ప్రసంగం ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం పలికించిన చిలుక పలుకుల సమాహారమే. అది సంప్రదాయం. ఈ పలుకులలో మోడీ సర్కారు ప్రధాన ఉద్దేశాలన్నీ పూసగుచ్చి ఉన్నాయి. వాటి మంచిచెడ్డల గురించి చర్చించి నిగ్గు తేల్చుకోవడం మన విధి. రాష్ట్రపతి ప్రసంగంలో ముఖ్యంగా గమనించదగినది పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాల ఎన్నికల గురించి చేసిన ప్రస్తావన. ఇది మొదటి సారిగా ఇప్పుడే లోకవిదితమైన విషయం కాదు. ఇప్పటికనేకసార్లు ప్రధాని నోట వెలువడి మీడియాలో, ఇతరత్రా ఎంతోకొంత చర్చకు నోచుకున్నదే. అయితే మోడీ ప్రభుత్వం ఈసారి పనికట్టుకుని రాష్ట్రపతి ప్రసంగంలో దీనిని ప్రముఖంగా చేర్చడం ప్రధాని మళ్లీ ఈ విషయాన్ని మరోసారి ప్రస్తావించడం గమనించవలసిన అంశాలు. జమిలి లేదా ఏకకాల ఎన్నికలు ఇప్పట్లో సాధ్యం కావని, కొన్ని సంవత్సరాలైనా వ్యవధి అవసరమని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు సహా పలువురు నిపుణులు ఇప్పటికే అభిప్రాయపడ్డారు.

ఎప్పుడూ ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలలో యంత్రాంగం నిమగ్నమై ఉండడం వల్ల మానవ వనరుల మీద తీవ్రమైన భారం పడుతున్నదని, నియమావళి కారణంగా అభివృద్ధి కృషి కుంటుపడుతోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. అన్ని ఎన్నికలు ఒకేసారి జరిపించితే ఈ పరిస్థితి తొలగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది వినడానికి బాగానే ఉంది కానీ దీనివల్ల దేశంలో ప్రజాస్వామ్య మౌలిక లక్షణమైన ఎప్పటికప్పుడు జనాభిప్రాయ వ్యక్తీకరణ వెసులుబాటుకు తీవ్ర విఘాతం కలుగుతుంది. పార్లమెంటు ఎన్నికలలో జాతీయ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకొని ఓటు వేసే ప్రజలు అసెంబ్లీల దగ్గరికి వచ్చేసరికి స్థానిక అవసరాల ప్రాతిపదికగా వ్యవహరిస్తారు. జమిలి ఎన్నికల వల్ల ఈ తేడా చెరిగిపోయే ప్రమాదం తలెత్తుతుంది. ఇంత భారీ ఎన్నికల పర్వంవల్ల నిధుల సమీకరణలో పెద్ద చేతులైన జాతీయ పార్టీలు తిమింగలాల్లా మొత్తం రంగాన్ని ఆవహించుకుని ప్రాంతీయాది పార్టీలైన చిన్న చేపలను కబళించే ముప్పు ముంచుకు వస్తుంది. అందుచేత జమిలి ఎన్నికల విషయంలో ప్రజలు ఎంతైనా జాగరూకత వహించవలసి ఉంది. ఇందులో ఇమిడిఉన్న అనేక సున్నితమైన అంశాలపై జాతీయ స్థాయిలోనూ, ప్రాంతీయంగానూ మరింత విస్తృతమైన చర్చ, అభిప్రాయ మథనం జరగాలి.

రాష్ట్రపతి తన ప్రసంగంలో స్వచ్ఛ భారత్, మహిళోద్ధరణ వంటి రంగాలలో 'విజయాలను' ఏకరువు పెట్టి ప్రభుత్వ ఆత్మస్తుతిని ప్రదర్శించారు. అదే సమయంలో ట్రిపుల్ తలాక్ బిల్లుకు పార్లమెంటు సంపూర్ణ ఆమోదాన్ని సాధించుకుంటామని ప్రకటించారు. ఈ బిల్లు ముస్లిం మహిళలపట్ల మొసలి కన్నీళ్లు కార్చే తేనెపూసిన కత్తి మాదిరిదనే అభిప్రాయం ఇప్పటికే ఆ మతపెద్దల నుంచి, సెక్యులర్ వాదులైన పలువురు న్యాయనిపుణులనుంచి వెలువడింది. అందుకే ఐక్య ప్రతిపక్షం రాజ్యసభలో దీనిని బలంగా అడ్డుకున్నది. బిల్లులోని పలు వివాదాస్పద అంశాల దృష్ట్యా దానిని సెలక్టు కమిటీకి పంపాలని సూచించింది. ప్రతిపక్షాన్ని ఒప్పించి లేదా వాటిలో చీలిక తేవడం వంటి మార్గాల ద్వారా ఈ బిల్లుకు శాసనరూపం సాధించాలనే పట్టుదల ప్రభుత్వంలో కనిపిస్తున్నది. తద్వారా హిందువుల ఓటును మరింతగా తన వెనుక సంఘటితం చేసుకోవాలని బిజెపి కోరుకుంటున్నట్లు స్పష్టపడుతున్నది. ప్రతిపక్షం పట్టువదలకుండా ఐక్యంగా కొనసాగితే బిల్లులోని ప్రధానమైన అంశాలపై రాజీ పడడం ద్వారానే వాటి నుంచి సహకారం పొందడం సాధ్యమవుతుంది. ఇది ఎన్నికల సంవత్సరం కావడం వల్ల గతంలో దేశ ప్రజలకు ప్రధాని మోడీ చేసిన వాగ్దానాల ప్రస్తావన కూడా రాష్ట్రపతికి తప్పలేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే విషయంలో ఆయన మళ్లీ వారిలో ఆశలను కొనసాగింప చేసే ప్రయత్నం చేశారు. వారి ఆదాయాలు దారుణంగా తగ్గిపోతున్న సత్యం కళ్లముందున్నదే. రాష్ట్రపతి ప్రసంగం, ఆర్థిక సర్వే పత్రం ప్రవేశపెట్టటం ఒకేరోజున జరిగాయి. పెద్దనోట్ల రద్దు, జియస్‌టి అమలు వల్ల ఎదురైన సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొన్నామని ప్రభుత్వం సర్వేలో చెప్పుకున్నది.ఇది పాక్షిక సత్యమే. జిఎస్‌టి కారణంగా పెక్కుమంది చిన్న వ్యాపారులు పన్ను చెల్లింపు దారుల జాబితాలో చేరారని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఇప్పటికి అంతా బాగుంది, ముందుముందు మరింత ఘనంగా వుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అదే సందర్భంలో రానున్న కాలంలో క్రూడాయిల్ మరింత ప్రియం కావడం ఖాయమని అది ఆర్థికంగా గడ్డు పరిస్థితిని కలిగిస్తుందని అంగీకరించింది. కానీ క్రూడాయిల్ అత్యంత చౌకగా లభించిన గతకాలంలో దేశానికి ఏమి మేలుచేశారో చెప్పలేదు. అంతిమంగా దేశంలోకి పెట్టుబడుల రాకడ, ఎగుమతుల వృద్ధి మాత్రమే సర్వరోగ నివారిణులని చెప్పి ఆ రెండింటి మీదనే భారం వేసి ప్రభుత్వం చేతులు దులుపుకున్నది.

ట్రంప్ దారిలో ధనికుల సేవ?

చూపు

ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2018 –19 బడ్జెట్ రూపొందించడానికి అమెరికా మార్గాన్ని అనుసరిస్తారా అన్నది వేచి చూడాలి. భారతీయ కంపెనీలకు అధిక స్థాయిలో 30 శాతం దాకా ఉన్న పన్నుల రేటును తగ్గిస్తారా? అలాగే అమెరికా పన్ను ప్రతిపాదనలవల్ల భారత దేశానికి పెట్టుబడుల ప్రవాహం తగ్గిపోకుండా కాపు కాస్తారా? కొత్త బడ్జెట్ ప్రకటించే ఘడియలు దగ్గర పడుతుండడంతో చాలా మంది ఆర్థిక నిపుణులలో ఈ ప్రశ్నలు మెదులుతున్నాయి. అమెరికాలో కొత్త పన్నుల విధానం కింద పన్ను రేట్లను తగ్గిస్తూ ప్రతిపాదనలు ప్రకటించిన విధంగా జైట్లీ కూడా చేస్తారా అన్న ప్రశ్న ప్రధానంగా ఆర్థికవేత్తలు లేవనెత్తారు. బడ్జెట్ నుంచి దేశంలోని అనేక వర్గాల ప్రజలు ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇదే ఆఖరి బడ్జెట్ కావడంతో సమూల మార్పులతో ప్రతిపాదనలను ప్రభుత్వం ప్రకటిస్తుందని ఎంతో మంది ఆశగా ఎదురు చూస్తున్నారు. రానున్న బడ్జెట్ మన ఆర్థిక వ్యవస్థపై రూఢిగా పెద్ద ప్రభావాన్ని చూపుతుందని భావిస్తున్నారు. అమెరికా దారిలో పన్నుల రాయితీలను ప్రకటిస్తారా అన్నది కీలక ప్రశ్న. అమెరికా పన్నుల ప్రతిపాదనలతో పోలిస్తే దేశం ఎ క్కడ నిలుస్తుంది అన్నది బేరీజు వేయాలి. కార్పొరేట్ పన్నును 35 శాతం నుంచి 20 శాతానికి తగ్గించడం, పన్నులు తదితర చెల్లింపులకు ముందు ఆదాయం నుంచి వడ్డీ కోతను 30 శాతానికి పరిమితం చేయడం, పన్ను చెల్లింపుదార్లకు మరికొన్ని ఇతర చెల్లింపుల మొత్తాన్ని తగ్గించడం అమెరికా బడ్జెట్ ప్రకటించింది. కార్పొరేట్ పన్ను తగ్గింపుకు కొన్ని షరతులను విధించింది. అమెరికా కంపెనీల విదేశీ అనుబంధ సంస్థల ఆదాయంపై వివిధ రేట్లలో పన్నులు విధించాలని తాజాగా ప్రతిపాదించారు. వాటిని అమెరికాకు తిరిగి రప్పించడం లేకుండా ఈ పన్ను ప్రతిపాదిస్తారు. విదేశీ అనుబంధ కంపెనీలలో ఉన్న 10 శాతం వాటాల విక్రయం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగంపై పన్ను ఉండదు. కొన్ని భారతీయ కంపెనీలు చెల్లించాల్సిన 'ప్రత్యామ్నాయ కనీస పన్ను' ను తొలగించాలని కూడా తాజా ప్రతిపాదనల్లో అమెరికా ప్రకటించింది. సాధారణంగా అమెరికాలో ప్రభుత్వ విధానాలు మారిన ప్రతిసారి ఇతర దేశాలలో కలకలం తప్పదు. అమెరికా ప్రతిపాదించిన ఆర్థిక చర్యలపై ఆ దేశంలో వివిధ స్థాయిల్లో కూలంకషంగా చర్చ సాగుతోంది.


గతంలో కొన్ని దేశాలు అమెరికా ప్రభావం నుంచి తప్పించుకోడానికి ప్రకటించిన పన్ను తగ్గింపు వల్ల ఆశించిన ఫలితాలు కలగలేదు. ప్రస్తుతం అమెరికా తాజాగా ప్రకటించిన సుంకాల కోత ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావాన్ని కొంత కాలం పాటు వేచి ఉండి అంచనా వేయాలి. అమెరికా పన్నుల ప్రతిపాదనల ప్రభావం నుంచి తమ దేశాలను తప్పించడానికి ప్రపంచంలోని అనేక దేశాలు కొత్తగా ప్రతిపాదనలను తెస్తాయని దేశంలోని ఆర్థిక నిపుణులు కొందరు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 1న ప్రకటించనున్న మన బడ్జెట్‌లో కూడా ఈ ధోరణి ప్రతిఫలించవచ్చు. కాలక్రమేణా కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించాలన్న లక్ష్యాన్ని 2015 బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. దశల వారీగా ఆదాయం నుంచి పన్నుల కోతలు, మినహాయింపులు, 'టాక్స్ హాలిడే'లను తగ్గించాలని కూడా అప్పట్లో సంకల్పించారు. దానితోపాటు పన్నుల రేట్లను కూడా తగ్గించాలని అనుకున్నారు.

ఈ ప్రకటనలకు అనుకూలంగా కొన్ని కంపెనీలపై తక్కువ పన్నుల రేట్లు (25శాతం, 29 శాతం) ప్రభుత్వం 2016, 2017 బడ్జెట్‌లలో ప్రవేశపెట్టింది. కొత్తగా స్థాపించిన వస్తూత్పత్తి కంపెనీలు సాధారణంగా మినహాయింపుల ను కోరవు. అయితే అవి 25 శాతం కార్పొరేట్ పన్ను రేటుకు అర్హత పొందాయి. ప్రస్తుతానికి సాధారణంగా కార్పొరేట్ పన్ను 30 శాతం ఉంది. కొన్ని కంపెనీలకే మినహాయింపు వర్తిస్తోంది. ఇప్పుడు అమెరికా దారిలో ఆ పన్ను రేటును 30 శాతం నుంచి తగ్గిస్తుందా అన్నది నిపుణులు ఎదురుచూస్తున్నారు. ఆదాయం నుంచి వడ్డీల కోతలో తగ్గింపులను భారత్ పన్నుల చట్టంలో అంతర్భాగం చేశారు. అయితే అమెరికా తాజా ప్రతిపాదన ఈ విషయంలో కొంచెం వేరుగా ఉంది. అనుమతించని వడ్డీలను ఐదేళ్ల కాలానికి 'క్యారీఫార్వర్డ్' చేస్తారు.


మన దేశంలో ఎనిమిదేళ్ల కాలానికి క్యారీఫార్వర్డ్ అవుతోంది. భారతీయ కంపెనీల విదేశీ అనుబంధ సంస్థల నుంచి అందిన డివిడెండ్లపై ప్రస్తుతం 15 శాతం రేటున పన్ను రాయితీ విధిస్తున్నారు. తాజా అమెరికా ప్రతిపాదనలను అనుసరించి ఈ పన్ను ఇంకా తగ్గించవచ్చు. అందువల్ల భారత్‌కు ఆ అనుబంధ సంస్థల ఆదాయాల బదిలీ పుంజుకొనే అవకాశం ఉంది. మొత్తానికి అమెరికా తాజా పన్ను రాయితీ ప్రకటనల వల్ల భారత్‌లాగా చాలా దేశాల బడ్జెట్ రూపకల్పన కసరత్తు పై పరిమితులు పడ్డాయి. ఆ పనిలో ఆయా ఆర్థిక మంత్రుల స్వేచ్ఛ కుచించుకుపోయింది. అమెరికా పన్ను ప్రతిపాదనల ప్రభావం లేకుండా చేయడానికి అనేక దేశాలు తాజాగా పన్ను రాయితీలను ప్రకటించే పరిస్థితి ఉంది.

భారత దేశం పెట్టుబడులకు స్వర్గధామమని అనిపింప చేయడానికి భారతీయ కంపెనీలకు విదేశీ అనుబంధ సంస్థల నుంచి అందిన డెవిడెండ్లపై పన్నుల రేటును ప్రభుత్వం తగ్గించే అవకాశం ఉంది. ప్రస్తుతం కార్పొరేట్ ట్యాక్స్ కు అదనంగా 20 శాతం దాకా డెవిడెండ్ల పంపిణీ పన్నును భారతీయ కంపెనీలు చెల్లించాల్సి వస్తోంది. వాటా పెట్టుబడిదారులపై ఈ డెవిడెండ్ పన్ను 20 శాతం దాకా ఉంటోంది. ఎన్‌ఆర్‌ఐ షేర్ హోల్డర్లకు ఈ పన్ను రేటు కొంత మేరకు బిగబడతారు. ఆ మొత్తంపై వారు రుణాలు పొందవచ్చు. స్వదేశంలో కట్టాల్సిన పన్నుల మొత్తంపై కూడా వారికి రుణ సౌకర్యం ఉంటుంది. అందువల్ల భారత దేశంలోకి వచ్చే పెట్టుబడుల వ్యయం తగ్గుతోంది. 18.5 శాతం ఉన్న 'కనీస ప్రత్యామ్నాయ పన్ను రేటును కూడా అమెరికా తరహాలో భారత్ తగ్గించవచ్చు. మొత్తానికి అమెరికా ప్రధాన ప్రతిపాదనల ప్రభావం భారత్ బడ్జెట్ కీలక ప్రతిపాదనలపై ఉండకపోవచ్చు. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడానికి సంబంధిత చట్టంలో ఆర్థిక మంత్రి మార్పులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. భారత దేశంలో పన్నుల రేట్లు చాలా ఎక్కువగా ఉన్నాయని, ఎగవేతలకు హెచ్చురేట్లే కారణమని చాలామంది పన్ను చెల్లింపుదార్లు అంటూ వుంటారు. పైగా పన్నుల రూపేణా తాము చెల్లిస్తున్న మొత్తాలు సరిగా వినియోగం కావడం లేదని కూడా వారి అభిప్రాయం. ఈ దేశ ప్రజల సంక్షేమానికి ఆ డబ్బును ప్రభుత్వం వాడకుండా కొంత మంది పెద్దలు కైంకర్యం చేయడానికి అది వినియోగం అవుతున్నట్లు సర్వత్రా అనుమానాలున్నాయి. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అత్యధిక స్థాయిలో ఉన్న ఆదాయం పన్ను రేట్లను తగ్గించవలసి ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఆదాయం పన్ను రాయితీలు ప్రకటిస్తే ప్రజలకు ఎంతో ఊరటగా ఉంటుందని కూడా వారు సూచిస్తున్నారు. పన్ను ఎగవేతదారులను పట్టుకొని వారి బకాయిలను ఖచ్చితంగా వసూలు చేస్తే సామాన్య ప్రజలకు పన్నుల ఊరట కల్పించడం సాధ్యమవుతుంది. అలాగే డిజిటల్ మార్గంలో పన్ను చెల్లింపును ప్రోత్సహించాలి. లావాదేవీల ఖర్చులు తగ్గించాలి. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రేట్లను కుదించడం ద్వారా చెల్లింపులు పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే ఆదాయంలో బొరియలు పూడ్చే ప్రభుత్వపనికి పన్ను చెల్లింపుదార్లు సహకరించేలా చేయాలి. అందరి నిపుణులూ చెప్పేది ఒక్కటే– పన్ను రేట్లు తగ్గిస్తే చెల్లింపులు పెరుగుతాయి.

* సంజీవ్ సిన్హా



కన్నీళ్లకు మతం లేదు



ఆర్వీ రామారావ్

రాజకీయ అవసరాలకు మతాన్ని వినియోగించుకునే వారికి అధికారంలోకి రావడానికి, ఆ అధికారం నిలబెట్టుకోవడానికి, భవిష్యత్తులో అధికారం సంపాదించడానికీ కూడా మత కలహాలు సృష్టించడం తప్పనిసరి కాబోలు. ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా చెలరేగిన కలహాలు ఈ అంశాన్నే రుజువు చేస్తున్నాయి. ఇంతవరకు ఎన్నడూ మత కలహాల ఊసేలేని కాస్ గంజ్ లో మతకలహాలు రెచ్చగొట్టడానికి ఇంతకన్నా కారణం కనిపించడం లేదు. మతాన్ని రాజకీయాలతో మిళితం చేయకపోతే బిజెపికి కేంద్రంలో అధికారం దక్కేదే కాదు. బాబరీ మసీదు రామజన్మభూమి వివాదం ఆధారంగానే బిజెపి జాతీయస్థాయిలో రాజకీయ పరమపద సోపానపటంలో మతం అనే పెద్ద నిచ్చెన ఎక్కి అంచెలంచెలుగా ఎదిగి కేంద్రంలోఅధికారం సంపాదించగలిగింది. నరేంద్ర మోదీ కన్నా లాల్ కృష్ణ అద్వాణీ మెరుగు. అద్వాణీకన్నా అటల్ బిహారీ వాజపేయి మెరుగు అన్న అభిప్రాయం ఉన్నప్పటికీ అందరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మతం ఆధారంగా ఎదిగిన వారే. గోవిందాచార్య చెప్పినట్టు వాజపేయి కేవలం ముసుగు మాత్రమే. నరేంద్ర మోదీకి ఏ ముసుగూ అక్కర్లేదు. గుజరాత్‌లో ఆయన నాయకత్వంలో వరస విజయాలు సాధించడం వల్ల ముసుగు అవసరమే లేకుండా పోయింది. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత యావద్దేశం మీద ఆధిపత్యం సంపాదించాలన్నది మోదీ–అమిత్ షా ద్వయం పథకం. అందుకే కాంగ్రెస్ ముక్త్ భారత్ అని నినదిస్తున్నారు. మతంతో రాజకీయాలను కలుషితం చేసే వారి అధికార దాహానికి అంతుండదు. ప్రస్తుతానికి 19 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపి దేశమంతటా తమ పార్టీ పాలనే ఉండాలన్న వ్యూహంతో దూసుకెళ్తోంది. అందుకే మతకలహాలు లేని చోట మతకలహాలకు ఆజ్యం పోస్తోంది.

కాస్ గంజ్ పరిణామాలు గమనిస్తే భవిష్యత్ ప్రణాళికలలో భాగంగానే మతోద్రిక్తతలు రెచ్చగొట్టినట్లు స్పష్టం అవుతోంది. ఏ మత కలహానికైనా చిన్న కారణమే ఉంటుం ది. ఆ తర్వాత అదే దావానలం అవుతుంది. కాస్ గంజ్ లో సరిగ్గా ఇదే జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి అధికారంలో ఉండడం అక్కడ మత చిచ్చు రగిలించడానికి సంఘ్ పరివార్ కు బాగా ఉపకరించింది. లేకపోతే వీర్ అబ్దుల్ హమీద్ చౌరస్తా వద్ద ముస్లింలు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకం ఆవిష్కరించాలని సంకల్పిస్తే గిల్లి కజ్జాలు పెట్టుకుని కలహాగ్ని రేపింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆర్.ఎస్.ఎస్. అనుబంధ సంస్థలైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు (ఎ.బి. వి.పి.), విశ్వ హిందూ పరిషత్తు తిరంగా యాత్ర నిర్వహించాయి. దాదాపు వందమంది సంఘ్ పరివార్ అనుబంధ సంఘాల వారు మోటారు సైకిళ్ల మీద వీర్ అబ్దుల్ హమీద్ కూడలి దగ్గరకు వచ్చారు. అక్కడ అప్పటికే స్థానిక ముస్లింలు పతాకావిష్కరణకు ఏర్పాట్లు చేసుకున్నారు. తమకు దారి ఇవ్వాలని, అక్కడ పతాకావిష్కరణ కోసం వేసిన కుర్చీలు తొలగించాలని పట్టుబట్టారు. మీరు కూడా పతాకావిష్కరణలో పాల్గొనండి అని ముస్లింలు చెప్పినా వినిపించుకోలేదు. ముస్లింలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'హిందుస్థాన్ మే రెహనా గోగ, వందే మాతరం కెహనా హోగా' అని నినాదాలు చేశారు. అక్కడ ఉన్న ముస్లింలు దీనికి వ్యతిరేకంగా 'పాకిస్థాన్ జిందాబాద్' అని నినాదాలు చేశారని ఓ కట్టుకథ కల్పించారు. వందే మాతరం అనక పోతే పాకిస్థాన్ వెళ్లిపోండి అన్నది నిజానికి తిరంగా యాత్ర నిర్వహించిన వారే. మరో వాస్తవం ఏమిటంటే తిరంగా యాత్ర నిర్వహించిన వారి చేతిలో కాషాయ జెండాలు కూడా ఉన్నాయి. గణతంత్ర దినోత్సవానికి కాషాయ జెండాకు సంబంధం ఏమిటో హిందూత్వ వాదులకు మినహా అంతుపట్టని నిగూఢ రహస్యమే.

వందేమాతరం అనని వారికి దేశభక్తి లేనట్టేనన్నది హిందుత్వ వాదుల ప్రగాఢ విశ్వాసం. నిజానికి ఇటీవలి కాలంలోనే హిందుత్వ వాదులకు త్రివర్ణ పతాకం మీద అపూర్వమైన ప్రేమ పుట్టుకొచ్చింది. సంఘ్ పరివార్‌కు చెందిన వారికి స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం లేదు అన్న విమర్శలు ఉన్నందువల్ల హిందుత్వ వాదులకు అమాంతం త్రివర్ణ పతాకం మీద ప్రేమ పొంగి పొరలు తోంది. 'త్రివర్ణ పతాకాన్ని ఎన్నటికీ గౌరవించం, హిందువులు దాన్ని ఆమోదించరు'అని1947 ఆగస్టులో ఆర్.ఎస్.ఎస్. అధికార పత్రిక ఆర్గనైజర్ రాసింది. హిందువులందరి తరఫున ఆ మాట చెప్పే అధికారం ఆర్.ఎస్. ఎస్.కు ఎవరిచ్చారో? హిందూ మతాన్ని, హిందుత్వను ఒకేగాట కట్టడానికి ప్రయత్నిస్తున్నారు. 'త్రివర్ణ పతాకంలో మూడు(త్రి) అన్న మాటే దుష్టమైందని, ముువ్వన్నెల జెండా అంటే దేశానికి అరిష్టం' అని ఆర్గనైజర్ పత్రిక రాసింది. మూడు అన్న సంఖ్య హిందువులకు ఏ లెక్కన చూసినా అశుభమైంది కాదు. త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) అంటే హిందువులకు పవిత్రభావనే ఉంది. ముల్లోకాలు అన్న మాట కూడా హిందూ పురాణాల్లో ఉన్నదే.

ఆర్.ఎస్.ఎస్. రెండవ సర్ సంఘ్ చాలక్ (అధిపతి) ఎం.ఎస్. గోల్వాల్కర్ 'పాంచ జన్యం' (బంచ్ ఆఫ్ థాట్స్) గ్రంథంలో 'మన నాయకులు దేశానికి ముువ్వన్నెల పతాకాన్ని ఎంపిక చేశారు. వారు అలా ఎందుకు చేశారు? మనది ప్రాచీన దేశం. మనకు ఘనమైన గతం ఉంది. అలాంటప్పుడు మనకు పతాకమే లేదా? వేలాది సంవత్సరాల నుంచి మనకు జాతీయ చిహ్నమే లేదా? నిస్సందేహంగా ఉంది. అలాంటప్పుడు మన మెదళ్లలో ఈ శూన్యం ఎందుకు?'అని ప్రశ్నించారు. అయితే గోల్వాల్కర్ ఆ ప్రాచీన పతాకం ఏదో చెప్పనే లేదు. జాతీయ చిహ్నం ఏదో కూడా సెలవివ్వనే లేదు. ఆర్.ఎస్.ఎస్.కు ఇష్టమైంది కాషాయ జెండా. అదీ మధ్యలో చీలి ఉన్న కాషాయ జెండా. అది హిందూమతానికి ప్రతీక కావొచ్చు. మరి తిరంగా యాత్రలో కాషాయ జెండాలను ఎందుకు చేతబూనినట్టు?

మహాత్మాగాంధీ హత్య తర్వాత ఆర్.ఎస్.ఎస్.ను నిషేధించింది అప్పటి హోం మంత్రి సర్దార్ పటేల్. గోల్వాల్కర్ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఏడాదిన్నరపాటు పటేల్ ఆర్.ఎస్.ఎస్.మీద నిషేధం తొలగించలేదు. 1949 జులై పదకొండున మాత్రమే ఆర్.ఎస్.ఎస్.పై నిషేధం తొలగించింది. అదీ భారత రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని గౌరవిస్తామని ఆర్.ఎస్.ఎస్. కచ్చితమైన హామీ ఇచ్చిన తర్వాతే.

కాస్ గంజ్ లో ఎ.బి.వి.పి., విశ్వహిందూ పరిషత్తు నిర్వహించిన తిరంగా యాత్రకు నిజానికి అనుమతి లేదు. కాని వడ్డించేది యోగీ ఆదిత్యనాథ్ కనక అనుమతి లేకున్నా యాత్ర కొనసాగించారు. వీర్ అబ్దుల్ హమీద్ కూడలిలో ముస్లింలతో ఘర్షణ పడ్డ తర్వాత అక్కడికి ఒక కిలోమీటర్ దూరంలోని మరోచోట మళ్లీ ఘర్షణలు తలెత్తాయి. రెండు పక్షాల వారి మధ్య కాల్పులు కూడా జరిగాయంటున్నారు. ఈ కాల్పుల్లో చందన్ గుప్తా, నౌషాద్ గాయపడ్డారు. చందన్ గుప్తా మరణించారు. నౌషాద్ అలీగఢ్‌లో చికిత్స పొందుతున్నారు. కాని అధికార పక్షం కొమ్ము కాయడాని కి అలవాటు పడ్డ ప్రధాన స్రవంతిలోని మీడియా నౌషాద్ కూడా గాయపడ్డట్టు మాట మాత్రంగానైనా ప్రస్తావించడం లేదు.

చందన్ గుప్తా అంత్యక్రియల సందర్భంగా పార్లమెంటులో బిజెపి సభ్యుడు రాజ్ వీర్ సింఘ్ రెచ్చగొట్టే మాటలు మాట్లాడారు. ఆయన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం రాజస్థాన్ గవర్నర్ కళ్యాణ్ సింగ్ కుమారుడు. 'దీన్ని ఎన్నటికీ క్షమించలేం. ఇంతటి ఘోరం ఎన్నడూ జరగలేదు. కాని ఈ అల్లర్లకు 'మా వాళ్లు' (హిందువులు) కారణం కాదు. ఒక పథకం ప్రకారమే ఇదంతా జరిగింది. అందులో 'మా వాడు' ఒకడు మరణించాడు' అని రాజ్ వీర్ సింగ్ అన్నారు. ఆయన దృష్టిలో 'మా వాళ్లు ' అంటే హిందువులని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

చందన్ గుప్తా అంత్యక్రియల తర్వాత మూకలు దహనకాండకు పాల్పడ్డాయి. అనేక వాహనాలను, దుకాణాలను దగ్ధం చేశారు. అదీ గురి పెట్టినట్టు ముస్లింల దుకాణాలనే దగ్ధం చేశారు. హిందువుల ఆస్తుల జోలికి పోలేదు. ఒక మసీదును కూడా తగులబెట్టే ప్రయత్నం చేశారు. రాజ్ వీర్ సింగ్ ఆరోపించినట్టు 'పథకం' ఎవరిదో ప్రత్యేకంగా చెప్పాలా? పనిలో పనిగా సమాజ్ వాదీ పార్టీ నాయకుడు ఆజం ఖాన్ కూడా అలవాటు ప్రకారం నోరు పారేసుకున్నారు. రెండు వేపుల నుంచి కాల్పులు జరిగాయంటే మతోన్మాదులు అన్ని మతాల్లో ఉంటారనే.

చిచ్చు రేపింది ఎవరైనా నష్ట పోయింది రెండు మతాలకు చెందిన వారు. ఈ కలహాగ్నిలో దహించుకు పోతున్న వారిలో హిందువులూ ఉన్నారు. ముస్లింలూ ఉన్నారు. అల్లర్లు జరుగుతున్నప్పుడు షరా మామూలుగా ప్రేక్షక పాత్ర పోషించిన పోలీసులు తర్వాత శాంతి సంఘం ఏర్పాటు చేశారు. 121మందిని అరెస్టు చేశారు. వీరిలో 70 ఏళ్ల ముసలి వారూ ఉన్నారు. 18 ఏళ్ల పడుచు వారూ ఉన్నారు. అరెస్టు చేసిన తమ వారి విడుదల కోసం పోలీసు స్టేషన్ల దగ్గర రోడ్డు మీద పడిగాపులు పడుతున్న వారిలో హిందువులూ ఉన్నారు. ముస్లింలూ ఉన్నారు. అగ్నికి ఆహుతి అవుతున్న ఇళ్లను, దుకాణాలలో మంటలు ఆర్పడానికి ఉమ్మడిగా ప్రయత్నించిన వారిలోనూ రెండు మతాల వారు ఉన్నారు. వారి కన్నీళ్లకు ఏ మతం రంగూ లేదు.

పంచాయతీ చట్టాలను నిర్వీర్యం చేస్తున్న పాలకులు



రావుల రాజేశం,
లెక్చరర్,
9848811424

తెలంగాణ రాష్ట్రంలో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకుని రావాలని సంకల్పించడం సంతోషదాయకం. 1981 దాకా సర్పంచ్ ఎన్నిక, వార్డు మెంబర్ల ద్వారా ఉండేది. ఆ తరువాత గ్రామ సర్పంచ్‌ను ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం వల్ల యోగ్యులు, అర్హులైన వారు ఓటర్ల నుండి ఎన్నికై పరిపాలనను అందిస్తున్నారు. అయితే పలుచోట్ల సర్పంచ్‌లు తమ విధులను సక్రమంగా నిర్వహించటం లేదు. గ్రామాలకు మంజూరైన నిధులు సక్రమంగా వాడటం లేదు. గ్రామ పంచాయతీ నిర్వహణలో సిబ్బందికి జవాబుదారీ తనం లేదు. గ్రామసభలను ఆరు నెలలకు ఒకసారి కాకుండా నెలకు ఒకసారి నిర్వహించటం మంచిది. భారత రాజ్యాంగం 73,74 అధికరణ ప్రకారం పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించాలి. బల్వంతరాయ్ మెహతా, జివికె, సింగ్ వంటి నివేదికలనుప్రభుత్వం అధ్యయనం చేయాలి.

గ్రామసర్పంచ్‌లను చెప్పుచేతుల్లో ఉంచుకోవడానికి ప్రతిపక్షాలను గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో అడ్రస్ లేకుండా చేయడానికి గ్రామ సర్పంచ్ పదవికి పరోక్ష ఎన్నికల విధానం తెరమీదకు తెచ్చారని విపక్ష పార్టీలు దుమ్మెత్తి పోస్తున్నాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఏ నిధులు ఇచ్చినా, ఏ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని తలపెట్టినా గ్రామస్థాయిలో గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ ఆధ్వర్యంలోనే సాగుతోంది. కాని పరోక్ష సర్పంచ్ ఎన్నికల వల్ల పెట్టుబడిదారులు సర్పంచ్ పోస్టులను వేలంపాడి దక్కించుకునే అవకాశాలు ఎక్కువ. ఇంతకాలం ఉత్సవ విగ్రహంవలే, నామమాత్రంగా ఉన్న వార్డు మెంబర్ పదవి పవర్‌ఫుల్ కానుంది. నెలకొకసారి జరిగే గ్రామసభ, గ్రామ పంచాయతీ సమావేశాలకు హాజరయ్యే గౌరవ సభ్యులకు సిట్టింగ్ ఫీజు ఇవ్వాలన్నది టిఆర్‌ఎస్ ఎన్నికల తాయిలమే. గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఐదేళ్లు. వచ్చే జులై 31 నాటికి ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు పాలించే హక్కు ఉంది. ఎన్నికలు జులై కన్నా మూడు నెలల ముందు నిర్వహించుకోవచ్చు. కాని గ్రామసర్పంచ్ ఎన్నికలు ఎపుడు నిర్వహిస్తారు? ఎలా నిర్వహిస్తారు? ప్రత్యక్షంగానా? పరోక్ష పద్ధతా? కొత్త పంచాయతీల సంగతి ఏమిటి? 200 మంది ఓటర్లు ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చుతున్నారు. దాని సంగతి ఏమిటి?తెలియటం లేదు. ప్రభుత్వం ప్రతిగ్రామ సర్పంచ్‌కు నెలకు ఐదువేల గౌరవ వేతనం ఇవ్వడంతో, గ్రామ సర్పంచ్ పోస్టుకి ఎక్కడ లేని డిమాండ్ ఏర్పడింది. క్రేజీ వచ్చింది. గతంలో సర్పంచ్ జీతం నెలకు రూ.750 ఇచ్చేది. అది కూడా గ్రామ పంచాయతీ ఇంటి పన్ను వసూలు చేసి తీసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం నెలకు ఐదువేల చొప్పున ఐదేళ్లలో మూడు లక్షల రూపాయలు బంగారు పళ్లెంలో పెట్టి సర్పంచ్‌లకు ఇస్తుంది. గౌరవ వేతనం నెలకు 15వేలకు పెంచుతారనే ప్రచారం ఉంది. గ్రామ పంచాయతీకి అన్ని పవర్స్ ఇచ్చి, గ్రామాలను ప్రగతిపథంలో నడిపించాలి. వార్డుమెంబర్ సర్పంచి పోస్టుకు, విద్య అర్హతను ప్రవేశపెట్టాలి. పనిచేయని సర్పంచ్‌లను 'రీకాల్' చేసి గౌరవ వేతనం నిలిపి వేయాలి.

ఇదిలా ఉండగా ఎంపిటిసి, జడ్‌పిటిసి పదవులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉత్సవ విగ్రహాలవలె ఉన్నాయి. అధికారాలు, బాధ్యతలు లేవు. కనీస ప్రోటోకాల్ వీరికిలేదు. గ్రామ పంచాయతీలో ఎంపిటిసికి కుర్చీలేదు. మర్యాద లేదు. విలువ లేదు. సంతకం కూడా అవసరం లేదు. ఏ అధికారం లేని ఎంపిటిసిపోస్టు తమకు ఎందుకని ఎంపిటిసిలు ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో జడ్‌పిటిసి పరిస్థితి కూడా అంతే. అధికారం ఎంపిపి, జడ్‌పిటిసిలకు ఇద్దరికి ఉంది. ఒక్క డ్యూటీకి రెండు పోస్టులు ఎందుకు అనే ప్రశ్న వస్తుంది. మండల పరిషత్ సర్వసభ్యసమావేశానికి సర్పంచ్, ఎంపిటిసి, సింగిల్ విండో ఛైర్మన్లు ముగ్గురు హాజరై, అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఒక పనికి ముగ్గురు ప్రశ్నలు అడగటం అవసరమా? అనే చర్చ సాగుతోంది. ఎంపిటిసి, జడ్‌పిటిసి పోస్టులను రద్దు చేస్తామని తెలంగాణ సిఎం ఏనాడో బాంబులాంటి ప్రకటన చేశారు. ప్రతినెల ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు ఇస్తున్న గౌరవ వేతనాలు దుబారా కాకుండా చూడటానికే కెసిఆర్ ఇలా అన్నారని అనుకున్నారు. 2018 ఎన్నికల నాటికి ఎంపిటిసి, జడ్‌పిటిసి పోస్టులు రద్దు చేయబడి నేరుగా ఎంపిపి అధ్యక్షులు, జడ్‌పి అధ్యక్షులు ఎన్నికఅవుతారని గ్రామ, మండల, జిల్లాస్థాయి లీడర్లలో చర్చ సాగింది. కాని ఇప్పటికి ఎంపిటిసి, జడ్‌పిటిసిలు ఉంటాయా?రద్దు చేస్తారా? ఒకవేళ ఉంటే ఎంపిటిసిలనుండి మండల ప్రజాపరిషత్ అధ్యక్షుణ్ణి జడ్‌పిటిసి నుండి జడ్‌పి ఛైర్మన్‌ను ఎన్నుకుంటారా? అన్నది స్పష్టత లేదు. నూతన పంచాయతీరాజ్ చట్టానికి సంబంధించి ముసాయిదా కూడా సిద్ధం అయినది. ఇందులో ఏముందో ఎవరికి తెలియదు.

తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 10 నుండి 31కిపెరగటం వల్ల సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసిల పోస్టుల స్థాయి ఘోరంగా మారింది. జిల్లాల పునర్విభజనవల్ల మండల పరిషత్ అధ్యక్షులు, జడ్‌పి ఛైర్మన్ పదవులు రిజర్వేషన్ వారికి సులభంగా లభించవచ్చు. 56 మండలాలు ఉన్న కరీంనగర్ జిల్లా ఐదు జిల్లాలుగా మారటంతో జడ్‌పిటిసి స్థానాలు తగ్గిపోయాయి. కొన్ని జిల్లాల్లో ఆరు జడ్‌పిటిసిలు ఉండగా మరికొన్ని జిల్లాల్లో 16 దాకా జడ్‌పిటిసి స్థానాలు ఉన్నాయి. 16 జడ్‌పిటిసి స్థానాల నుండి జడ్‌పి ఛైర్మన్‌ను ఎన్నుకోవటం చాలా ఈజీ. జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలు, సర్పంచ్ అన్ని స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరిపితే క్రియాశీలురు, రాజకీయ పరిణతి చెందిన వారు అధికారంలోకి వస్తారనే వాదన ఉంది. 1987లో జరిగిన స్థానిక ఎన్నికల్లో జిల్లా ప్రజాపరిషత్ ఛైర్మన్, మండల ప్రజాపరిషత్ ఛైర్మన్‌లను నేరుగా (ఓటర్ల)నుండి ఎన్నుకున్నారు. అప్పట్లో విద్యావంతులు, యువకులు రాజకీయాల్లోకి వచ్చారు. ఎంపిటిసి, జడ్‌పిటిసిలనుండి ఎంపిపి, జడ్‌పి ఛైర్మన్‌ల ఎన్నిక విధానాన్ని ప్రవేశపెట్టి 'క్యాంపు' రాజకీయాలకు బీజం వేశారు. ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎలా చేస్తారో తెలియదు. తెలంగాణలో ఉన్న 463 మండలాలు, జిల్లా పరిషత్‌ల రిజర్వేషన్లు మారనున్నాయి. నూతన పంచాయతీరాజ్‌చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టే ముందు, గ్రామ, మండల, జిల్లా పరిషత్ సభల్లో డ్రాఫ్టును ప్రవేశపెట్టి సభ్యులు, వివిధ పార్టీల, విషయ నిపుణుల సలహాలు తీసుకోవాలి. హడావిడిగా చట్టం చేస్తే అనర్థమే.

మన తెలంగాణ

5

హైదరాబాద్
మంగళవారం
30 జనవరి, 2018

www.manatelangana.news



పెద్ద జీతం...హైటెక్ లైఫ్‌స్టైల్.. ఇంకేం కావాలి హాయిగా బతకడానికి...కానీ అవేమీ సంతృప్తిని కలిగించలేదు గౌతమ్‌కుమార్‌కి..సమాజానికి తన వంతు సేవ ఏదో చేయాలనుకున్నాడు...ఏం చేయాలో తెలీలేదు..అంతే నగరంలోని ఓ స్వచ్ఛంద సంస్థలో వాలంటీర్‌గా చేరాడు.. అనాథలు, మతిస్థిమితంలేనివాళ్లు, అభాగ్యులను చూసి చలించిపోయాడు. ఈ నేపథ్యంలో అతడి ఆలోచనల్లోంచి పుట్టిందే సర్వ్ నీడీ సంస్థ. అన్నార్తుల ఆకలిని తీర్చే గౌతమ్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు..

అనాథలకు..అభాగ్యులకు.. మేమున్నాం.!













సామాజిక సేవే తన జీవితాశయంగా మార్చుకున్న గౌతమ్ చిత్తూరు జిల్లా కలిగిరి దగ్గర చిన్న గ్రామానికి చెందినవాడు. తండ్రి వెంకట రమణారెడ్డి సిఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ ఫోర్స్)లో పనిచేసేవారు. తల్లి లలిత గృహిణి. చెల్లి అనూష. ఎమ్‌సిఏ పూర్తి చేసిన గౌతమ్ బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరాడు. సామాజిక సేవపై ఉన్న మక్కువతో ఉద్యోగాన్ని వదులుకున్నాడు. మిత్రులతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి ఓ స్వచ్ఛంద సంస్థలో వాలంటీర్‌గా చేరాడు. ఈ క్రమంలో నగరంలో మతిస్థిమితంలేనివాళ్లు, దివ్యాంగులు, వృద్ధులు, అనాథలు, మృత్యువుకు చేరువవుతున్నవాళ్లు, అనాథ శవాలు ఇలా ఎన్నో రకాల వాళ్లను చూశాడు గౌతమ్. ఇలాంటివారికి అన్ని రకాల సేవలు చేయాలనుకున్నాడు. ఇందుకోసం కొన్ని ప్రాజెక్టులు తయారుచేసుకున్నాడు. మొదట ఆకలి సమస్యను తీర్చాలనుకున్నాడు. 2015లో సికింద్రాబాద్‌లోని కార్ఖానాలో సర్వ్ నీడీ స్వచ్ఛంద సంస్థను స్థాపించి అన్నదాతతో మొదలుపెట్టి తన ప్రాజెక్టులను పెంచుకుంటూ పోయాడు.

ఆకలి తీర్చే అన్నదాత

అన్నదాత అనే ప్రాజెక్టు ద్వారా అన్నార్తుల ఆకలి తీరుస్తోంది సర్వ్‌నీడీ. దాతలు పుట్టిన రోజులు, పెళ్లిరోజుల్లాంటి శుభకార్యాల ద్వారా అన్నదాన కార్యక్రమం రూపంలో సంస్థకు స్పాన్సర్‌షిప్ చేస్తుంటారు. అన్నదాత ద్వారా ఇప్పటి వరకు 525 రోజుల్లో 3 లక్షల మంది ఆకలిని తీర్చాడు గౌతమ్. ప్రతి రోజూ 500 నుంచి వెయ్యి మందికి భోజనం పెడుతున్నాడు. నగరంలోని ఫంక్షన్ హాళ్లలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి, వాటితోపాటు స్పాన్సర్లు ఇచ్చే నిధులను ఉపయోగిస్తుంటాడు. శుభకార్యాలలో, హోటల్స్‌లో మిగిలిపోయిన ఆహారం వృథాగా పారేస్తుంటారు. ఆయా హోటల్ యజమానులు, ఫంక్షన్ హాల్ యజమానులతో మాట్లాడి, మిగిలిపోయిన ఆహారాన్ని సేకరిస్తుంది సర్వ్‌నీడీ. దాన్ని నీట్‌గా ప్యాక్ చేసి ఆకలితో అలమటించేవారికి అందజేస్తోంది. అనాథాశ్రమాలు, మానసిక రోగుల వ్యాధిగ్రస్తుల ఆసుపత్రులు, వితంతువుల ఆశ్రమాలు, గవర్నమెంటు ఆస్పత్రులు, క్యాన్సర్ ఆస్పత్రులు, మురికివాడలు, వీధులు, ఇలా ఆకలి ఎక్కడుంటుందో అక్కడికి వెళ్తుంటారు సర్వ్‌నీడీ వాలంటీర్లు. అన్ని దానాలలో అన్నదానం గొప్పదంటాడు గౌతమ్. మానవసేవే మాధవసేవ అన్న మాటల్ని మనసావాచా నమ్మిన తాను ఈ సేవారంగంలోకి వచ్చానంటాడు.

సేవ్ ఎ లైఫ్

ప్రాజెక్టులో భాగంగా తప్పిపోయిన వాళ్లను కనిపెట్టి వాళ్లను కుటుంబ సభ్యుల దగ్గరకు చేరుస్తోంది సర్వ్‌నీడీ టీం. అప్పటి వరకు వాళ్లను అనాథాశ్రమంలో చేరుస్తారు. చికిత్స అందక ప్రాణాలు గాల్లో ఉన్న వాళ్లను గుర్తించి వారికి ప్రాథమిక చికిత్స అందిస్తారు. వారి గాయాలను శుభ్రం చేసి అవసరమైన వైద్యం చేయిస్తారు. వారికి కటింగ్ చేయించి, స్నానం చేయించి ఆకలి తీరుస్తారు. నిలువ నీడలేక ఫుట్‌పాత్‌పై పడుకునేవారికి కట్టుకునేందుకు బట్టలు, కప్పుకోవడానికి బెడ్‌షీట్లు అందజేస్తారు.



అనాథలకు అంతిమ సంస్కారాలు

అనాథ శవాలను గుర్తించి వారికి ఈ టీం అంతిమ సంస్కారాలు చేస్తుంది. అంతేకాకుండా వారివారి మత విశ్వాసాలకు తగ్గట్టు చితాభస్మాన్ని, అస్థికలను నదుల్లో కలపడం, పిండ ప్రదానంలాంటివి చేస్తుంది. సర్వ్‌నీడీ సేవల కోసం రెండు వ్యాన్లు, ఐదుగురు స్టాఫ్ ఉన్నారు. వీళ్లలో దాదాపు 15 మంది వ్యాలంటీర్లు ఉన్నారు. వీరంతా కల్సి సేవలను పంచుకుంటూ ఉంటారు. ఒక శవాన్ని దహనం చేయడానికి మాకు ఐదువేలు ఖర్చవుతుంది. మా సంస్థకు వచ్చే విరాళాల్లో కొంత పక్కన పెట్టి, దాన్ని ఇలాంటి వాటికి ఉపయోగిస్తుంటాం అని చెబుతున్నాడు గౌతమ్.

కుటుంబ సహకారం

గౌతమ్‌కు కుటుంబ సభ్యుల సహకారం పూర్తిగా లభిస్తోంది. సర్వ్‌నీడీ కోసం తండ్రి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని కుటుంబాన్ని హైదరాబాద్‌కు మార్చాడు. కుటుంబం కూడా సామాజిక సేవలో భాగస్వాములయ్యారు. ఈ సంస్థను సామాన్యుల నుంచి ప్రముఖ వ్యక్తులు సందర్శిస్తుంటారు. అనాథల మధ్య పుట్టినరోజులాంటి కార్యక్రమాలను చేసుకుంటుంటారు. ఈసంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న అనాథాశ్రమంలో 24 మంది పిల్లలు చదువుకుంటున్నారు. వారిలో విషయ పరిజ్ఞానం పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా క్యాన్సర్ బారిన పడిన చిన్నారులకు పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తోంది ఈ సంస్థ. గాయాలతో బాధపడుతున్న మూగ జీవాలకు వైద్యం చేయిస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమైన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తోంది. సమాజం కోసం బతకడంలో చాలా తృప్తి ఉందంటాడు గౌతమ్. మా సంస్థ చేసిన పనులను ఫేస్‌బుక్‌లో పెడుతుంటాం. అవి చూసిన వారు కొంతమంది స్పందిస్తుంటారు. వారు తమ సాయాన్ని అందించడానికి ముందుకొస్తున్నారు. అమ్మనాన్న విలువలు తెలిసిన వారు, బంధుత్వాల విలువలు తెలిసినోళ్లు, ఇలా కొంత మంది నెలనెలా తమ వంతు సాయం అందించేవారున్నారు అంటూ ఎంతో ఆత్మసంతృప్తితో చెబుతున్నాడు గౌతమ్.

మల్లీశ్వరి వారణాసి

బ్రూనోకు ఆరు గ్రామీలు





ఈ ఏడాది ప్రకటించిన గ్రామీ అవార్డుల్లో గాయకుడు బ్రూనో మార్స్ ఆరు అవార్డులను దక్కించుకున్నాడు. దీంతోపాటు ఆల్బమ్ ఆఫ్ ద ఇయర్ ట్రోఫీని కూడా దక్కించుకున్నాడు. న్యూయార్క్ సిటీలోని మాడిసన్ స్కేర్ గార్డెన్‌లో జరిగిన గ్రామీ అవార్డుల కార్యక్రమంలో బ్రూనో టాపర్‌గా నిలిచాడు. కెండ్రిక్ లామర్ టీంను ఓడించిన బ్రూనో గ్రామీ షోలో అత్యధిక అవార్డులను సంపాదించుకున్నాడు. కెండ్రిట్ లామర్‌కు ఐదు గ్రామీలు దక్కాయి. పాప్‌స్టార్లు లేడీ గాగా, యూ2, లామర్, రిహాన్నా, ఎల్టన్ జాన్, మిలే సైరస్‌లు ప్రత్యేక షో నిర్వహించారు. బెస్ట్ న్యూ ఆర్టిస్ట్ అవార్డును అలిసియా కారా గెలుచుకుంది. ఆల్బమ్ ఆఫ్ ద ఇయర్ (24కే మ్యాజిక్), రికార్డర్ ఆఫ్ ది ఇయర్ (24కే మ్యాజిక్), సాంగ్ ఆఫ్ ది ఇయర్(దట్స్ వాట్ ఐ లైక్), బెస్ట్ ఆర్ అండ్ బి ఆల్బమ్ (24కే మ్యాజిక్) లను బ్రూనో గెలుచుకున్నాడు. షేప్ ఆఫ్ యూ సాంగ్‌తో హిట్ కొట్టిన ఎడ్ షీరన్‌కు బెస్ట్ పాప్ ఆల్బమ్ కేటగిరీలో స్థానం దక్కింది. ద వార్ ఆన్ డ్రగ్స్‌కు ద బెస్ట్ రాక్ ఆల్బమ్ అవార్డు వచ్చింది. కెండ్రిక్ లామర్‌కు చెందిన డామ్ ఆల్బమ్‌కు బెస్ట్ ర్యాప్ ఆల్బమ్ అవార్డు దక్కింది.

నకిలీ కరెన్సీని కనిపెట్టే మొబైల్ యాప్



ప్రస్తుతం మనం చూస్తున్నట్లయితే ఎక్కడ చూసినా చిల్లరకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. దానికి తోడు వ్యాపారస్తులకు సాయంత్రం తమ మొత్తం ఆదాయం లెక్కపెడుతుంటే వాటిలో నకిలీ నోట్లు వస్తుంటాయి. మీరు నిజమైన లేదా నకిలీ నోట్ల మధ్య గందరగోళంగా ఉంటే నోట్స్ గుర్తించడం కష్టంగా ఉంటే, ఇప్పుడు ఈ యాప్ మీకు సహాయపడుతుంది. సిహెచ్‌కెఫేక్ (Chkfake) యాప్ నోట్స్‌లో నకిలీ నోట్లను గుర్తించే యాప్. ఫేక్ చెక్ యాప్ "చక్ఫేక్ బ్రాండ్ ప్రొటెక్షన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్" తయారు చేసింది. ఈ యాప్ ద్వారా, ఏ దేశాల కరెన్సీ అయినా భారత దేశ కరెన్సీ కూడా పరిశీలించవచ్చని. ఈ యాప్ సహాయంతో, యాప్ డిజైన్ కలర్ , ఆకృతి రూపకల్పన కూడా కనుక్కోవచ్చు. ఇది మీ మొబైల్ లో డౌన్లోడ్ చేసుకోగలిగే ఒక ఉచిత Android యాప్. దీన్ని డౌన్లోడ్ చేసి ఎప్పుడైనా ఫేక్ నోట్ తనిఖీ చేసుకోవచ్చు. Google Play Store లో 4 స్టార్ రేటింగ్స్‌ను పొందింది. ఈ యాప్ ద్వారా భారత్ కరెన్సీ బ్రిటీష్ పౌండ్, US డాలర్‌తో పాటు, యూరోప్ కరెన్సీ యూరో, జపనీస్ యెన్, చైనీస్ యువాన్ , సింగపూర్ డాలర్లను తెలుసుకోవచ్చు.

నయా గాడ్జెట్స్

చక్కటి నిద్రకు..



ఎలక్ట్రానిక్ దిగ్గజం ఫిలిప్స్ స్మార్ట్ స్లీప్ హెడ్ బ్యాండును మార్కెట్లోకి తెచ్చింది. పడుకునేటప్పుడు దీన్ని ధరిస్తే ఇందులో ఉండే సెన్సార్‌లు మెదడు పనితీరును గుర్తిస్తాయి. క్రమ పద్ధతిలో విడుదల చేసే ధ్వని పరంపరతో చక్కటి నిద్ర పడుతుంది.

ఎక్స్‌బాక్ వన్‌ఎక్స్ గేమింగ్



టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన కన్సోల్ (ఎక్స్‌బాక్స్ వన్‌ఎక్స్) "Xbox One X" మంగళవారం విడుదలైంది. ఇది 4K గేమింగ్, వినోద క్రీడలకు గేమింగ్ సామర్థ్యం కలది. దీని ధర రూ 44,990. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన గేమింగ్ కన్సోల్ Xbox చరిత్రలో అత్యంత వైవిధ్యపూరితమైన గేమ్స్ లైనప్ మార్కెట్‌లోకి విడుదల చేసారు. ఇందులో FOZ మోటార్ స్పోర్ట్ 7, ఎస్సెన్సిన్ క్రీడ్ ఆరిజిన్, కప్ హెడ్, సూపర్ లక్కీ ఉన్నాయి. కన్సోల్ మైక్రోసాఫ్ట్ ఇండియా స్టోర్, ఫ్లిప్‌కార్డుల్లో అమ్మకానికి అందుబాటులో ఉంది. ల్యాండ్మార్క్ , క్రోమా రిటైల్ స్టోర్లలో ఈ పరికరం అందుబాటులో ఉంది.

టైమ్ మెషీన్ కెమెరా



రోడర్ కంపెనీ టైమ్ మెషీన్ కెమేరాను మార్కెట్లోకి తెచ్చింది. కెమేరాతో తీసిన వీడియోలను వెంటనే మీ స్మార్ట్‌ఫోన్ లేదా ట్యాబ్లెట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. బ్యాటరీ ఒక్కసారి చార్జ్ చేస్తే 7 గంటల సేపు ఇది పనిచేస్తుంది.

హెయిర్ స్టీమర్ క్యాప్



ఈ మధ్య కాలంలో జుట్టు ఊడిపోవడం అనేది అందరి సమస్యగా మారింది. దాని కోసం ఎన్ని ట్రిట్‌మెంట్లు తీసుకున్నా ఫలితం ఉండటంలేదు. ఇలాంటి సమయంలో మార్కెట్‌లోకొచ్చిన హెయిర్ స్టీమర్ క్యాప్ అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. దీన్ని ఎలా వాడాలంటే వేడి నూనెను తలకు రాసి హీట్‌క్యాప్‌ను పెట్టుకోవాలి. దీని ద్వారా సెల్స్ ఓపెన్ అయ్యి మరింత పోషణ లభిస్తుంది. ఈ క్యాప్‌ను ఆపరేట్ చేయడం చాలా సులువు. దీంట్లో వేడిని అడ్జస్ట్ చేసుకునే సౌకర్యం కూడా ఉంది.

ఇఒడిబి ర్యాంకింగ్‌పై తెలంగాణ నజర్



మన తెలంగాణ / హైదరాబాద్ : వివిధ అంశాల ప్రతిపదికగా సులభతర వాణిజ్య విధానంలో ఇస్తున్న ర్యాంకింగ్స్‌లో తెలంగాణ ముందంజలో కొనసాగుతోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఈవోడిబి ర్యాంకింగ్స్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తూ వస్తోంది. 2016–17లో తెలంగాణ భారీ ఎత్తున సంస్కరణలు చేపట్టి ఈవోడబి ర్యాంకుల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. తాజాగా 2017–18లో ర్యాంకులపై విపరీతమైన పోటీ ఏర్పడింది. 376 అంశాల ఆధారంగా ర్యాంకుల విధానం చేపట్టారు. డిసెంబర్ 30 వరకు తుది ర్యాంకులకు గడవు విధించగా తెలంగాణ తీవ్ర స్థాయిలో పోటీ పడుతోంది. మొదటి వరుసలో పశ్చిమబెంగాల్, హర్యానా, గుజరాత్, చత్తీస్‌ఘడ్ కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ర్యాంకింగ్స్‌ను మార్చి నెలలో ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు పరిశ్రమల శాఖ అధికార వర్గాలు పేర్కొన్నాయి. తాజాగా కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ విడుదల చేసిన ఆర్థిక సర్వే 2018లోనూ ఈవోడిబి అంశాన్ని ప్రత్యేకంగా చేర్చడంతో మళ్లీ ర్యాంకింగ్స్‌లో వెనకబడిపోకుండా ఎప్పటికప్పుడు అంశాల వారీగా కేంద్ర ప్రభుత్వానికి తమ విషయాలను అప్‌డేట్ చేస్తున్నారు. గత ఏడాది ఈవోడిబి ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానాన్ని చేజిక్కించుకున్న తెలంగాణను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి.

నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు

మన తెలంగాణ / హైదరాబాద్ : నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. ప్రణాళిక విభాగం అంచనాల మేరకు ఆర్థికశాఖ ఈ నిధులను సోమవారం విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. నియోజకవర్గంలో 74 రకాల పనుల నిర్వహణ నిమిత్తం 7.67 కోట్ల రూపాయలను విడుదల చేయగా ఇందులో జనరల్ నిధుల నుంచి రూ. 5.31 కోట్లు, ఎస్సీ నిధి నుంచి రూ. 1.86 కోట్లు, ఎస్టీ నిధి రూ. 50 లక్షల రూపాయలను విడుదల చేసింది. అదే విధంగా జిల్లా పరిధిలోని తాండూరు నియోజక వర్గ అభివృద్ధి కోసం మరో 10 లక్షల రూపాయలను విడుదల చేసింది. జిల్లా మంత్రి మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అభివృద్ధి నిధుల నుంచి విడుదల చేసినట్లు ఆర్థికశాఖ స్పష్టం చేసింది. నాలుగు రకాల పనుల నిర్వహణ కోసం ఈ నిధులను విడుదల చేసిన ఉత్తర్వుల్లో అధికారులు పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నాలుగు రకాల పనుల నిర్వహణ, అభివృద్ధి కోసం 10 లక్షల రూపాయలను విడుదల చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి కోసం ఎనిమిది లక్షల రూపాయలను విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్‌ఈలీ ఎమ్మెల్సీ నిధుల కింద విడుదల చేశారు. ఈ మేరకు ఆర్థిశాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణరావు ససోమవారం వేర్వేరుగా ఉత్తర్వులను జారీ చేశారు.

నేరస్తుల సర్వేపై హైకోర్టులో రిట్

మన తెలంగాణ/ హైదరాబాద్ : నేరస్థుల వివరాల్ని పూర్తిగా సేకరించే నిమిత్తం జరిపే సకల నేరస్తుల సమగ్ర సర్వే పేరిట తమను పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ కల్వకుర్తికి చెందిన అబ్దుల్ హాఫీజ్ హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. తన వేలిముద్రల దగ్గర నుంచి ఫొటోలు/ఆధార్/ఓటర్ ఐడీ వరకూ అన్ని వివరాలు బలవంతంగా తీసుకుంటున్నారని రిట్‌లో ఆరోపించారు. తనపై ఏడేళ్ల క్రితం 420/465 సెక్షన్ల కింద నమోదైన కేసును నాలుగేళ్ల క్రితం కోర్టు కొట్టేసినా తన వివరాలు నేరస్థుల పేరుతో సేకరించడం చట్ట వ్యతిరేకమన్నారు. హత్యలు, దోపిడీలు, విదేశీ కరెన్సీ, పాస్‌పోర్టు వంటి కీలక నేరాలకు పాల్పడిన వారి వివరాల్ని సేకరించాలనే ఉద్దేశంతో జరిపే సర్వేలో తన వివరాలు ఎందుకు సేకరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వెంటనే కోర్టు జోక్యం చేసుకుని అన్యాయాన్ని అడ్డుకోవాలని కోరారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నాగర్‌కర్నూల్ ఎస్‌పీ, కల్వకుర్తి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ప్రతివాదులుగా చేశారు.



సిఐ డ్రంక్ డ్రైవ్

(మొదటిపేజీ తరువాయి)

ఆటో, రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇద్దరు భార్యాభర్తల కాళ్ళు విరిగినట్టు వారి పరిస్థితి ప్రమాదకరంగా మారినట్టు స్థానికులు వెల్లడిస్తున్నారు. యాప్రాల్ శైలి గార్డెన్‌లో నివాసముండే గిరీష్ రావు సోమవారం కౌకూర్ నుండి యాప్రాల్‌కు తన ఇన్నోవా వాహనాన్ని నడుపుకుంటూ వెళ్తుండగా యాప్రాల్ హనుమాన్ దేవాలయం వద్దకు చేరుకో గానే రోడ్డుపై ఉన్న వాహనాలను ఢీకొట్టింది. అది గమనించిన స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం నిందితుడు పారిపోయినట్టు తెలిపారు. గిరీష్‌రావు గతంలో జవహర్‌నగర్ పోలీసు స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించాడు. జవహర్‌నగర్ పోలీసులు ఈ సంఘటనపై కేసున మోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ చలపతి తెలిపారు.

కెటిఆర్ ఉత్తుత్తి పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

పెట్టినట్టు ప్రచారం చేసుకుంటున్నారని, ఆయన గతంలో ప్రధానమంత్రి మోడీ నియోజకవర్గం వారణాసిలో రూ.3 వేల కోట్ల పెట్టుబడులు పెట్టినట్టు ప్రచారం చేసి, రూ.3 కూడా పెట్టలేదన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కూడా పెట్టుబడులు పెట్టినట్టు ప్రచారం చేసినా అక్కడ ఒక్క పైసా రాలేదని అన్నారు.కర్నాటకలో గతంలో మాజీ సిఎం యెద్యూరప్పతో కలిసి భూకుంభకోణంలో బి.ఆర్‌శెట్టి ఇరుక్కున్నారని, అలాంటి వ్యక్తి ఇక్కడ పెట్టుబడులు పెట్టినట్టు ప్రచారం చేసుకోవడం మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లాలలో ఐటిఐఆర్‌ను మంజూరు చేయించి అన్ని రకాల అనుమతులు తెస్తే దాదాపు రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు, 50 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండేదన్నారు.

రంగారెడ్డిలో అన్ని స్థానాలు మావే : రంగారెడ్డి జిల్లాలలో ఇబ్రహీంపట్నంలో క్యామ మల్లేశంతో సహా 12 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ఉత్తమ్ అన్నారు. అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిగా క్యామ మల్లేశ్ విజయం సాధిస్తారని చెప్పారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కోదండరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ళ శారద తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం మోడీ శ్రీకారం?

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని గడువు విధించారు. మేడిగడ్డ బ్యాక్‌వాటర్‌ను కన్నెపల్లి పంప్ హౌజ్ నుంచి అన్నారం బ్యారేజిలో పోస్తారు. కన్నెపల్లి, అన్నారం అప్రోచ్ చానల్‌ను వచ్చే మే నెలాఖరు వరకు పూర్తిచేయాలని గడువు విధించారు. మేడిగడ్డ బ్యారేజి నుంచి మిడ్ మానేరు వరకు నీటిని తీసుకొచ్చే తొలి దశ పనులను భారత ప్రధాని నరేంద్ర మోడీచే ప్రారంభించాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారు. ఈ మేరకు త్వరలో ప్రధానికి విజ్ఞప్తి చేయనున్నారు. ప్రధాని కార్యాలయం నుంచి సానుకూల స్పందన వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఫిబ్రవరి మొదటి, రెండో వారంలో ప్రధానికి అధికారికంగా లేఖ రాయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ విషయాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులతో పంచుకున్నట్లు తెలిసింది. ప్రధాని చేత ప్రాజెక్టును ప్రారంభిస్తే బహుముఖ ప్రయోజనాలు వస్తాయని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారు. దాదాపుగా రూ.80,000 కోట్లపై చిలుకు నిధులతో నిర్మిస్తున్న బృహత్తర ప్రాజెక్టుకు కేంద్రం నుంచి వీలైనంత సహకారం పొందవచ్చు. తక్కువ సమయంలోనే ప్రాజెక్టులు పూర్తిచేసి, చిత్తశుద్ధితో రైతులకు నీళ్లు ఇచ్చిన సందేశం అన్ని రాష్ట్రాలకు పంపించవచ్చు. ఎన్నికలకు ముందే ప్రధానిచే ప్రారంభిస్తే భవిష్యత్తులో ఆరోపణలు వచ్చినా పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ప్రధాని నోటితోనే కాళేశ్వరం నుంచి నేర్చుకోండన్న పాఠాన్ని అందరికీ వినిపిస్తే కీర్తికి కీర్తి, విమర్శలకు చెక్, భవిష్యత్తులోనూ ఇబ్బందులు ఉండవన్న బహుముఖ ఆలోచనలు ముఖ్యమంత్రికి ఉన్నాయి. ఇప్పటికే గవర్నర్, కేంద్ర అధికారులు పర్యటించి కాళేశ్వరానికి పర్యాటక క్షేత్రం హోదాను తీసుకువచ్చారు. ఇక్కడికి ప్రధాని వస్తే కాళేశ్వరం ఖ్యాతి ఇనుమడిస్తుంది. మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి మీదుగా నీటిని వరద కాలువ ద్వారా మిడ్ మానేరు రిజర్వాయర్‌లో పోయాలని ప్రభుత్వం లక్ష్యంగా విధించుకుంది.

కాళేశ్వరం ఫేజ్ 1 పనులు

మేడిగడ్డ బ్యారేజి	16.17 టిఎంసిలు
అన్నారం బ్యారేజి	10.87 టిఎంసిలు
సుందిళ్ల బ్యారేజి	8.83 టిఎంసిల
మేడారం రిజర్వాయర్	0.78 టిఎంసిలు

తల్లి, కూతురు, మనమరాలు సంచలన హత్యలు



ఫైల్

మన తెలంగాణ–/ హైదరాబాద్/ శేరిలింగంపల్లి : ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి పాప హత్యకు గురైన సంఘటన హైద రాబాద్‌లోని చందానగర్‌లో కలకలం సృష్టించింది. తాళం వేసి ఉన్న ఇంట్లో నుంచి దుర్వాసన వస్తున్న విషయాన్ని గమనించిన కొందరు అపార్ట్‌మెంట్ వాసులు యాజమాన్యానికి తెలుపగా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా మూడు మృతదేహాలు అపార్ట్‌మెంట్‌లో పడిఉన్నట్లు గమనించారు. భీమవరానికి చెందిన అపర్ణ (35) తల్లి విజయలక్ష్మి (58) నాలుగేళ్ల చిన్నారి కార్తికేయతో కలిసి చందానగర్ వేముకుంటలోని సాయికుశల అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. అపర్ణ ప్రస్తుతం చందానగర్ బజాజ్ ఎలక్ట్రానిక్స్ సంస్థలో పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. అపర్ణకు నాలుగు సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం, ఉల్లంపాడుకు చెందిన మధుతో ప్రేమ వివాహం జరిగింది. అప్పటికే మధుకు పెళ్ళి అయి పిల్లలు ఉన్నారు. మధు కూకట్‌పల్లిలో మొబైల్ టెక్నీషియన్‌గా పనిచేస్తుండగా, అప్పట్లో సుజన ఫోరంమాల్ సంస్థలో పని చేస్తున్న అపర్ణతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారి పెళ్లి చేసుకున్నారు. గత కొంత కాలంగా అపర్ణ వేరే వారితో చనువుగా ఉండడంతో మధు, అపర్ణల మధ్య మనస్పర్థలు వచ్చి గొడవపడుతుండేవారు. గత కొంత కాలంగా వీరు దూరంగా ఉంటున్నారు. మధు మొదట పెళ్ళి అయిన విషయాన్ని దాచిపెట్టి తనను పెళ్ళి చేసుకున్నాడన్న విషయం తెలుసుకున్న అపర్ణ మధును నిలదీయడంతో గొడవలు తారస్థాయికి చేరినట్లు తెలుస్తుంది. చందానగర్‌లోని అపర్ణ తల్లి కూతురుతో ఉన్న సమయంలో అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన దుండగులు అపర్ణ తలపై రోకలి బండతో బలంగా కొట్టగా వంట గదిలోనే ఆమె ప్రాణాలు విడిచి పడి ఉంది. అపర్ణ తల్లి విజయలక్ష్మి నాలుగేళ్ల పాప కార్తీకేయలు ఎటువంటి గాయాలు లేకుండానే మంచంపై చనిపోయి పడి ఉన్నారు. వీరు ఎలా చనిపోయారనే విషయం మిష్టరీగా మారింది. గొంతు నులిమి చంపారా? లేక విషప్రయోగం జరిగిందా? అని పోలీసుల విచారణలో తేలియాల్సి ఉంది. వీరిని చంపిన అనంతరం దుండగులు అపార్ట్‌మెంట్ ముందు తలుపుకు తాళాలు వేసి పరారయ్యారు. అయితే ఈ ముగ్గురిని ఒకరే చంపారా? లేక ఎంత మంది కలిసి చంపారు? అనే విషయం సస్పెన్స్‌గా మారింది. ఇరువైపులా ఉన్న అక్రమ సంబంధాలే ఈ హత్యలకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ హత్యలు ఈ నెల 26న జరిగి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. 26వ తేది రాత్రి 11 గంటల తరువాత అపర్ణ ఆఖరి కాల్ మాట్లాడినట్లు సెల్ ఫోన్‌లో రికార్డు అయి ఉంది. సంఘటన స్థలాన్ని సైబరాబాద్ జాయింట్ సీపీ షానవాజ్ ఖాసీం, డీసీపీ విశ్వప్రసాద్, ఏసీపీ రవికుమార్, చందానగర్ సీఐ తిరుపతిరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నామని, కాలనీలోని పలు సీసీ కెమెరాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు. హత్యలు జరిగిన సమయంలో పక్కంటి వారికి ఎలాంటి శబ్ధాలు వినిపిచక పోవడం అనుమానాస్పదంగా ఉందని, హత్యలు జరిగి 48 గంటలు కావొచ్చున్న అనుమానాన్ని జాయింట్ సీపీ వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి అపర్ణ భర్త మధు పోలీసులకు లొంగి పోయినట్లు సమాచారం.

వృద్ధిరేటు లక్ష్యం 7.5 శాతం

(మొదటిపేజీ తరువాయి)

వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా రూపొందుతుందని కూడా ఈ సర్వే వెల్లడించింది. అయితే పెరుగుతున్న చమురు ధరలు, స్టాక్ ధరలలో నిశితమైన కరెక్షన్ మూలంగా ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు ఎదురవుతాయని సర్వే తెలిపింది. ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా వ్యవహరించే ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఈ సర్వేను రూపొందించారు. బిజెపి ప్రభుత్వం తన ప్రస్తుత హయాంలో ఐదవ, పూర్తిస్థాయి ఆఖరి బడ్జెట్‌ను సమర్పించడానికి రెండు రోజుల ముందు ఇది విడదలయింది. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు 'ద్రవ్య స్థిరీకరణ ప్రణాళిక'కు విరామం ఇచ్చే అవకాశం కూడా ఉన్నట్లు సర్వే పేర్కొంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో 2017 – 18 ఆర్థిక సర్వేని ప్రవేశపెట్టారు. నోట్ల రద్దు, జిఎస్‌టి తాత్కాలికంగా ప్రభావం చూపినా ఆర్థిక వ్యవస్థ కోలుకొని భారీ స్థాయిలో వేగంగా పుంజుకొంటోందన్నది సర్వే సారాంశమని అరవింద్ విలేకరుల గోష్టిలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి) వృద్ధి 6.75 శాతంగా సర్వే పేర్కొంది. వచ్చే ఏడాది ఎగుమతులు, పెట్టుబడులు సమృద్ధిగా ఉంటాయని సర్వే అంచనా వేసింది. కేంద్ర గణాంకాల కార్యాలయం (సిఎస్‌ఒ) అంచనా వేసిన 6.5 శాతం కంటే జిడిపి వృద్ధి రేటు అధికంగా ఉంది. 2016–17లో జిడిపి వృద్ధి రేటు 7.1 శాతం ఉంది. అంతకు ముందు ఏడాది అది 8 శాతం. 2014 –15లో 7.5 శాతం దాకా అది ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి జిఎస్‌టి ప్రవేశపెట్టడంవల్ల మందగించింది. అలాగే పెద్ద నోట్ల రద్దు పర్యవసానాల వల్ల కూడా మాంద్యం కొద్ది కాలంపాటు ఏర్పడింది. ఈ ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీలకు, 2019 మేలో లోక్‌సభకు ఎన్నికలు జరగవలసి ఉంది. ఈ తరుణంలో ఆర్థిక వ్యవస్థపై శుభ వార్త సర్వే రూపంలో వెలువడింది. జిఎస్‌టి అమలులో కనపడిన అరాచకం తుదకు తొలగి ఆ పన్నుల వ్యవస్థ స్థిరపడడం జరిగిందని ఈ సర్వే తెలుపుతోంది. గత ఏడాదిగా ఆర్థిక వ్యవస్థ సాధించిన విజయాలను సర్వే సమగ్రంగా చూపుతున్నట్లు డెలాయిట్ ఇండియా ప్రధాని ఆర్థిక వేత్త అనీస్ చక్రవర్తి పేర్కొన్నారు. అలాగే వచ్చే ఏడాదికి ఎదురవనున్న సవాళ్లు ఏమిటో సంపూర్ణంగా తెలిశాయన్నారు. ఎగుమతులు పుంజుకొంటే వృద్ధి రేటు 7.5 శాతాన్ని మించుతుందని అంచనా వేశారు. అయితే చమురు ధరలు 'ఎలివేటెడ్ షేర్ ధరలలో' కరెక్షన్ వల్ల ఆర్థిక దిగలాగుడు తప్పకపోవచ్చని కూడా అన్నారు. జిడిపిలో 0.2 –0.3 శాతం ప్రభావం ఉండవచ్చని, ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 14 శాతం పెరగవచ్చని సర్వే తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత దేశం దిగుమతి చేసుకొనే బాస్కెట్ చమురు ధరలు 14 శాతం పెరిగాయని 2018–19లో కూడా 10–15 శాతం పెరగవచ్చని సర్వే హెచ్చరించింది. బ్యారెల్ చమురు ధర 10 అమెరికా డాలర్లు అయితే కరెంట్ అకౌంట్‌లో లోటు పెరుగుతుందని సుబ్రమణియన్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది చోటు చేసుకొనే ఆర్థికపరమైన ఆందోళనలు మధ్య ఆర్థిక విధానాలపై గట్టి నిఘా అవసరపడుతుందని కూడా సర్వే పేర్కొంది. పెట్టుబడుల ప్రవాహంలో హఠాత్తుగా తిరోగమనం చోటు చేసుకుంటే ఈ నిఘా చాలా అవసరమవుతుంది. 2018లో ప్రపంచ వృద్ధిరేటు తగు మాత్రం మెరుగుపడే సూచన ఉండడంతో జిఎస్‌టిలో మరింత సుస్థిరత నెలకొని, పెట్టుబడుల పరిస్థితి కోలుకోవచ్చునని సర్వే అంచనా వేసింది. ప్రస్తుతం ఆర్థిక రంగంలో సాగుతున్న వ్యవస్థాపరమైన సంస్కరణల ఫలితంగా అధిక వృద్ధి రేటు సాధ్యం. బ్యాలెన్స్ షీట్‌ను నిలకడగా ఉంచడానికి ఎయిర్ ఇండియా ప్రైవేటుపరం, సూక్ష్మ ఆర్థిక సుస్థిరత చర్యలు చేపట్టనున్నారు. విధానపరమైన మూడు కీలక అంశాలపై దృష్టి పెట్టడం జరుగుతోంది.

జాతరమ్మ.. జాతరో


(మొదటిపేజీ తరువాయి)



గద్దెలపై కొలువుతీరుతారు. తల్లిబిడ్డలు ఇద్దరు గద్దెలపై కొలువు దీరిన తరువాత భక్తులు పెద్ద ఎత్తున వచ్చి శుక్రవారం మొక్కులు చెల్లించుకుంటారు. శనివారం సాయంత్రం తిరిగి సమ్మక్క, సారలమ్మలు వనప్రవేశం చేస్తారు. వీరితో పాటే పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వన ప్రవేశం చేయడంతో మహా జాతర ముగుస్తుంది.

పూర్తి అయిన ఏర్పాట్లు

జాతరకు కోటి 20లక్షల మందికి పైగా భక్తులు వస్తారని ముందు నుంచి ప్రభుత్వం, అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగానే జాతరకు వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లను చేశారు. 80 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాట్లను పూర్తి చేశారు. గతం కాన్న కొంద మేరుగైన ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా మరుగుదొడ్ల ఏర్పాటులో గతం కన్నా కొంత మెరుగుగానే ఏర్పాటు చేసినప్పటికి వాటికి నిరంతరాయంగా నీటి వసతి కల్పించకపోతే ఒక రోజుతోనే నిరుపయోగంగా మారే ప్రమాదం ఉంది. 10వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. జాతర ప్రాంతంలో 200 సిసి కెమెరాలతో పర్యవేక్షణ, 20 సిసి కెమెరాలను 163 జాతీయ రహదారిపై ఏర్పాటు చేశారు. ఇందు కోసం ప్రత్యేకమైన యాప్‌ను కూడా తయారు చేశారు. ఈ సారి పోలీసులు ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నారు. భక్తులకు స్నానాలు చేయడానికి వీలుగా జంపన్న వాగుకు ఇరువైపు రెండు కిలో మీటర్ల పొడవునా బ్యాటరీ ఆఫ్ టాప్స్‌ను షవర్స్‌తో ఏర్పాటు చేశారు. జాతరకు భక్తులకు మంచినీటి ఇబ్బందులు కలుగకుండా 25లక్షల వాటర్ బాటిల్స్‌ను అందిస్తున్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఆధ్వర్యంలో 20 టవర్లు, ఐడియా ఆధ్వర్యంలో 7టవర్లు, ఏయిర్‌టెల్ ఆధ్వర్యంలో 4టవర్స్‌తోపాటు రిలయన్స్ జియోకూడా సేవలను అందిస్తున్నారు. ఆర్‌టిసి 4200 బస్సులను నడుపుతోంది. హైదరాబాద్, వరంగల్ నుంచి ఏసి సర్వీస్‌లను నడుపుతున్నారు. ప్రత్యేకంగా హెలీకాప్టర్ సేవలను అందిస్తున్నారు. భక్తులకు వైద్య సేవలను అందించేందు కోసం మేడారంలో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. వీటితోపాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా భక్తుల సౌకర్యార్థం 56 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్‌శాఖ నుంచి 150 ట్రాన్స్‌ఫార్మర్స్‌తోపాటు 500 మంది విద్యుత్ సిబ్బంది సేవలను అందిస్తున్నారు. 12000 మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. 3వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో క్లీనింగ్ ఏర్పాట్లు చేశారు. ఐదు జిల్లాల నుంచి 119 గెజిటెడ్ అధికారులతోపాటు 12000 మంది వివిధ స్థాయి ఉద్యోగులు సేవలను అందించనున్నారు.



వన్‌వేతో భక్తులకు తప్పని ఇక్కట్లు

జాతరలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వన్‌వే విధానాన్ని అమలు చేయడం వల్ల భక్తులు తీవ్రమైన ఇబ్బందులకు గురికానున్నారు. హైదరాబాద్ వైపు నుంచి వరంగల్, పస్రా, నార్లాపూర్ మీదుగా మేడారం వచ్చే భక్తులు తిరుగు ప్రయాణంలో నార్లాపూర్, బయ్యక్కపేట, భూపాలపల్లి, పరకాల, గుడెప్పాడ్ మీదుగా తిరిగి హన్మకొండ చేరుకోవాల్సి వస్తుంది. అదే విధంగా కరీంనగర్ ప్రాంతం నుంచి వచ్చే భక్తులు భూపాలపల్లి, గణపురం, జంగాలపల్లి, పస్రా, నార్లాపూర్ మీదుగా మేడారం చేరుకోవాల్సి ఉంటుంది. తిరుగుప్రయాణం సులభంగానే చేరుకోగలుగుతారు. మేడారం సమీపంలోనే ఉన్న ములుగు నియోజకవర్గ ప్రజలు మాత్రమే మేడారం దర్శనం తరువాత నార్లాపూర్, బయ్యక్కపేట, భూపాలపల్లి, పరకాల మీదుగా ములుగు చేరుకోవాల్సి ఉంటుంది. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సులభంగానే ఉంటున్నప్పటికి భక్తులు మాత్రం తీవ్రమైన ఇబ్బందులు పడాల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వైద్య విధాన పరిషత్‌కు రూ. 103.18 కోట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : వైద్య విధాన పరిషత్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ప్రభుత్వం చేసిన కేటాయింపులకు అనుగుణంగా వైద్య ఆరోగ్య శాఖ అమోదం తెలిపింది. 2017 – 18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలకు సోమవారం పాలనా అనుమతులు లభించాయి. రూ. 103.18 కోట్లకు సంబంధించి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ నుంచి వైద్యవిధాన పరిషత్‌కు ఉత్తర్వులు అందినట్లు కమిషనర్ వెల్లడించారు.

ఎదురులేని టిఆర్ఎస్

(మొదటిపేజీ తరువాయి)

ఓట్ల మెజారిటీతో గెలుపొందడం విశేషం. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ బలంగా ఉన్న పలు స్థానాల్లో కూడా టిఆర్ఎస్ పాగా వేసింది. బిజెపి నేత నాగం జనార్దన్‌రెడ్డికి పట్టు ఉన్న నాగర్‌కర్నూల్ సమీపంలోని తెల్కపల్లి మండలం గడ్డంపల్లి పంచాయతీలో బిజెపి మద్దతుతో నిలబడిన అభ్యర్థి గెలుపొందడం గమనార్హం. గెలుపొందిన వారి వివరాలు (బ్రాకెట్‌లో బలపరిచిన పార్టీ పేరు) ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా వద్దిపట్ల సర్పంచ్‌గా రమావత్ హంజా (టిఆర్ఎస్), మాదాపురం సర్పంచ్‌గా బోనోత్ బాలునాయక్ (టిఆర్ఎస్), పెద్దపల్లి జిల్లా బ్రాహ్మణపల్లి సర్పంచ్‌గా సోగాల అశోక్ (టిఆర్ఎస్), మహబూబ్‌నగర్ జిల్లా వీపనగండ్ల సర్పంచ్‌గా గోదల బీరయ్య(కాంగ్రెస్), సంగారెడ్డి జిల్లా రాయ్‌కోడ్ సర్పంచ్‌గా టి.సరోజినమ్మ (కాంగ్రెస్), మెదక్ జిల్లా అల్లీపూర్ సర్పంచ్‌గా లావణ్య (టిఆర్ఎస్), వరంగల్ జిల్లా తొర్రూర్ సర్పంచిగా దేవరకొండ శ్రీనివాస్ (టిఆర్ఎస్), ఆదిలాబాద్ జిల్లా బోరెగాం సర్పంచ్‌గా సౌజన్య (టిఆర్ఎస్), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ సర్పంచ్‌గా కీసరి చిట్టెమ్మ (టిఆర్ఎస్), మహబూబ్‌నగర్ జిల్లా గుండరాజపల్లి సర్పంచ్‌గా లలిత (టిఆర్ఎస్), సిద్దిపేట జిల్లా పొట్లపల్లి సర్పంచ్‌గా చంద్రమౌళి (కాంగ్రెస్)లు గెలుపొందారు. మిగిలిన వాటిలో టిఆర్ఎస్ బలపరచిన అభ్యర్థులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుంపెన, కరీంనగర్ జిల్లా ఉప్పరమల్యాల, మహబూబ్‌నగర్ జిల్లాలోని గుర్తూర్, మహబూబాబాద్ జిల్లా బస్వాపూర్, మంచిర్యాల జిల్లా కర్ణమామిడి, నల్గొండ జిల్లా పి.ఎ.పల్లి, సిద్దిపేట జిల్లా కొండాపూర్, సూర్యాపేట జిల్లా మనపురం, వనపర్తి జిల్లా నాగల్ కడమూర్ సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా బస్వాపూర్‌లో కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థి, మెదక్ జిల్లా దామరచర్లలో స్వతంత్ర అభ్యర్థి, గద్వాల్‌జోగులాంబ జిల్లా రామాపురంలో స్వతంత్ర అభ్యర్థి, నాగర్ కర్నూల్ జిల్లా గడ్డంపల్లిలో బిజేపి బలపరచిన అభ్యర్థి సర్పంచ్‌లుగా గెలుపొందారు. మొత్తం 23 గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికల్లో 16 స్థానాలను టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు, నాలుగు కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులు, ఒకటి బిజెపి బలపరిచిన అభ్యర్థి, స్వతంత్రులు ఇద్దరు గెలిచారు.

ఉత్పత్తిలో ఉన్నతం

(మొదటిపేజీ తరువాయి)

పలుకుతామన్నారు. యూనివర్సిటీలో చేసే పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. టి హబ్, ఆర్ఈసీ ఎంవోయు వివరాలను వెల్లడిస్తూ ఈ ఒప్పందంలో భాగంగా ఇన్నోవేషన్ ప్లాట్ పాంలో తెలంగాణ , ఏపిలకు చెందిన 30 యూనివర్సిటీలకు చెందిన 1800 మంది విద్యార్థులు సోలార్ , పవన విద్యుత్తు , బయో వేస్ట్ విద్యుత్‌పై పరిశోధన చేయనున్నారని తెలిపారు. సుమారు 600 ప్రాజెక్టులపై వారు పరిశోధనలు జరుపనున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ హిత కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందని గుర్తు చేశారు. మిషన్ కాకతీయతో భూగర్భ జలాలను పెరగుతాయని, హరితహారం వల్ల పచ్చదనం పెరిగి వాతావరణ సమతుల్యతకు దోహదపడుతుందని కెటిఆర్ అన్నారు. ఇప్పటికే సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా టి హబ్ సిఈవో జయ కృష్ణన్ మాట్లాడుతూ వాతావరణ మార్పులను కూడా టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాలకు అనుకూలంగా మలుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాజాగా సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ఆర్ఈసీతో భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆర్ఈసి ఎండి డా. పివి రమేష్ మాట్లాడుతూ ఇప్పటి యువత ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీ సృష్టించేందుకు పోటీ పడుతోందన్నారు. ప్రస్తుతం ఉన్న సవాళ్లు, వాటిని అధిగమించేందుకు నివారణ ఉపాయాలను కనుగొంటూ భవిష్యత్తుకు బాటలు వేస్తోందన్నారు.

జమిలి జనహితం

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, కేంద్ర మంత్రులు, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ తదితర ప్రముఖులు హాజరయ్యారు. తరచూ ఎన్నికలు నిర్వహించడం వల్ల ఆర్థిక వ్యవస్థ మీద, అభివృద్ధిపైనా ప్రతికూల ప్రభావం పడుతుందని రామ్‌నాథ్ కోవింద్ ఆందోళన వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలపై చర్చ జరగాలని, అన్ని రాజకీయ పార్టీలు దీనిపై ఏకాభిప్రాయానికి రావాలని ఆయన సూచించారు.

మైనారిటీల బుజ్జగింపు కాదు... సాధికారత

మైనారిటీలను బుజ్జగించడానికి బదులు ప్రభుత్వం వారి సాధికారతకు కట్టుబడి ఉందని రాష్ట్రపతి అన్నారు. వారి ఆర్థిక, సామాజిక, విద్యా సాధికారతలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీకో ఔర్ కమావో, ఉస్తాద్, గరీబ్ నవాజ్ కుశల్ వికాస్ యోజన, నయా రోష్నీ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్, సిక్, బౌద్ధ, పార్శీ, జైన మైనారిటీలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

జమ్ముూకశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో సీమాంతర ఉగ్రవాద ఘటనలకు చోటు చేసుకుంటున్నాయని, వాటికి మన సైన్యం, పారా మిలిటరీ బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు దీటుగా జవాబిస్తున్నారని కోవింద్ తన ప్రసంగంలో వివరించారు. ఈశాన్య రాష్ట్రాల్లో, మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో హింసాత్మక స్థితిని కూడా ఆయన ప్రస్తావించారు. ఎవరైతే రాజ్యాంగంలో విశ్వాసం ఉంచి, హింసను త్యజించి జనజీవన ప్రధాన స్రవంతికి రావాలనుకుంటున్నారో వారితో ప్రభుత్వం చర్చలు జరపడానికి కూడా తన విశాలతను కనబరుస్తోందన్నారు.

వృద్ధి రేటు చెక్కుచెదరలేదు

2016–17 తొలి త్రైమాసికంలో ప్రపంచ మాంద్యం ఏర్పడినప్పటికీ భారత్ వృద్ధి రేటు మాత్రం చెక్కుచెదరలేదని రామ్‌నాథ్ కోవింద్ చెప్పారు. స్థూల జాతీయోత్పత్తి(జిడిపి) తాత్కాలికంగా మందగించిందని, అయితే అది 2017–18 రెండో త్రైమాసికంలో మళ్లీ పుంజుకుందని తెలిపారు. గత మూడున్నర ఏళ్లలో ద్రవ్యోల్బణం రేటు, ప్రభుత్వ ఆర్థిక, కరెంటు లోటు సగటు స్థాయిలోనే ఉందని, అది కూడా ఇప్పుడు క్రమేణ తగ్గుముఖం పట్టిందని అన్నారు. ఇక విదేశీ మారక రిజర్వులు 410 బిలియన్ డాలర్ల మేరకు పెరిగాయన్నారు. దేశంలో ఏకీకృత ఆర్థిక విధానం సాధించేందుకు ప్రభుత్వం వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి)ని ప్రవేశపెట్టిందని రామ్‌నాథ్ చెప్పారు. స్వాతంత్ర్యానంతరం తెచ్చిన అతి పెద్ద పన్ను సంస్కరణ ఇదన్నారు. బ్యాంకులను బలోపేతం చేసి బ్యాంకుల విధానాన్ని పారదర్శంక చేశామన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రభుత్వ పోరాటం కొనసాగుతుందన్నారు. దీనిలో భాగంగా ఏడాది కాలంలో 3.5 లక్షల డొల్ల కంపెనీల రిజిస్ట్రేషన్ రద్దు చేశామన్నారు.

అన్ని గ్రామాలకు రోడ్ల అనుసంధానం

అన్ని గ్రామాలను రోడ్లతో కలపాలన్నది ప్రభుత్వ సంకల్పం అనీ, 2022 నాటికి వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపు చేయాలని కూడా ప్రభుత్వం యత్నిస్తోందని రాష్ట్రపతి తన ప్రసంగంలో చెప్పారు. అంతర్జాతీయంగా మన దేశం అనేక దేశాలతో, అగ్ర రాజ్యాలతో స్నేహసంబంధాలు పెంచుకుందన్నారు. దక్షిణాసియా ప్రాంత సౌభాగ్యం, అభివృద్ధి మన ఉమ్మడి ఆశయం అన్నారు. క్షిపణి సాంకేతిక నియంత్రణ పాలన, షాంఘై సహకార సంస్థ విధుల మెమోరాండంపై సంతకం చేయడం ద్వారా ప్రపంచ వ్యవహారాల్లో భారత్ పాత్ర పెరిగిందన్నది ప్రతిబించిందన్నారు. మారుమూల ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో బాలల ప్రయోజనానికి రోగనిరోధక కవరేజి(ఇమ్యూనైజేషన్ కవరేజ్) వార్షిక రేటును 1 శాతం నుంచి 6.7 శాతానికి పెంచామన్నారు. పేదలకు మంచి వైద్యం అందించడానికిగాను 'జాతీయ ఆరోగ్య పథకం' కింద అందుబాటు ధరలో ఆరోగ్య వసతులు కల్పించినట్లు చెప్పారు. ఇటీవల ప్రభుత్వం 'ఇంద్రధనుష్' కార్యక్రమాన్ని వేగవంతం చేసిందన్నారు. దీంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు, ఆర్థిక స్తోమతలేని వారి పాట్లు తగ్గించే ప్రయత్నం చేశామన్నారు. తమ ప్రభుత్వం మూడున్నరేళ్లలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 93 లక్షల ఇళ్లకుపైలటగా నిర్మించిందని రామ్‌నాథ్ కోవింద్ తెలిపారు. 2022 నాటికి ఇళ్లులేని ప్రతి ఒక్కరికి, పేదలకు ఇళ్లు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు 'ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన' కింద 2022 నాటికి పట్టణాల్లోని పేదలకు గృహ వసతి కల్పించబోతుందన్నారు.

పాఠశాల, ఉన్నత విద్య ఆధునీకరణ

దేశంలో పాఠశాల, ఉన్నత విద్య ఆధునీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రామ్‌నాథ్ కోవింద్ తన ప్రసంగంలో చెప్పారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ కింద 2400 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'ను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. పిల్లల్లో పిన్న వయస్సులోనే సృజనాత్మకతను పెంచేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ'కి కూడా ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఈ ఏజెన్సీ దేశంలో ఉన్నత విద్య పరీక్షలను స్వతంత్రంగా నిర్వహించనున్నది. దేశంలో ప్రధాన రవాణా వ్యవస్థగా నేటికీ రైల్వే ఉందన్నారు. రైల్వేల ఆధునీకరణ అవసరమన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రైల్వేను తమ ప్రభుత్వం తీర్చిదిద్దాలనుకుంటోందని కోవింద్ చెప్పారు. ముంబయి నుంచి అహ్మదాబాద్‌ల మధ్య నడిచే హైస్పీడ్ బుల్లెట్ ట్రెయిన్ నిర్మాణ పనులను ప్రభుత్వం ఇప్పటికే ఆరంభించేసిందన్నారు. దేశంలోని 11 నగరాల్లో మెట్రో పనులు కొనసాగుతున్నాయన్నారు.



కార్పొరేట్ శక్తుల చేతుల్లో కెసిఆర్ : కోదండరాం

మన తెలంగాణ/హైదరాబాద్: ''కరెంటు కొనేటోళ్లు లేకనే వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంటు సరఫరా చేస్తోంది... సౌర విద్యుత్‌ప్రాజెక్టులను నిరుద్యోగులకు అప్పగించాలని కోరితే, ప్రభుత్వం బడాబడా కంపెనీలకు అప్పగిస్తోందని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.'కాంట్రాక్టులను అడ్డగోలుగా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోంది, చిన్నచిన్న కళాశాలల వెంట పడుతున్న ప్రభుత్వం నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థలు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోవడంలేదు, ఉద్యమంలో కొట్లాడినోడు ఎక్కడికోపోయిండుఎవరెవరో ముందున్నరు, తెలంగాణ సినిమాను ప్రోత్సహించేందుకు ఒక ఫిలిమ్ ఇనిస్టిట్యూట్‌ను పెట్టాలని కోరితే తెలంగాణకు వ్యతిరేకంగా నిలబడిన వ్యక్తి (మంత్రి)కి కట్టబెట్టింది, సుమారు రూ. 25వేల కోట్ల కాంట్రాక్ట్‌పనులను ఆంధ్రా కంపెనీలకు అప్పగించింది. వ్యవసాయం రంగంపై అనేక ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేసినా పట్టించుకోలేదు, ఇదీ తెలంగాణ సర్కారు ధోరణి' అని వ్యాఖ్యానించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం తెలంగాణ విద్యావంతుల వేదిక (టివివి) 2018 డైరీ ఆవిష్కరణ సందర్భంగా 'వర్తమాన రాజకీయాలు– విద్యావంతుల పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సుకు కోదండరాంతో పాటు వీక్షణం సంపాదకులు వేణుగోపాల్, ప్రొ.సూరేపల్లి సుజాత, టివివి అధ్యక్షులు గురిజాల రవీందర్, తెలంగా జెఎసి ప్రతినిధి బి.ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా వంద రోజుల ఐక్యత యాత్ర

నేడు హైదరాబాద్‌లో జాతీయ సదస్సు



మన తెలంగాణ/ హైదరాబాద్ : దేశ బహుళత్వాన్ని కాపాడాలని, రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత కచ్చితంగా అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు త్వరలో బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు ఇండియన్ నేషనలిస్ట్స్ మూవ్‌మెంట్ జాతీయ కన్వీనర్ అయాబ్ మహ్మద్ తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం జరగనున్న తమ సంస్థ తొలి జాతీయ సదస్సులో దీనిపై చర్చిస్తామని చెప్పారు. ఆబిడ్స్ తిలక్ రోడ్‌లోని ఆబిడ్స్ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ సదస్సుకు సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, మంత్రి ఈటల రాజేందర్, ఎంఎల్‌సి ఎ.ఎం.డిఫారుఖ్, ఎంఎల్‌ఏలు వినయ్ భాస్కర్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ తదితరులు హాజరవుతారని ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐక్యతా యాత్ర పేరుతో దేశవ్యాప్తంగా వంద రోజుల పాటు 25 బస్సుల్లో మొత్తం 707 జిల్లాల్లో ప్రయాణం చేసి ప్రజలను చైతన్య పరచనున్నట్లు అయాబ్ మహ్మద్ తెలిపారు. ఈ యాత్ర ద్వారా దేశం ఎదుర్కొంటున్న అసలు సమస్యలు వెలుగులోకి తీసుకువస్తామని చెప్పారు. తమ యాత్రకు సంబంధించి 12 అంశాలను గుర్తించామన్నారు. ఇందులో ఆరోగ్యం, పేదరికం, న్యాయ వ్యవస్థ, రాజకీయ పార్టీలకు కార్పొరేట్ నిధులు, నిరుద్యోగం, అవినీతి, రిజర్వేషన్‌లు, ఎంపి ల్యాడ్ నిధుల వినియోగం, సబ్సిడీలు వంటివి ఉన్నాయన్నారు. అలాగే 2013 తరువాత మతతత్వ హత్యల్లో మరణించిన వారి కుటుంబాలకు పరిహారం, మతం పేరుతో రెచ్చగొట్టే ప్రజాప్రతినిధులపై చర్య వంటి అంశాలు ఉన్నాయని వివరించారు. ఈ యాత్రను హైదరాబాద్ నుండి ప్రారంభిస్తామని, శ్రీనగర్‌లో ముగిస్తామన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రజల హక్కులను టిఆర్ఎస్ ప్రభుత్వం కాలరాస్తోందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతాసాంబమూర్తి ఆరోపించారు. ఎమర్జెన్సీతో కాంగ్రెస్‌కు ఏ గతి పట్టిందో భవిష్యత్తులో టిఆర్ఎస్‌కూ అదే గతి పడుతుందని అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమా వేశంలో మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న అత్యాచారాల పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఏడు వేల పైచిలుకు దాడులు జరిగాయని, దీనిపై అసెంబ్లీ సమావేశాలలో చర్చను పెట్టాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్, మూడు ఎకరాల భూ పంపిణీ కార్యక్రమాన్ని ఎంత మంది దళితులకు పంపిణీ చేశారో శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ పున్నయ్య కమిటీ, కోనేరు కమిటీ సిఫార్సులు ఎక్కడికి పోయాయని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం అవలంభిస్తున్న దళిత వ్యతిరేక విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేపడుతామన్నారు.

సబ్‌జైలును తరలించవద్దు

మంత్రి తుమ్మలను కోరిన న్యాయవాదులు




మన తెలంగాణ/ మధిర : మధిరలో ఉన్న సబ్‌జైల్‌ను తరలించవద్దంటూ సోమవారం న్యాయవాదులు టిఆర్ఎస్ నాయకులతో కలిసి రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విన్నవించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాసంశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ మధిరలో సబ్‌జైల్‌ను తరలించవద్దని, తరలిస్తే మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం, బోనకల్, మధిర మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మధిర సబ్‌జైల్ తరలింపు యోచనను విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, టిఆర్ఎస్ నాయకులు లింగాల కమల్‌రాజు, బొమ్మెర రామ్మూర్తి, మల్లాది వాసు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

మన తెలంగాణ/చర్ల: భద్రాచలం జిల్లా చర్ల మండల కేంద్రమైన చర్లలోని కస్తూర్బా పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు సోమవారం అదృశ్యం అయ్యారు. కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కొయ్యూరు గ్రామానికి చెందిన గోతి గౌరి, చర్ల సాయినగర్‌కు చెందిన బండారి సౌజన్య ఇరువురు సోమవారం ఉదయం నుండి కస్తూర్బా పాఠశాల హాస్టల్లో కనిపించలేదు. ఆదివారం రాత్రి గం. 10.30ల వరకు స్టడీ అవర్‌లో ఉన్న వీరిరువురు తెల్లవారు జామున గం. 4.30లకు హాస్టల్ వార్డెన్ విద్యార్థినులు నిద్రలేపడానికి వెళ్ళగా ఇరువురు విద్యార్థినులు అదృశ్యమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉదయం గం. 6 వరకు హాస్టల్ పరిసరాలలో వెతికిన వార్డెన్ జయసుధ అనంతరం ఆమే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సిసి కెమేరాల్లో సైతం విద్యార్థినులు అదృశ్యమైన దృశ్యాలు రికార్డు కాకపోవడంతో హాస్టల్ వార్డెన్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. చర్ల తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంఈఓ జంకీలాల్‌లు హాస్టల్ వార్డెన్‌ను, తోటి విద్యార్థినులను విచారించారు.

యువతి దారుణ హత్య



మన తెలంగాణ/నాగారం : మహిళను హత్య చేసి కాల్చేసిన సంఘటన సోమవారం నల్లగొండ జిల్లా నాగారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వర్ధమానుకోట ఆవాస గ్రామమైన విజయ్‌నగర్ కాలనీకి చెందిన ఆకారపు అడిమయ్య, లక్ష్మమ్మ దంపతులకు నాల్గో కూతురైన ఆకారపు అన్నపూర్ణ(20)ను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసి కాల్చివేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆకారపు అన్నపూర్ణ (20)తిరుమలగిరి మండల కేంద్రంలోని సత్యం కంప్యూటర్‌లో కంప్యూటర్ శిక్షణ తీసుకుంటుంది. 26న ఉదయం 7గంటల సమయంలో ఫోన్ మాట్లాడుకుంటూ ఇంటి నుంచి బయటకు వెళ్ళిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం తన ఇంటికి సమీప దూరంలో ఎస్సారెస్పీ పిల్ల కాల్వ పక్కన చెట్ల పొదల్లో గుర్తు తెలియని శవం ఉందని అటుగా పనికి వెళ్తున్న వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతురాలి తల్లి లక్ష్మమ్మ అక్కడికి చేరుకొని చెప్పులు, కాళ్ల పట్టీలను గుర్తించి తమ కూతురేనని తెలిపింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఢి కొత్తపల్లి గ్రామానికి చెందిన గంగరాజు ఆలియాస్ గౌతం, లింగస్వాములను అనుమానస్పదంగా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎఎస్‌పి ఇస్మాయిల్, డిఎస్‌పి నాగేశ్వరరావు తెలిపారు.

కాంగ్రెస్ 70 సీట్లు గెలిచేది పగటి కలే

మూడున్నరేళ్లలో పాలమూరులో 6 లక్షల ఎకరాలకు నీరిచ్చాం : పెద్దమందడి బ్రాంచ్ కెనాల్ పనులను ప్రారంభించిన మంత్రి హరీష్‌రావు





మన తెలంగాణ/వనపర్తి ప్రతినిధి : పదేళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలమూర్ జిల్లాలోనికల్వకుర్తి, భీమా,నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పెండింగ్ ప్రాజెక్టులుగా ఉంచిన ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కిందని రాష్ట్రభారీ నీటిపారుదల శాఖా మంత్రి హరీశ్‌రావు అన్నారు.సోమవారం వనపర్తి జిల్లాలోని పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, స్థానిక ఎంఎల్‌ఎ చిన్నారెడ్డిలతో కలిసి మంత్రి హరీష్‌రావు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పెద్దమందడి మండలం వెల్టూర్‌లో రూ.3 కోట్లతో నిర్మించిన 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాంను ప్రారంభించారు. అనంతరం వనపర్తి పట్టణ శివారులో రూ. 6 కోట్లతో నిర్మించే నల్ల చెరువు మిని ట్యాంక్ బండ్ పనులను పరిశీలించారు. చిట్యాల దగ్గర రూ.6కోట్లతో నిర్మించిన 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల రెండు గోదాంలను ప్రారంభించారు. అనంతరం రూ.18.95 కోట్లతో చేపట్టే పెద్దమందడి , ఖిల్లాఘణపురం ,వనపర్తి, గోపాల్‌పేటమండలాల్లోని 21వేల ఎకరాలకు సాగునీరందించే పెద్దమందడి బ్రాంచ్ కెనాల్ పనులకు మంత్రి పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం పనులను ప్రారంభించారు. అనంతరం టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పామిరెడ్డి పల్లి దగ్గర ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 70 సీట్లు గెలిచి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని రైతుల సమస్యలను పరిష్కరిస్తామని పిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని ఇది కేవలం కాంగ్రెసోళ్ల పగటి కళ మాత్రమేనన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూర్ జిల్లాలో 50వేల ఎకరాలకు సాగునీరందిస్తే, మూడున్నరేళ్ల టిఆర్ఎస్ పాలనలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరందించిన ఘనత తమకే దక్కిందన్నారు.పాలమూర్ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు దేవర కద్ర,కొల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జీలు పవన్‌కుమార్ రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిలు కోర్టుల్లో కేసులు వేశారని కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. వనపర్తి నియోజక వర్గాన్ని లక్ష ఎకరాల మాగాణిగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పిచైర్మన్ భాస్కర్, ఎంఎల్‌సి కసిరెడ్డి నారాయణరెడ్డి, ఐడిసి చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల టిఆర్ఎస్ అధ్యక్షులు మేఘారెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికులకు 75శాతం ఫిట్‌మెంట్‌తో పే స్కేలు

▸▸ హనుమంతు ముదిరాజ్ డిమాండ్

మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్ : ఆర్‌టిసి కార్మికులకు 75 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పే స్కేలు అమలు చేయాలని, లేని పక్షంలో టిఎస్ ఆర్‌టిసి తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టిజెఎంయు) ఆధ్వర్యంలో బస్ భవన్‌ను ముట్టడిస్తామని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ హెచ్చరించారు. సోమవారం ఆజామాబాద్‌లోని హైదరాబాద్ రీజియన్‌కు చెందిన హైదరాబాద్ డిపో3 వద్ద జరిగిన మజ్దూర్ యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పే స్కేలు అమలు 2017 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాల్సి ఉండగా యాజమాన్యం జాప్యం చేస్తుందని ధ్వజమెత్తారు. దీని వల్ల కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పేస్కేలు అమలులో జాప్యంపై అధికార టిఎంయు సమ్మె నోటీసు ఇచ్చి యాజమాన్యంపై వత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. టిఎంయు యాజమాన్యంతో కుమ్మక్కై, పే స్కేలు అమలులో తీవ్ర జాప్యం చేస్తున్నారని విమర్శించారు. టిఎంయు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 22న బస్ భవన్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు సుధాకర్ తదితరులున్నారు.



హైదరాబాద్ డిపో–3 టిజెఎంయు నూతన కమిటీ నియామకం

తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ హైదరాబాద్ డిపో3 నూతన కమిటీని హనుమంతు ముదిరాజ్ ప్రకటించారు. ఛైర్మన్‌గా డిఆర్‌కె.రెడ్డి,అధ్యక్షుడిగా ఎండి గఫర్ అలీ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఆనంద్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, ఎండి జలాల్, డిప్యూటీ కార్యదర్శిగా కెఆర్‌బి.రెడ్డి, కార్యదర్శులుగా రాజయ్య, పరమేష్, సిబి.రెడ్డి, మాజిద్, ఆంజనేయులు, దర్పు, మధుసూదన్, శంకర్‌నాయక్, ఆనంద్‌లు నియమితులయ్యారు.

మే నాటికి యాదాద్రి ఆలయం పూర్తి

▸▸ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మన తెలంగాణ/యాదాద్రి : శ్రీలక్ష్మీ నరసింహస్వామి యాదాద్రి ఆలయ పునఃనిర్మాణం పనులను ఏప్రిల్, మే లోపు పూర్తి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి యాదాద్రి క్షేత్రాని సందర్శించి స్వామివారిని దర్శించుకొని ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయం పనులు ఎటువంటి ఆటంకం లేకుండ జరుగుతున్నాయని అనుకున్న సమయం కంటే కొద్ది ఆలస్యం జరిగిందని మంత్రి అన్నారు. టైంబాడ్ పెట్టుకొని మే లోపూ ఆలయం పనులు పూర్తి చేసుకొని ముఖ్యమంత్రి సూచనలతో మంచి రోజున ఆలయం ప్రారంభం చేసి భక్తులకు గర్భాలయ దర్శనాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఆలయ రాజగోపురాల నిర్మాణం కూడ వేగవంతంగా జరుగుతున్నాయని దక్షణ గోపురం నిర్మాణం వాస్తు పనులతో కొద్దిగా ఆలస్యం జరిగిందని, శివాలయం పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని, కొండపై పుష్కరిణి, ఇతర పనులకు టెండరు పూర్తి అయ్యాయన్నారు. ప్రతి నెల పనుల సమీక్ష పరిశీలన చేస్తానని మంత్రి తెలిపారు. ఆయన వెంట ప్రభుత్వ విఫ్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, వైటిడిఎ వైస్ చైర్మన్ కిషన్‌రావు, నిపుణులు, స్థాపతులు, ఆలయ ఇవో గీత ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రూ.100 కోట్లతో నల్లమల ఆలయాల అభివృద్ధి



మన తెలంగాణ /అచ్చంపేటటౌన్ : నల్లమలలోని శ్రీశైల క్షేత్ర సందర్శనంలో భాగంగా నాగర్‌కర్నూల్ , కర్నూల్ జిల్లాల్లో ఎంపి కవిత సోమవారం పర్యటించారు. జిల్లా సరిహద్దులో గల ఉప్పునుంత మండలంలోని డిండి కట్టమైసమ్మ, మన్ననూర్‌లోని శివాలయంలోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి మల్లెల తీర్థంలోని శివాలయానికి చేరుకుని అక్కడ అచ్చంపేట ఎంఎల్‌ఎ గువ్వలబాల్‌రాజు దంపతులు, ఎంపి కవిత దంపతులు స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగానే డిండి నుంచి టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు దాదాపు 100 బైక్‌లతో ర్యాలీగా చేరుకుని ఆమెకు ఘనస్వాగం పలికారు. తదుపరి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దైవక్షేత్రాలకు పేట్టింది పేరు తెలంగాణ అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సోమశిల, ఉమామహేశ్వరం, మల్లెల తీర్థానికి 100 కోట్లతో టూరిజం పనులు నిర్వహించడం జరిగిందని అన్నారు. అనంతరం శ్రీశైలం మల్లిఖార్జున స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తెలంగాణ జాగృతి, టిఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి స్వామి వారి హారతినిచ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్లిఖార్జునుడు, భ్రమరాంబిక అమ్మ వార్లకు ఈ సందర్భంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. వేదపండితులు ఆశేర్వచనాలు అందజేశారు. ఎంఎల్ గువ్వల బాల్‌రాజు, ఆయన సతీమణి అమల, నగరపంచాయతీ చైర్మన్ తులసీరాం, మార్కెట్ చైర్మన్ పోషం జయంతి, ఎంపిపి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.





మొండెంతో రమేష్ మృతదేహం, ఘటన స్థలంలో జాగిలాలతో పోలీసులు

నల్లగొండలో మరో దారుణ హత్య

▸▸ తల ఒక చోట..మొండెం మరోచోట

▸▸ భయాందోళనలో పట్టణ వాసులు

మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి: నల్లగొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యను మరువకముందే నల్లగొండ జిల్లా కేంద్రంలో మరోవ్యక్తి దారుణ హత్యతో పట్టణ ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. ఒక వ్యక్తిని హత్య చేసి తల ఒకచోట, మొండెం మరోచోటా పడేసి ఉండటంతో పట్టణంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డాగ్‌స్క్వాడ్‌తో నిందితులను గుర్తించేందుకు ప్రయత్నించగా నిందితుల్లో ఇద్దరు వ్యక్తులు పోలీసుల అదుపులో ఉండగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ మండల కేంద్రానికి చెందిన పాలకూరి రమేష్ అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా, కామెర్లకు మందులు ఇచ్చే వైద్యుడిగా జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తికి రమేష్ భార్యకు అక్రమ సంబంధం ఉండటంతో ఆరు నెలల క్రితం రమేష్‌కు, రామకృష్ణకు గొడవ జరుగడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి ఒకరినొకరు దూషించుకోకుండా ఒప్పందం కుదిరింది. తమకు అడ్డుగా ఉన్నాడనే ఆలోచనతో రామకృష్ణ రమేష్‌ను అడ్డు తొలగించుకోవాలని నల్లగొండకు చెందిన తన స్నేహితుడు సత్తార్‌కు విషయం చెప్పాడు. దాంతో సత్తార్ తన దగ్గరి బంధువైన మోసిన్ అనే వ్యక్తికి హత్య చేయాలని తెలపగా దాంతో రంగంలోకి దిగిన మోసిన్ కామెర్లకు మందు కావాలంటూ రమేష్‌కు ఫోన్ చేసి నల్లగొండకు ఈనెల 28న సాయంత్రం పిలిపించాడు. మిర్యాలగూడ రోడ్డులోని భారత్‌గ్యాస్ గోడౌన్ గ్యాస్ పరిసర ప్రాంతంలో రమేష్‌తో కొద్ది సేపు వారు మాట్లాడారు. అనంతరం అందరు కలిసి అక్కడ మద్యం సేవించినట్లు స్థానికులు తెలిపారు. అక్కడే రమేష్‌ను హత్య చేసి తలను, మొండెం భాగాలను వేరు చేసి మొండెంను అక్కడే పడేసి తలను బొట్టుగూడ దర్గ దిమ్మమీద పెట్టారు. ఈ హత్య కేసులో సత్తార్, మోసిన్‌లు పోలీసుల అదుపులో ఉండగా రామకృష్ణ, శివలు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటన స్థలానికి ఎస్పీ శ్రీనివాస్‌రావు, డిఎస్‌పి సుధాకర్‌లతో పాటు పోలీస్ సిబ్బంది చేరుకొని కేసును సమగ్ర దర్యాప్తు చేపడుతున్నారు. సంచలనాన్ని సృష్టించేందుకే తల భాగం, మొండెం భాగాలను వేర్వేరు చోట్ల హంతకులు పడేసినట్లు పోలీసులు తెలిపారు.

మోత్కుపల్లిపై చర్యలకు కేంద్ర కమిటీదే నిర్ణయం !

మన తెలంగాణ/హైదరాబాద్ : టిడిపి పొలిట్‌బ్యూరో మోత్కుపల్లి నర్సింహులు చేసిన వ్యాఖ్యలపై పార్టీ కేంద్ర కమిటీనే నిర్ణయం తీసుకోనుంది. ఎన్‌టిఆర్ భవన్‌లో సోమవారం ఎల్. రమణ అధ్యక్షతన టిడిపి నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పల్లెపల్లెకు టిడిపి, మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యాలపై మరోసారి చర్చించారు. కొంతమంది నేతలు మోత్కుపల్లి మాటలతో కార్యకర్తల మనోస్థైర్యం దెబ్బతిన్నదని, పార్టీపరంగా ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. సీనియర్ నాయకులు ఇ.పెద్దిరెడ్డి కలుగజేసుకుని మోత్కుపల్లి పొలిట్‌బ్యూరో సభ్యులు కాబట్టి ఏదైనా నిర్ణయం జరిగితే అది కేంద్రకమిటీ స్థాయిలోనే ఉంటుందని సర్దిచెప్పినట్లు తెలిసింది.రమణ మాట్లాడుతూ అక్రమకేసులపై త్వరలోనే కేంద్ర హోంమంత్రిని కలువనున్నట్లు తెలిపారు. సమవేశానికి నర్సింహులు హాజరుకాలేదు.

రూ. 300 కోట్లతో 37 భాషల్లో..!

ఇతిహాస కథలతో లెక్కలేనన్ని సినిమాలు వచ్చినా వాటిలో కర్ణుడి సినిమాలకు ఉండే ప్రత్యేకత వేరు. తెలుగులో నందమూరి తారకరామారావు నటించిన 'దాన వీర శూర కర్ణ' సినిమా గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇందులో మూడు పాత్రల్లో నటిస్తూ తనే దర్శకత్వం వహించిన ఎన్టీఆర్ ప్రతిభకు ప్రేక్షక లోకం పట్టం కట్టింది. కర్ణుడి పాత్రలో హీరోయిజం చూపించిన అరుదైన సినిమాగా దీన్ని చెప్పుకోవచ్చు. ఇప్పుడు కర్ణుడు ప్రధాన పాత్రలో ఓ భారీ చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 'మహావీర కర్ణ' అనే టైటిల్‌తో తెరకెక్కే ఈ చిత్రంలో కర్ణుడి పాత్రలో కోలీవుడ్ స్టార్ విక్రమ్ నటించనున్నాడు. 300 కోట్ల బడ్జెట్‌తో 37 భాషలలో ఈ సినిమా రూపొందనుంది. ఇందులో దుర్యోధనుడు, ధర్మరాజు, అర్జునుడు, భీముడు తదితర కీలక పాత్రల్లో స్టార్ హీరోలు నటిస్తారట. అయితే మలయాళంలో మోహన్‌లాల్ భీముడిగా వెయ్యి కోట్ల బడ్జెట్‌తో ప్రముఖ వ్యాపారవేత్త శెట్టి ఇంతకుముందే ఒక సినిమా ప్రకటించాడు కానీ అది ఇంతవరకు సెట్స్‌పైకి వెళ్లలేదు. కానీ 'మహావీర కర్ణ' చిత్రాన్ని దానికంటే ముందుగానే ప్రారంభిస్తామని అంటున్నాడు విక్రమ్. భారతదేశ సినీ చరిత్రలోనే ఈ చిత్రం ఓ దృశ్య కావ్యంగా నిలుస్తుందని ఆయన పేర్కొంటున్నాడు.





'గాయత్రి' ఆడియో వేడుకలో డా.మోహన్‌బాబు, టి.సుబ్బరామిరెడ్డి, మంచు విష్ణు, మదన్, అనసూయ తదితరులు

ప్రతి పాత్రలో మోహన్‌బాబు లీనమైపోతారు

డా.మోహన్‌బాబు నటిస్తూ అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్‌పై నిర్మిస్తున్న చిత్రం 'గాయత్రి'. మదన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. తమన్ సంగీతమందించిన ఈ సినిమా ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. డా.మోహన్ బాబు ఆడియో సీడీలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టి.సుబ్బరామి రెడ్డి మాట్లాడుతూ ''42 సంవత్సరాల నుండి మోహన్‌బాబు 560 సినిమాలకు పైగా నటించడం ఒక ఎత్తయితే... ఒక పాత్రకు మరో పాత్రకు సంబంధం లేకుండా నటించడం మరో ఎత్తు. ఆయన స్టైలే వేరు. విలన్ నుండి హీరోగా మారి ఎన్నో చిత్రాల్లో హీరోగా ప్రేక్షకులను అలరించిన ఏకైక నటుడు మోహన్‌బాబు మాత్రమే. తను నాకెంతో ఆత్మీయుడు. వైవిధ్యమైన నటన ఆయన సొంతం. ఏ పాత్ర చేసినా అందులో లీనమైపోవడం ఆయనకే చెల్లింది. గాయత్రి సినిమా ఖచ్చితంగా సూపర్‌హిట్ అవుతుంది. ఇందులో మోహన్‌బాబు, విష్ణు ఇద్దరూ పోటీపడి నటించారు''అని అన్నారు. డా.యం.మోహన్‌బాబు మాట్లాడుతూ ''నాకు తెలిసింది సినిమా ఒక్కటే. ఇంకేం తెలియదు. నటుడిగా పుట్టాను, నిర్మాతగా సినిమాలు చేశాను. ఇవి తప్ప మాకు వ్యాపకాలు లేవు. గాయత్రి సినిమాను కష్టపడి చేశాం. ఫలితం మాత్రం దేవుడి చేతిలోనే ఉంది. నిర్మాతగా 60కి పైగా సినిమాలు చేశాను. ఎన్నో విజయాలు వచ్చాయి... అలాగే అపజయాలు వచ్చాయి. జయం వచ్చినప్పుడు పొంగిపోలేదు. అపజయం వచ్చినప్పుడు కుంగిపోలేదు. నన్ను నటుడిగా పరిచయం చేసింది మా గురువు దాసరి నారాయణరావు. ఆయన నాకు ఎన్ని మంచి పాత్రలు ఇచ్చారో నాకు తెలుసు. ఆయన లేకపోవడం పెద్ద లోటు. ఆయన నేర్పించిన డైలాగ్స్‌తోనే ఈరోజు శభాష్ అని అనిపించుకుంటున్నాను. మహానటుడు ఎన్టీఆర్ తర్వాత డైలాగ్‌లు మోహన్‌బాబు బాగా చెప్పగలడని పేరొచ్చిందంటే ఆ క్రెడిట్ దాసరికే దక్కుతుంది. సెన్సార్ పూర్తిచేసి ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న విడుదల చేయాలని అనుకుంటున్నాము. మదన్ గొప్ప దర్శకుడు, మంచి రచయిత. ఈ సినిమాను అద్భుతంగా తీశాడు. హీరో నేనైతే నా యుక్త వయసు పాత్రను విష్ణుబాబును పోషించమని దర్శకుడు అన్నారు. విష్ణుకు జోడీగా శ్రియా చక్కగా నటించింది. విష్ణు, శ్రియా పోటీపడి నటించారు''అని తెలిపారు. మంచు విష్ణు మాట్లాడుతూ ''మదన్, డైమండ్ రత్నబాబు ఈ కథ చెప్పగానే నేను నటిస్తానని చెప్పాను. అలాగే తమన్ నాపై వచ్చే సాంగ్‌ను అద్భుతంగా చేశాడు. ప్రతి నటుడికి జీవితంలో ఒక టర్నింగ్ పాయింట్ ఉంటుంది. ఆ పాత్ర తనను మంచి నటుడు అని అయినా కానీ, వీడు నటనకు పనికిరాడు అని అయినా కానీ తేల్చేస్తుంది. అలాంటి పాత్ర ఇందులో చేశాను. ఇందులో నేను పాస్ అయితే నటుడిగా మంచి పేరు తెచ్చుకుంటాను. 'గాయత్రి' చాలా ఎమోషనల్ కథ. ఓ తండ్రికి, కూతురికి మధ్య జరిగే కథ ఇది. శ్రియా మంచి నటి. తను చేసిన పాత్రకు మరెవరూ న్యాయం చేయలేరనిపించింది. అనసూయ కూడా మంచి పాత్ర చేసింది. ఇక మా నాన్నగారి సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనను అసెంబ్లీ రౌడీ, అల్లుడుగారు చిత్రాల్లో ఎలా చూశానో అలాగే సర్వేష్ ఈ సినిమాలో చూపించాడు''అని పేర్కొన్నాడు. దర్శకుడు మదన్ మాట్లాడుతూ ''మోహన్‌బాబు అత్యంత అరుదైన వ్యక్తిత్వమున్న వ్యక్తి. ఆయనతో కలిసి పనిచేయడమంటే ప్రొఫెసర్‌తో విద్యార్థులు పనిచేసినట్లే. అలాంటి వ్యక్తి మళ్లీ పుట్టడు. ఆయన చూపించే ప్రేమ ముందు మనం కరిగిపోతాం. మనుషులను చదివినవాడు వేదాంతి అయినా, వ్యాపారి అయినా అవుతాడు లేదా మోహన్‌బాబులా మహా నటుడు అయినా అవుతాడు. ఇక విష్ణు తన పాత్రలో ఎంతో అద్భుతంగా నటించారు. తమన్ మంచి సంగీతాన్ని అందించారు'' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచు లక్ష్మి, డా.బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, బి.గోపాల్, కోట శ్రీనివాసరావు, అనసూయ పాల్గొన్నారు.

స్నేహం ఎక్కడ చెడుతుందోనని అనుకునేవాడిని

నాగశౌర్య కథానాయకుడిగా రష్మిక మండన్నా కథానాయికగా ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో వెంకీ కుడుముల దర్శకత్వంలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్న చిత్రం 'ఛలో'. ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ కుడుములతో ఇంటర్వ్యూ...



వెంకీ కుడుముల

తేజతో సినీ ప్రయాణం ప్రారంభం...

మా స్వస్థలం ఖమ్మం జిల్లా అశ్వారావుపేట. ఎంబిఎ చదివిన నేను సినిమాలపై ఆసక్తితో చిత్ర పరిశ్రమలోకి వచ్చాను. బలభద్ర పాత్రుని రమణి అనే రచయిత ద్వారా దర్శకుడు తేజతో పరిచయం జరిగింది. ముందుగా తేజ డైరెక్షన్ టీమ్‌లో సభ్యునిగా 'నీకు నాకు డాష్ డాష్' అనే సినిమాలో పనిచేశాను. అందులో చిన్న పాత్రలో కూడా నటించాను. నా సినీ ప్రయాణం అలా ప్రారంభమైంది. తర్వాత 'జాదూగాడు' సినిమా కోసం యోగితో కలిసి పనిచేశాను. అలాగే 'తుఫాన్' తెలుగు వర్షన్‌కు కూడా పనిచేశాను. తర్వాత త్రివిక్రమ్ వద్ద 'అ..ఆ' సినిమాకు పనిచేయడం జరిగింది.

ఫోన్ చేసి సినిమా చేద్దామన్నాడు...

'జాదూగాడు' సినిమాకు నేను అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నప్పటి నుండి నాగశౌర్యతో పరిచయం ఉంది. దర్శకుడిగా నా తొలి చిత్రాన్ని నాగశౌర్యతో చేయాలనుకున్నాను. అయితే తనతో సినిమా చేస్తానని చెబితే స్నేహం ఎక్కడ చెడుతుందోనని అనుకునేవాడిని. అలాంటి సమయంలో 'అ..ఆ' సినిమా పూర్తయిన తర్వాత ఓరోజు నాగశౌర్య ఫోన్ చేసి వెంకీ కథ తయారుచేసుకో... మనం కలిసి ఓ సినిమా చేద్దామని అన్నాడు. దీంతో నాకు చాలా ఆనందం కలిగింది.

ఫ్యామిలీ సబ్జెక్ట్‌తో...

నాగశౌర్యతో ముందుగా క్రైమ్ కామెడీ చేద్దామని అనుకున్నాను. అయితే అతను క్రైమ్ కామెడీ కాకుండా మంచి ఫ్యామిలీ సబ్జెక్ట్ చేద్దామని అనడంతో చాలా ఆలోచించాను. ఇప్పటివరకు శౌర్యను అందరూ లవర్‌బాయ్‌లా చూపించారు. అయితే ఫుల్ ఎనర్జిటిక్‌గా చూపిస్తే ఎలా ఉంటుందని ఆలోచించాను. చివరికి ఓ మంచి కథ రాసుకున్నాను.

జీవితాంతం రుణపడి ఉంటా...

ముందుగా ఈ సినిమా కథను వేరే నిర్మాతకు చెప్పాము. కథ బావుంది... లిమిటెడ్ బడ్జెట్‌లో చేద్దామని ఆ నిర్మాత అన్నారు. ఈ సంగతి తెలిసిన నాగశౌర్య తల్లిదండ్రులు మంచి కథ అంటున్నారు కదా... శౌర్య నమ్మిన కథతో తామే సినిమా నిర్మిస్తామని వారు ముందుకొచ్చారు. వాళ్లు ఎంతో స్వేచ్ఛనిచ్చి సినిమా అవుట్‌పుట్ బాగా రావడానికి సహకరించారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాను.

ఆవిధంగా హీరోయిన్‌ను తీసుకున్నాం...

నేను స్టోరీ డెవలప్‌మెంట్ కోసం చెన్నై వెళ్లాను. అక్కడ కన్నడ సినిమా 'కిరిక్ పార్టీ'ని చూశాను. సినిమా బావుంది... హీరోయిన్ రష్మిక మండన్నా చాలా బావుంది. ఈ సినిమాలో హీరోయిన్ చాలా బాగా నటించింది. చివరికి 'ఛలో'లో రష్మికను హీరోయిన్‌గా తీసుకున్నాము.

వారిద్దరు నాకు ఇన్‌స్పిరేషన్...

త్రివిక్రమ్‌తో 'అ..ఆ' సినిమా చేయడంతో ఆయనతో మంచి అనుబంధం ఏర్పడింది. నిజానికి ఆయనతో 'అజ్ఞాతవాసి' సినిమా కూడా చేద్దామని నిర్ణయించుకున్నాను. అయితే 'అ..ఆ' తర్వాత నువ్వు డైరెక్టర్ కావాలి... నా సహకారం నీకు ఎప్పుడూ ఉంటుంది అని త్రివిక్రమ్ అన్నారు. ఆయన అలా చెప్పిన కొన్ని రోజులకే నాకు డైరెక్టర్‌గా ఈ అవకాశం వచ్చింది. ఆయనకు ఈ సినిమా పాయింట్ చెప్పాను. విని చాలా బావుందని అన్నారు. ఇక నాకు త్రివిక్రమ్, పూరి జగన్నాథ్‌లు ఇన్‌స్పిరేషన్.

అదే నాకు బిగ్ కాంప్లిమెంట్



రాశీఖన్నా

రవితేజ, రాశీఖన్నా, సీరత్‌కపూర్‌లు హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్, వల్లభనేని సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. ఈ చిత్రం ద్వారా విక్రమ్ సిరికొండ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదలకానుంది. ఈ సందర్భంగా రాశీఖన్నా చెప్పిన సినిమా విశేషాలు...

మంచి కామెడీ సీన్స్...

సినిమాలో పుష్ప అనే క్యారెక్టర్‌లో నటించాను. సాధారణంగా హీరోయిన్లకు కామెడీ చేయడానికి స్కోప్ ఉండదు. కానీ ఈ సినిమాలో నాకు ఆ అవకాశం దొరికింది. రవితేజకు, నాకు మధ్య మంచి కామెడీ సీన్స్ ఉంటాయి. ఈ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయి.

మరో అవకాశం వచ్చినా చేస్తా...

రవితేజ చాలా ఎనర్జిటిక్‌గా ఉంటారు. సెట్స్‌లో ఎప్పుడూ సరదాగా నవ్వుతూ, నవ్విస్తూ ఉంటారు. ఆయనతో కలిసి పనిచేయడం ఎంతో బాగుంటుంది. రవితేజతో మరో సినిమా చేసే అవకాశం వచ్చినా చేసేస్తాను. ఇక సినిమా డబ్బింగ్ పూర్తికాగానే ఆయన నాకు ఫోన్ చేసి చాలా బాగా చేశావని అన్నారు. అదే నాకు బిగ్ కాంప్లిమెంట్.

మంచి ఫ్యామిలీ ఎమోషన్స్‌తో...

సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ కథే ఈ చిత్రం. ఇందులో మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి. అందరినీ ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది.

డబ్బింగ్ చెప్పాలని అనుకున్నా...

ఈమధ్య తెలుగు బాగా నేర్చుకోవడంతో ఈ సినిమాకు, తొలిప్రేమకు డబ్బింగ్ చెప్పాలని అనుకున్నాను. కానీ సమయం దొరకలేదు. డబ్బింగ్ చెప్పాలంటే ఎక్కువ సమయం పడుతుంది. అందుకే కుదరలేదు. అలాగే నేను చేస్తున్న సినిమాల కోసం బరువు కూడా తగ్గాను.

భిన్నమైన పాత్రలు చేస్తున్నా...

ఒకవైపు గ్లామర్ రోల్స్, ఇంకోవైపు నటనకు ఆస్కారమున్న రోల్స్ చేస్తున్నాను. ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు చేస్తే బోర్ కొడుతుంది. అందుకే భిన్నమైన పాత్రలు చేస్తున్నాను.

చాలా నేర్చుకుంటున్నాను...

ప్రస్తుతం సీనియర్ హీరోలు, యంగ్ హీరోలతో సినిమా చేస్తున్నాను. సీనియర్‌లతో కలిసి పనిచేసినప్పుడు వాళ్ల నుండి చాలా నేర్చుకుంటున్నాను. యంగ్ హీరోలతో నటించేటప్పుడు వాళ్లతో పాటే కొత్తవి నేర్చుకోవడానికి ప్రయత్నిస్తుంటాను.

మనుషులను చూసి భయపడే దెయ్యాలు



విజి చెర్రీష్, శ్రీకాంత్, శ్రీమిత్ర చౌదరి

శ్రీకాంత్, నజియా జంటగా నటిస్తున్న చిత్రం 'రా...రా'. విజి చెర్రీష్ పతాకంపై విజి చెర్రీష్ దర్శకత్వంలో ఎం.విజయ్ నిర్మిస్తున్న చిత్రమిది. శ్రీమిత్ర చౌదరి సమర్పిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 23న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ ''మొదటిసారి నేను చేస్తున్న హార్రర్ కామెడీ మూవీ ఇది. కథ నచ్చి ఈ సినిమా చేస్తున్నాను. చాలా రోజుల తర్వాత కామెడీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. ఈ సినిమాలో దెయ్యాలు మనుషులను చూసి భయపడటమనే పాయింట్ ఆసక్తికరంగా ఉంటుంది. పలువురు సీనియర్ నటీనటులు ఇందులో నటించారు. దర్శకుడు విజి చెర్రీష్ సినిమాను అద్భుతంగా తెరకెక్కిస్తున్నాడు. నిర్మాతలు ఏవిధంగానూ రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి ఫిబ్రవరి 23న ఈ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాము''అని అన్నారు. నిర్మాత ఎం.విజయ్ మాట్లాడుతూ ''ఈ చిత్రం ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించే హార్రర్ కామెడీ థ్రిల్లర్. పలువురు ప్రముఖ హాస్య నటులు ఇందులో నటిస్తున్నారు. వీరిలో కొంతమంది దెయ్యాలుగా, మరికొందరు మనుషులుగా నటిస్తున్నారు''అని తెలిపారు. చిత్ర సమర్పకులు శ్రీమిత్ర చౌదరి మాట్లాడుతూ ''పలు రకాల జోనర్‌లో ఇప్పటి వరకు శ్రీకాంత్ 120కి పైగా సినిమాల్లో నటించారు. కానీ ఆయన తొలిసారి చేస్తున్న హార్రర్ కామెడీ మూవీ మిది. ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను చిరంజీవి, టీజర్‌ను మోహన్‌లాల్ విడుదల చేయగా అద్భుతమైన స్పందన వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా సినిమా ఉంటుంది''అని పేర్కొన్నారు.

అందుకే కెరీర్ బాగుంది...

సీనియర్ నటుడు మోహన్‌బాబుతో కలిసి అందాల తార శ్రియా నటించిన చిత్రం 'గాయత్రి'. ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన శ్రియా హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె చెప్పిన విశేషాలు...



శ్రియా

☞ అమాయకురాలైన అమ్మాయిగా...

'గాయత్రి'లో నేను పల్లెటూరికి చెందిన అమాయకురాలైన అమ్మాయిగా కనిపిస్తాను. నిజాయితీగా ఉండే అమ్మాయిగా నటించాను. ఈ పాత్ర నా కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుంది.

☞ అందుకే ఒప్పుకున్నా...

దర్శకుడు మదన్ చెప్పిన కథ నాకు చాలా బాగా నచ్చింది. నా పాత్ర కూడా సహజంగా, అందంగా ఉంటుంది. అందుకే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నాను.

☞ ఎక్కడా ఇబ్బంది పడలేదు...

దర్శకుడు మదన్ చాలా కూల్‌గా ఉంటారు. ఆయనతో కలిసి పనిచేసినప్పుడు ఎప్పుడూ ఇబ్బందిపడలేదు. ఆయనతో వర్క్ చేయడం చాలా బాగుంది.

☞ పూర్తిగా ఎంజాయ్ చేశా...

సినిమా షూటింగ్‌ను పూర్తిగా ఎంజాయ్ చేశాను. నా మీద ఒక అందమైన పాట కూడా ఉంది. ముఖ్యంగా నా కాస్ట్యూమ్ డిజైనర్ రూపొందించిన డ్రెస్సులు చాలా బాగా నచ్చాయి.

☞ అందుకే కెరీర్ బాగుంది...

నేను చేసిన సినిమాల దర్శకులు, రచయితలు మంచి కథలు, పాత్రలు రాశారు కాబట్టి నా కెరీర్ చాలా బాగుంది. అలాగే నేను ఎంపికచేసుకున్న సినిమాలు నాకు బాగా కలిసి వచ్చాయి. అంతేకాకుండా నేను చాలా లక్కీ కూడా.

☞ తదుపరి చిత్రాలు...

ప్రస్తుతం తెలుగులో 'వీర భోగ వసంతరాయలు' సినిమా చేస్తున్నాను. తమిళంలో కార్తీక్ నరేన్‌తో 'నరససూరన్'లో నటిస్తున్నాను. ఆతర్వాత శాతకర్ణి సినిమా కెమెరామెన్ నిర్మాతగా మారి చేస్తున్న సినిమాలో కూడా నటించబోతున్నాను. ఆ చిత్రాన్ని ఒక లేడీ డైరెక్టర్ తెరకెక్కించనున్నారు.

ట్రయాంగిల్ లవ్ స్టోరి

మహేశ్వర క్రియేషన్స్ పతాకంపై నందు, నోయల్, పునర్నవి హీరోహీరోయిన్లుగా కోటి వద్దినేని దర్శకత్వంలో మాలతి వద్దినేని నిర్మిస్తున్న చిత్రం 'ఎందుకో ఏమో'. స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్ చేతుల మీదుగా ఈ చిత్రం టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా వి.వి.వినాయక్ మాట్లాడుతూ ''సినిమా టైటిల్‌లాగే టీజర్ కూడా చాలా ట్రెండీగా, ఆసక్తికరంగా ఉంది. ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్న కోటికి మంచి పేరు, నిర్మాతలకు లాభాలు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను''అని అన్నారు. దర్శకుడు కోటి వద్దినేని మాట్లాడుతూ ''ఇదొక ట్రయాంగిల్ లవ్ స్టోరి. మా నిర్మాత పూర్తి స్వేచ్ఛనివ్వడంతో అనుకున్నట్టుగా సినిమా తీయగలిగాం. ప్రస్తుతం సినిమా సెన్సార్ పనులు జరుగుతున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలో ఆడియో విడుదల చేసి... అదే నెలలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. నిర్మాత మాలతి వద్దినేని మాట్లాడుతూ ''దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో సినిమాను ఏ విషయంలోనూ రాజీపడకుండా నిర్మించాం. మంచి లవ్ స్టోరీతో పాటు కమర్షియల్ హంగులు కూడా ఈ సినిమాలో ఉన్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే సినిమా ఇదవుతుంది''అని తెలిపా రు. పోసాని, సూర్య, సుడిగాలి సుధీర్, నవీన్, రాకెట్ రాఘవ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్, కెమెరా: జి.యస్.రాజ్, ఎడిటింగ్: మధు, ఆర్ట్: వర్మ, ఫైట్స్: డ్రాగన్ ప్ర కాష్.



'ఎందుకో ఏమో' టీజర్‌ను విడుదల చేస్తున్న వి.వి.వినాయక్. చిత్రంలో కోటి వద్దినేని, మాలతి వద్దినేని.

నా ప్రేమ ఎక్కడ?



మనోజ్‌నందం సౌందర్య

మనోజ్‌నందం, సౌందర్య జంటగా నటించిన చిత్రం 'ఎక్కడ నా ప్రేమ'. గాయత్రి సినీ క్రియేషన్స్ సమర్పణలో నంది క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఎస్.రామకృష్ణ, వడ్డే గోపాల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎండి హుస్సేన్ దర్శకుడు. ఘన్‌శ్యామ్ సంగీతాన్ని అందించిన ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో జరిగింది. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు ఎస్.రామకృష్ణ, వడ్డే గోపాల్ మాట్లాడుతూ ''ప్రేమే జీవితంగా బతికే యువతీ యువకులు... పిల్లల బాగు కోసం తపించే తల్లిదండ్రుల ఆరాటాలు ఈ కథలో ప్రధాన అంశాలుగా ఉంటాయి. కుటుంబ సభ్యులను వదిలి వెళ్లిన ఓ అమ్మాయిని కాపాడేందుకు ఓ యువకుడు చేసిన ప్రయత్నమే ఈ చిత్రం. ఈ క్రమంలో వాళ్లకు ఎదురయ్యే సంఘటనలు ఆసక్తికరంగా ఉంటాయి. మంచి ప్రేమ కథతో ఈ సినిమా సాగుతుంది. ప్రేమికుల్లోని ఆకర్షణ, మనస్పర్థలను దర్శకుడు వినోదాత్మకంగా తెరకెక్కించారు. సెన్సార్ పూర్తిచేసుకున్న చిత్రానికి క్లీన్ 'యు' సర్టిఫికెట్ వచ్చింది. ఫిబ్రవరి 22న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం''అని అన్నారు. ఎల్.బి.శ్రీరాం, గీతాసింగ్, జయలలిత, జబర్దస్త్ రాఘవ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మోహన్‌చంద్, ఎడిటర్: నందమూరి హరి.



కార్పొరేట్ పన్నులో కోత ఉంటుంది : నిపుణుల అంచనా

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో కార్పొరేట్ పన్నులో కోత ఉంటుందని 50 శాతం మంది వృత్తి నిపుణులు సర్వేలో తెలిపారు. గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ 2018లో కార్పొరేట్ పన్ను 500 బేసిస్ పాయింట్లు తగ్గింపు ఉంటుందని, దీంతో ఈ టాక్స్ 25 శాతానికి దిగివస్తుందని వారు అంచనా వేస్తున్నారు. డెలాయిట్ నిర్వహించిన సర్వే ప్రకారం, అన్ని రంగాలకు చెందిన 120 మంది వృత్తి నిపుణుల్లో సగం మంది పన్ను సంస్కరణలు ఉంటాయని తెలిపారు. ప్రత్యేకించి పన్ను వ్యాజ్యం ప్రభుత్వానికి ఎంతో కీలకమైందని అన్నారు. దీని తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలో సంస్కరణలను వారు ఆశిస్తున్నారు. సర్వేలో పాల్గొన్న 50 శాతం వృత్తి నిపుణులు.. కార్పొరేట్ పన్ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గుతుందని ఆశిస్తున్నారని సర్వే వెల్లడించింది. నల్లధనాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపడుతుందని, పన్ను రేటు తగ్గింపునకు ఇది సరైన సమయం అని సర్వేలో నిపుణులు తెలిపారు. వ్యక్తిగత పన్నుల్లో తగ్గింపుతో దేశీయ డిమాండ్ పెరుగుతుందని.. పొదుపు, పెట్టుబడులు పెరుగుతాయని కూడా సర్వే చెప్పింది.

3 రెట్లు పెరిగిన హెచ్‌డిఎఫ్‌సి లాభం



న్యూఢిల్లీ: డిసెంబర్ ముగింపు నాటి మూడో త్రైమాసిక(అక్టోబర్‌-డిసెంబర్) ఫలితాల్లో గృహ, తనఖా రుణాలిచ్చే దిగ్గజ కంపెనీ హెచ్‌డిఎఫ్‌సి నికర లాభం మూడు రెట్లు పెరిగింది. గతేడాదిలో నికర లాభం రూ. 1,701 కోట్లతో పోలిస్తే ఈసారి రూ. 5,670 కోట్లకు పెరిగింది. రూ. 4,900 కోట్ల వరకూ నికరలాభం ఉండవచ్చని పలు సంస్థలు అంచనా వేశాయి. అయితే హెచ్‌డిఎఫ్‌సి ఈ అంచనాల్ని అధిగమించింది. హెచ్‌డిఎఫ్‌సి స్టాండర్డ్ లైఫ్‌లో వాటా విక్రయించడం ద్వారా సమకూరిన మొత్తం కారణంగా ఈ స్థాయిలో నికరలాభం పెంపు సాధ్యపడిందని సంస్థ వెల్లడించింది. కంపెనీ నికర వడ్డీ ఆదాయం రూ. 2,800 కోట్ల నుంచి రూ. 3,100 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ. 8,133 కోట్ల నుంచి రూ. 8,667 కోట్లకు చేరింది. స్థూల ఎన్‌పిఎలు 1.15 శాతం వద్ద స్థిరంగా వున్నాయి. ఈ నేపథ్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో షేరు విలువ 3.31 శాతం లాభపడి రూ. 1,971కు చేరింది.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	36283.25	232.81	0.65%
నిఫ్టీ	11130.40	60.75	0.55%



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28950	30962.57	0.92%
ముంబై	29850	31925.13	0.33%
ఢిల్లీ	29600	31657.75	0%
కోల్‌కతా	99999.99	99999.99	231.46%
కేరళ	28150	30106.95	0%
బెంగళూరు	28650	30641.71	0%
హైదరాబాద్	28980	30994.65	0.99%
గల్ఫ్	1431.02	1530.50	0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42200.00	42000.00	0.48
ముంబై	42200.00	42000.00	0.48
ఢిల్లీ	42200.00	42000.00	0.48
కోల్‌కతా	42200.00	42000.00	0.48
హైదరాబాద్	42200.00	42000.00	0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	370	విశాఖపట్నం	402
వరంగల్	382	చిత్తూరు	383
విజయవాడ	380	చెన్నై	390
గోదావరి	380	బెంగళూరు	380


పరోక్ష పన్ను చెల్లింపుదారుల సంఖ్య 50% పెరిగింది..

- **వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు 18 లక్షల మంది నమోదు**
- **ఎగుమతులు వృద్ధి రేటు 12.1 శాతం: ఆర్థిక సర్వే అంచనా**



న్యూఢిల్లీ: జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) వంటి సంస్కరణలు వృద్ధి రేటును పెంచనున్నాయని ఆర్థిక సర్వే-2018 పేర్కొంది. జిఎస్‌టి అమలు తర్వాత పరోక్ష పన్ను చెల్లింపుదారుల సంఖ్య 50 శాతం పెరిగింది. 2016 నవంబర్ నుంచి వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు 18 లక్షల మంది నమోదయ్యారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2019లో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి రేటు 7 శాతం నుంచి 7.5 శాతం వరకు పెరుగుతుందని సర్వే అంచనా వేసింది. మార్చితో ముగిసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017-18)లో జిడిపి వృద్ధి రేటు 6.75 శాతంగా ఉండనుందని సర్వే పేర్కొంది. సోమవారం నుంచి ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఈ ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. ఆర్థిక వృద్ధి రేటు పెరగడానికి ప్రధాన కారణంగా జిఎస్‌టి, బ్యాంక్‌లకు మూలధనం, సులభతర వ్యాపారం, విదేశీ పెట్టుబడులు, ఎగుమతులు పెరగడమని వెల్లడించింది. వ్యవసాయం, విద్య, ఉపాధిలపై ఎక్కువగా దృష్టిసారించాల్సి ఉందని ఆర్థిక సర్వే వెల్లడించింది. కొన్నేళ్లుగా ప్రతికూలంగా ఉంటూ వస్తున్న ఎగుమతులు 2016-17లో సానుకూలంగా మారాయని, 2017-18లో మరింత పెరుగునున్నాయని సర్వే పేర్కొంది. మొత్తంగా 2017-18లో ఎగుమతులు వృద్ధి రేటు 12.1 శాతంగా ఉండనున్నట్టు తెలిపింది. విదేశీ మారక నిల్వలు వార్షిక ప్రాతిపదికన 14.1 శాతం పెరిగి, 409.4 బిలియన్ డాలర్లుగా నమోదైనట్టు ఆర్థిక సర్వే తెలిపింది. తొలిసారి భారతీయ చరిత్రలో మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు దేశీయ ఎగుమతుల్లో 70 శాతాన్ని నమోదుచేసినట్టు పేర్కొంది. 2018 ఆర్థిక సంవత్సరంలో సేవల వృద్ధి 8.3 శాతం, పరిశ్రమల వృద్ధి 4.4 శాతం, వ్యవసాయ వృద్ధి 2.1 శాతంగా ఉన్నట్టు సర్వే అంచనా వేసింది. వచ్చే ఏడాది ఆర్థిక నిర్వహణ సవాల్‌గా మారనుందని, గత ఆరేళ్లలో 2017-18 మధ్యకాలంలోనే ద్రవ్యోల్బణం కనిష్ఠంగా ఉన్నట్టు ఈ సర్వే పేర్కొంది. అయితే ప్రస్తుతం పెరుగుతున్న ఆయిల్ ధరలపై ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తంచేసింది. 2019 ఆర్థిక సంవత్సరంలో సగటున ముడి చమురు ధరలు 12 శాతం పెరిగే అవకాశముందని పేర్కొంది. ఒకవేళ అంతర్జాతీయంగా చమురు ధరలు ఇలానే పెరిగితే విధానపరమైన నిఘా చేపట్టాల్సి ఉంటుందని సర్వే తెలిపింది. భారత ఆర్థిక వ్యవస్థను విశ్లేషిస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కొన్ని రోజుల ముందు ఆర్థిక సర్వేను పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. గత 12 ఏళ్ల నుంచి పార్లమెంట్‌లో ఇరుసభల్లో ఈ సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది.


ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఆధ్వర్యంలోని బృందం దీన్ని రూపొందించింది. ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టిన అనంతరం లోక్‌సభ ఫిబ్రవరి 1కి వాయిదా పడింది.




బడ్జెట్ సర్వే ముఖ్యాంశాలు..

లోక్‌సభలో ఆర్థిక సర్వే 2018ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ

- 2018-19 ఆర్థిక సంవత్సరానికి జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి రేటు 7 నుంచి 7.5 శాతానికి పెరగనుందని అంచనా, ఇప్పటికీ భారత్ ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ముందుంది.
- 2017-18 ఆర్థిక సంవత్సరంలో జిడిపి 6.75 శాతంగా ఉంటుందని అంచనా
- చమురు ధరలు పెరిగినా, స్టాక్ ధరల్లో దిద్దుబాటు కొనసాగితే వచ్చే ఆర్థిక సంవత్సరంలో విధానపరంగా నిఘా అవసరం
- వ్యవసాయానికి సహకారం, ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ, బ్యాంకులకు రీక్యాపిటలైజేషన్ కోసం వచ్చే సంవత్సరం పాలసీ ఎజెండా
- పరోక్ష పన్ను చెల్లింపుదారుల సంఖ్య 50 శాతం పెరిగిందని జిఎస్‌టి గణాంకాలు చెబుతున్నాయి.
- పన్ను వసూళ్లు ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి.
- ఆర్థికంగా పొదుపును ప్రోత్సహించడంలో డీమానిటైజేషన్(నోట్ల రద్దు) దోహదం చేసింది.
- ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) సమస్యలను పరిష్కరించంలో దివాలా చట్టం చురుగ్గా ఉపయోగపడుతోంది.
- 2017-18లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.3 శాతం.. ఇది గత ఆర్థిక సంవత్సరాల కంటే తక్కువ



- పునర్విచారణ, న్యాయ వేదికల్లో పెండింగ్, ఆలస్యాల సమస్యను పరిష్కరించాలి
- పురుషులు పట్టణాలకు వలస వెళుతున్న కారణంగా వ్యవసాయ రంగంలో మహిళ ప్రాధాన్యత పెరిగింది
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రైతులకు రూ.20,339 కోట్ల వడ్డీ మాఫీకి ఆమోదం లభించింది
- 2017-18 ఆర్థిక సంవత్సరంలో సేవా రంగంలో ఎఫ్‌డిఐ 15 శాతం పెరిగింది
- అంతర్జాతీయ వాణిజ్యంలో మెరుగుదల వంటి అంశాల్లో భారత్ బాహ్య రంగం ఇప్పటికీ పటిష్ఠంగా ఉంది.
- కార్మిక చట్టాలను మెరుగ్గా అమలు చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి
- స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు చేపట్టడంతో గ్రామాల్లో పారిశుధ్యం 2014లో 39 శాతం ఉండగా, 2019 జనవరిలో 76 శాతానికి మెరుగైంది.
- వృద్ధితో పాటు విద్య, ఆరోగ్యం వంటి సామాజిక మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనివ్వాలి.
- వాయు కాలుష్యం సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలి.
- ఆర్థిక సర్వే 2017-18లో లింగ పరమైన అంశాలపై గులాబీ రంగు
- దేశంలో తల్లిదండ్రులు మగపిల్లలు కావాలని కోరుకుంటున్నారు. కొడుకు పుట్టేంతవరకూ సంతానాన్ని కొనసాగిస్తున్నారు.



ఆర్థిక సర్వేలో 10 కొత్త అంశాలు



- ప్రత్యక్ష, పరోక్ష చెల్లింపుదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత 50 శాతం పరోక్ష పన్ను చెల్లింపుదారులు పెరిగారు. 2016 నవంబర్ నుంచి వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు 18 లక్షల మంది నమోదయ్యారు.
- సామాజిక భద్రతకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. ముఖ్యంగా ఇపిఎఫ్‌ఒ, ఇఎస్‌ఐసిల చెల్లింపులు కేవలం 30 శాతం మాత్రమే ఉండేవి. జిఎస్‌టి నెట్ అమల్లోకి వచ్చాక వీటి చెల్లింపుల వాటా 50 శాతానికి పైగా పెరిగింది.
- రాష్ట్రాలు అంతర్జాతీ ఎగుమతులను పెంచాయి, ఇతర రాష్ట్రాలతో వాణిజ్యం చేస్తున్నాయి. దీంతో రాష్ట్రాలు ఆర్థికంగా మెరుగవుతున్నాయి. రాష్ట్రాల నుంచి జరిగే విదేశీ ఎగుమతులను తొలిసారి ఆర్థిక సర్వేలో ప్రస్తావించారు. రాష్ట్రాల జీవన ప్రమాణాలకు, ఎగుమతులకు మధ్య బలమైన సంబంధాన్ని ఇది తెలిపింది.
- భారత్ ఎగుమతుల్లో దిగ్గజ కంపెనీలదే కీలకపాత్ర.. ఈ కంపెనీలు 38 శాతం ఎగుమతులు చేస్తున్నాయి. అయితే ఇతర దేశాల ఎగుమతులతో పోలిస్తే మాత్రం ఇది చాలా తక్కువగా ఉంది. భారత్‌తో పోలిస్తే బ్రెజిల్ 72 శాతం, జర్మనీ 68 శాతం, మెక్సికో 67 శాతం, అమెరికా 55 శాతం మేరకు ఎక్కువగా ఎగుమతులు చేస్తున్నాయి.
- రెడీమేడ్ దుస్తులపై రాష్ట్ర పన్నులు తగ్గడంతో ఎగుమతులు పెరిగాయి. ఈ పెరుగుదల దాదాపు 16శాతం వరకు ఉంది.
- భారత్‌లో తల్లదండ్రులు ఎక్కువగా మగపిల్లలను సంతానంగా కోరుకుంటున్నారు. మగపిల్లల్ని కనే వరకూ సంతానోత్పత్తిని కొనసాగిస్తున్నారు.
- పన్ను వసూళ్ల వివాదాల కేసుల్లో ప్రభుత్వం విజయం సాధిస్తున్న శాతం తక్కువగా ఉంది. 30 శాతం కంటే తక్కువ కేసుల్లో విజయం సాధిస్తోంది. కేసుల మొత్తం విలువలో 1.8 శాతం విలు వ 66 శాతం కేసులు నడుస్తున్నాయి.
- పొదుపు పెరగడం కంటే అత్యంతగా పెట్టుబడులు పెరిగేందుకు ప్రాధాన్యతనివ్వాలి. పొదుపు పెరిగినంత మాత్రాన ఆర్థిక వ్యవస్థలో వృద్ధి నమోదు కావడంలేదు. పెట్టుబడులు పెరిగితేనే వృద్ధి నమోదవుతోంది.
- భారత్‌లో రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలు వసూలు చేస్తున్న పన్నులు ఇతర ప్రజాస్వామ్య దేశాలతో పోల్చితే చాలా తక్కువగా ఉన్నాయి.
- వాతావరణ మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపాయి. భారీగా ఉష్ణోగ్రతలు, కరవు నెలకొన్నాయి. నీటి పారుదల వసతులతో సంబంధం లేకుండా ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి.

36,283 పాయింట్లకు సెన్సెక్స్



న్యూఢిల్లీ: బడ్జెట్ సర్వే రోజు దేశీయ స్టాక్ మార్కెట్లు సరికొత్త రికార్డుల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్ల సంకేతాలు, బడ్జెట్‌పై సానుకూల అంచనాల మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయి. ఫిబ్రవరి డెరివేటివ్ సీజన్‌ను ఉత్సాహంగా ప్రారంభించిన సూచీలు జోష్‌తో ముందుకు సాగాయి. ఒక దశలో సెన్సెక్స్ 350 పాయింట్లకు పైగా లాభపడింది. ఆఖరి సమయంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో లాభాలు కొద్దిగా తగ్గాయి. మొత్తానికి సూచీలు కొత్త రికార్డుల్లో స్థిరపడ్డాయి. సోమవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 233 పాయింట్లు లాభపడి 36,283 వద్ద ముగిసింది. నిఫ్టీ 61 పాయింట్ల లాభంతో 11,130 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఇలో ఐషర్ మోటార్స్, మారుతి సుజుకీ, హెచ్‌డిఎఫ్‌సి, భారతీ ఇన్‌ఫ్రాటెల్, యుపిఎల్ షేర్లు లాభపడగా, ఫార్మా కంపెనీల షేర్లు మాత్రం కుదేలయ్యాయి. డాక్టర్ రెడ్డీస్ షేరు విలువ 6 శాతం వరకు పతనమైంది. లుపిన్, గెయిల్, భారతీ ఎయిర్‌టెల్, హిందుస్థాన్ పెట్రోలియం షేర్లు నష్టపోయాయి.

బడ్జెట్‌పై ఎన్నో అంచనాలు

బడ్జెట్ ముందు స్టాక్‌మార్కెట్‌లో తీవ్ర ఒడిదుడుకులు ఉంటాయి. ప్రస్తుత అలాంటి పరిస్థితులేమీ కనిపించడం లేదు. గత వారం మార్కెట్ రాకెట్‌లా దూసుకెళ్లి రికార్డులను సృష్టించింది. ఈవారం కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ 2018.. ఈ నేపథ్యంలో ముందస్తు బడ్జెట్ అంచనాలు అనేకం వినిపిస్తున్నాయి. మార్కెట్లలో ముందస్తు బడ్జెట్ ర్యాలీ కొనసాగుతోంది. బెంచ్‌మార్క్ సూచీలు రోజుకో రికార్డు అన్న రీతిగా పరుగులు తీస్తున్నాయి. బిజెపి ప్రభుత్వం అందించే చివరి పూర్తి స్థాయి బడ్జెట్ కావడంతో అంచనాలు ఎక్కువగానే ఉన్నాయి. ప్రజాకర్షక బడ్జెట్ అందించే అవకాశాలు ఉన్నా, అదే సమయంలో అభివృద్ధి కోసం బాటలు కూడా వేయవచ్చని అంచనా వేస్తున్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు 3.5 శాతంగా నమోదు కావచ్చని అంచనా.. ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటును 3.3-3.4 శాతానికి పరిమితం చేయాలని కేంద్రం భావిస్తోంది. ప్రభుత్వం కొత్త ఖర్చులు పెట్టే అవకాశాలు తక్కువగానే ఉన్నా, రోడ్లు, మెట్రోలు, హౌసింగ్, ఇరిగేషన్, డిఫెన్స్ వంటి అభివృద్ధికి దోహ దం చేసే రంగాలపై ప్రాధాన్యత ఇవ్వవచ్చని చెబుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌పై ఉన్న అంచనాల ప్రకారం నాలుగు రంగాలకు చెందిన పలు స్టాక్స్‌పై దృష్టి నిలపవచ్చని పలు సంస్థలు సూచిస్తున్నాయి. స్వల్పకాల వ్యవధి గల వ్యవసాయ రుణాల పరిమితిని రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల పెంచవచ్చని బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

మారుతి సుజుకీ 4 శాతం జంప్



న్యూఢిల్లీ: కొత్త మోడల్స్‌కు రాయల్టీ రేట్లను తగ్గించేందుకు బోర్డు అనుమతించిందని మారుతీ సుజుకీ ప్రకటించింది. ఈ వార్తతో సోమవారం మార్కెట్‌లో కంపెనీ షేరు ఒక్కసారి దూసుకెళ్లింది. కంపెనీ షేరు విలువ 3.80 శాతం ఎగసి రూ.9,630కు చేరాయి. బిఎస్‌ఈలో 3.9 శాతం పెరిగి రూ.9,638 వద్ద ట్రేడయ్యాయి. ఈ నిర్ణయం మారుతీ షేర్లపై దీర్ఘకాలం సానుకూల ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. 2019 ఆర్థిక సంవత్సరంలో 25 శాతం అమ్మకాలపై తక్కువ రాయల్టీ వర్తించవచ్చని భావిస్తున్నారు. కొత్త నిర్ణయ ప్రభావం 2017 జనవరి తర్వాత విడుదల చేసిన అన్ని కొత్త మోడళ్లకు వర్తిస్తుంది. ప్రస్తుతం కంపెనీ 5 శాతం రాయల్టీని సుజుకీకి చెల్లిస్తోంది. తాజా నిర్ణయం కారణంగా ఇక 3 శాతం మాత్రమే చెల్లిస్తుంది.

అంచనాలను మించిన టెక్ మహీంద్రా



న్యూఢిల్లీ: క్యూ3(అక్టోబర్-డిసెంబర్) ఫలితాల్లో టెక్ దిగ్గజం టెక్ మహీంద్రా అద్భుతంగా రాణించింది. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో కంపెనీ విశ్లేషకుల అంచనాలను అధిగమించింది. మూడో త్రైమాసికంలో నికర లాభం 12.8 శాతం పెరిగి రూ .943 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 2.2 శాతం పెరిగి రూ. 7776 కోట్లకు చేరింది. నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 1256 కోట్లను చేరింది. ఇబిటా మార్జిన్లు 16.3 శాతంగా నమోదవగా, డాలర్ పరంగా రెవెన్యూ 2.5 శాతం పెరిగి 1,209 మిలియన్ డాలర్లకు చేరుకుందని మార్కెట్ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. వడ్డీకి ముందు ఆదాయం 17.9 శాతం పెరిగి 990 కోట్ల రూపాయలకు చేరుకుంది. ఆపరేటింగ్ మార్జిన్ 12.7 శాతం పెరిగింది.

బీహార్‌లో జమిలి ఎన్నికలు సాధ్యం కాదు

న్యూఢిల్లీ : బీహార్‌లో ఎన్నికలు షెడ్యూల్ కంటే ముందుగా జరగబోవని, ప్రధాని నరేంద్ర మోడీ అనుకుంటున్నట్టుగా రాష్ట్రంలో ఒకే సమయంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తెలిపారు. బీహార్‌లో ముందస్తుగా ఎన్నికల జరుగుతాయని ఊహాగానాలు వినవస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పాట్నాలో జరిగిన పార్టీ అంతర్గత సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు షెడ్యూల్ మేరకు అక్టోబరు–నవంబరు 2020లోనే జరుగుతాయని చెప్పారు. రెండు ఎన్నికలను ఒకేసారి నిర్వహించడానికి తాను వ్యతిరేకం కాదని, అయితే రాష్ట్రంలో అలాంటి పరిస్థితి సాధ్యం కాదని అన్నారు. ఇటీవలే ఎన్నికల జరిగిన గుజరాత్‌లోను మళ్లీ ఎన్నికలు నిర్వహించడం సాధ్యమా? కేవలం కొద్ది మాసాల్లోనే ఎన్నికలు జరుగాల్సిన కర్ణాటకలో గురించి ఆలోచించండి అని ఆయన అన్నారు. తమ పార్టీ జనతా దళ్ (ఐక్య) ప్రధాని నరేంద్రమోడీ ఆలోచనలకు మద్దతు పలుకుతుందని, అయితే బీహార్ ప్రజలు ఐదేళ్ల వరకు తమ తీర్పును ఇచ్చేశారని, ఇప్పుడు ఇందులో జోక్యం చేసుకోరాదని ఆయన అన్నారు.





విదేశాంగ శాఖ కార్యదర్శిగా గోఖలే

న్యూఢిల్లీ : భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా విజయ్ కేశవ్ గోఖలే సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న జైశంకర్ పదవీ విరమణ చేశారు. ఈ క్రమంలో గోఖలే సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విదేశాంగ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన గోఖలేకు విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ శుభాకాంక్షలు తెలిపారు. చైనా, భారత్‌ల మధ్య ఏర్పడిన డోక్లాం ప్రతిష్టంభనను పరిష్కరించడంలో గోఖలే కీలక పాత్ర పోషించారు. ప్రపంచ దేశాలతో భారత్‌కు సత్సంబంధాలు ఏర్పడేందుకు తన వంతు కృషి చేస్తానని గోఖలే తెలిపారు.

రాజ్యసభలో నలుగురు కొత్త సభ్యులు

న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజున నలుగురు కొత్త సభ్యులు రాజ్యసభలో ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం సభ ప్రారంభం కాగానే ఆమ్ అద్మీ పార్టీకి చెందిన ముగ్గురు ముగ్గురు, బిజెపి నుంచి కేంద్రమంత్రి హర్దీప్ పూరి సభ్యులుగా ప్రమాణం చేశారు. అనంతరం మాజీ సభ్యులు మహిందర్ సింగ్ కల్యాణ్, ఖగెన్ దాస్ మృతి పట్ల రాజ్యసభ సంతాపం తెలిపింది. కల్యాణ్ గత ఏడాది నవంబర్‌లో మృతి చెందారు. ఆయన జులై 1992 నుంచి జులై 1998 వరకు పంజాబ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. అదే విధంగా దాస్ ఈనెల ఆరంభంలో కన్నుమూశారు. ఆయన ఏప్రిల్ 1998 నుంచి ఫిబ్రవరి 2002 వరకు త్రిపుర నుంచి ఎగువ సభకు ప్రాతినిధ్యం వహించారు. తరువాత సభను ఫిబ్రవరి 1వ తేదీకి రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు వాయిదా వేశారు.

సర్వీస్ రివాల్వర్ పేలి డిఎస్‌పి మృతి



ఫరీద్‌కోట్ : సర్వీస్ రివాల్వర్ నుంచి దూసుకొచ్చిన బుల్లెట్ పంజాబ్‌లో ఓ డిఎస్‌పి ప్రాణాలు బలిగొంది. జైతూలోని యూనివర్సిటీ కాలేజీలో సోమవారం విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పోలీసుల నుంచి మాకు, సామాన్యులకు స్వాతంత్ర్యం కావాలంటూ విద్యార్థులు గట్టిగా నినాదాలు చేశారు. పరిస్థితి అదుపుతప్పుతుందని సమా చారం అందుకున్న పంజాబ్‌కు చెందిన డిఎస్‌పి బల్జిందర్ సింగ్ సంధు వర్సిటీకి చేరుకున్నారు. ఆందోళన విరమించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని డిఎస్‌పి బల్జిందర్ సింగ్ విద్యార్థులను హెచ్చరించారు. కానీ విద్యార్థులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పోలీసుల దౌర్జన్యం నశించాలంటూ ఆందోళనను ఉధృతం చేశారు. ఈ క్రమంలో అక్కడ తుపాకీ పేలిన శబ్దం వినిపించిందని, పోలీసులు గమనించేసరికి డిఎస్‌పి తలలొంచి దూసుకెళ్లడంతో ఆయన కుప్పకూలిపోయారు. అదే బుల్లెట్ మరో పోలీసును తీవ్రంగా గాయపరించింది. చికిత్స నిమిత్తం ఫరీద్‌కోట్‌లోని గురు గోవింద్ సింగ్ మెడికల్ హాస్పిటల్‌కు తరలించారు. డిఎస్‌పిని పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందారని నిర్ధారించారు. బుల్లెట్ గాయమైన మరో పోలీసుకు చికిత్స అందిస్తున్నామని చెప్పారు. సర్వీస్ రివాల్వర్ ఎలా పేలిందన్న దానిపై స్పష్టత లేకపోవడంతో ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఐజీ ముఖ్విందర్ సింగ్ వివరించారు.

నాగా ఎన్నికలకు 11పార్టీలు దూరం

న్యూఢిల్లీ : నాగాలాండ్ రాజకీయ అంశానికి పరిష్కారం లభించేంత వరకు వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో అభ్యర్థుల పేర్లను ఖరారు చేయ రాదని నాగాలాండ్ రాజకీయ పార్టీలు నిర్ణయించుకున్నాయి. నాగా ట్రైబల్ హోస్ అండ్ సివిల్ ఆర్గనైజేషన్స్‌కోర్ కమిటీ (సిసిఎన్‌టి హెచ్‌సిఓ) కోహిమాలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు 11 రాజకీయ పార్టీలు సంయుక్త ప్రకటనపై సంతకాలు చేసుకున్నాయి. సంతకాలు చేసిన వాటిలో అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్), బిజెపి, కాంగ్రెస్‌లు ఉన్నాయి. జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలకు ఇది చక్కటి ఉపాయమని, రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు అన్ని పార్టీలు కలిసి రావాలని, ఎన్నికలకు ముందు పరిష్కారం కోసం ఏకం కావాలని సంయుక్త ప్రకటనలో పార్టీలో పిలుపునిచ్చాయి. ఏ రాజకీయ పార్టీ కాని, అభ్యర్థులు కాని ఎన్నికల్లో పాల్గొనేందుకు ముందుకు రావద్దని, ఎవరూ నామినేషన్లను దాఖలు చేయరాదని సంయుక్త ప్రకటనలో ఆయా పార్టీలు పేర్కొన్నాయి.

ట్రిపుల్ తలాక్ బిల్లు క్రూరమైనది

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్న ట్రిపుల్ తలాక్ బిల్లు క్రూరమైనది, అసంబద్ధమైనదని, దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మహిళా సంఘాలు స్పష్టం చేశాయి. రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ప్రధాన నరేంద్ర మోడీలు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదానికి ఉత్సాహం చూపుతున్నారని, అయితే ఈ బిల్లు మహిళలు, పిల్లల ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధంగా ఉందని హైదరాబాద్‌కు చెందిన ముస్లిం మహిళా అధ్యయన కేంద్రం కన్వీనర్ అస్మా జెహ్రా అన్నారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సివిల్ అంశాన్ని నేరపూరిత చర్యగా మార్చే ఈ బిల్లు ఎంతో క్రూరమైనదని, తలాక్ చెప్పే భర్త మూడేళ్ల పాటు జైలు పాలవుతాడని, ఇది మహిళ, పిల్లల వ్యతిరేక బిల్లు అని, ఇందులో భార్యకు మెయింటనెన్స్ ఎలాంటి ఎలాంటి ప్రస్తావన లేదని ఆమె ధ్వజమెత్తారు. జమ్మూకశ్మీర్ మినహా మొత్తం దేశం వర్తించే ఈ బిల్లు ఆమోదం పొందితే ట్రిపుల్ తలాక్ చెప్పే భర్తపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కావడతో పాటు మూడేళ్ల పాటు జైలుకు వెళ్లాల్సివస్తుందని, ఎలాంటి మెయింటనెన్స్ లేకుండా భార్య, పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆమె పేర్కొన్నారు. క్రూరమైన ఈ బిల్లు ముస్లిం మహిళలకు న్యాయపరమైన అన్ని రకాల మార్గాలను మూసివేస్తుందని అన్నారు.

117 మందిపై బహిష్కరణ వేటు

చెన్నై : తమిళనాడులో అధికార ఎఐఎడిఎంకెలో బహిష్కరణల పరంపర కొనసాగుతోంది. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన పలువురు ఆఫీస్ బేరర్లపై బహిష్కరణల వేటు వేస్తోంది. తాజాగా సోమవారం పార్టీని అపఖ్యాతి తెస్తున్న వంద మందికి పైగా ఆఫీస్ బేరర్లను పార్టీ అగ్రనేతలు ఒ. పన్నీర్ సెల్వం, కె. పళనిస్వామిలు ఎఐఎడిఎంకె నుంచి బహిష్కరించారు. శివగంగ జిల్లా, దాని ఉపశాఖల నుంచి పార్టీకి చెందిన 117 మందిని వీరు తొలగించారు. అందులో ఇద్దరు మాజీ ఎంఎల్‌లు కెకె ఉమాదేవన్, చోలన్ సిటి పళనిచామిలు కూడా ఉన్నారు. బహిష్కరణకు గురైన వారందరూ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్తూ అపఖ్యాతి తీసుకువస్తున్నారని ఎఐఎడిఎంకె కో ఆర్డినేటర్ పన్నీర్ సెల్వం, కో కో ఆర్డినేటర్ పళనిస్వామిలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

కొడుకుకు ప్రాధాన్యాన్ని చరిత్రలో కలుపుదాం

❑ స్త్రీ పురుష నిష్పత్తిలో విపరీతమైన అంతరం ❑ గులాబీ రంగు కవర్‌తో 'ఆర్థిక సర్వే' నివేదిక



న్యూఢిల్లీ: ఆర్థిక సర్వే పత్రం గులాబి రంగులో ఉండి ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. మన సమాజంలో పురుషునికే ప్రాధాన్యత ఉంది. కొడుకుని కనాలని తప్పించిపోయే తత్వం చాలా విరివిగా ఎప్పటినుంచో మనుగడ సాగిస్తోంది. 'కొడుకు పుట్టాలి' అన్నది మన జనం సాధారణ మొక్కు. కొడుకును కనడం కోసం ఎంత మంది ఆడపిల్లలనైనా కనే తత్వం మన సమాజంలో పాతుకుపోయి ఉంది. స్త్రీ పురుషుల నిష్పత్తిలో అంతరం ప్రబలంగా ఉంది. ఈ పరిస్థితిలో 'కొడుకునే కనాలి' అన్న ధోరణికి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈ సంకల్పానికి గుర్తుగా ఈ ఏడాది ఆర్థిక సర్వే కవర్ రంగును ఎంపిక చేశారు. మహిళలపై దాడుల అంతానికి సాగుతున్న ఉద్యమాలను సూచిస్తూ సర్వే పత్రాన్ని గులాబి రంగులో ప్రవేశపెట్టారు. అనేక ఖండాలలో స్త్రీలపై హింసాకాండను నిరసించే ఉద్యమాలు సాగుతున్నాయి. ఉపాధి, సంతాన నిరోధక సౌకర్యాల వాడకం విషయాల్లో కొడుకుకే ప్రాధాన్యం ఉన్నట్లు అనేక సూచికలు తెలుపుతున్నాయని సర్వే పేర్కొంది. ఆర్థికంగా దేశం ఎంతో అభివృద్ధి సాధించినా స్త్రీ పురుష సామాజిక స్థితి విషయంలో సాధించవలసింది ఎంతో ఉందని సర్వే పేర్కొంది. వ్యాపారం సులభంగా చేయడం విషయంలో ఉన్నతిని భారత్ ఎలా సాధించిందో అలాగే స్త్రీ పురుషుల సమానత్వం విషయంలో కూడా సాధించాలని సర్వే నిర్దేశించింది. కొంత కాలంగా ఉద్యోగాలు చేస్తున్న మహిళల సంఖ్య 2005– 06 లో 36 శాతం నుంచి 2015– 16లో 24 శాతానికి తగ్గిందని సర్వే పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ 'బేటీ బచావో– బేటీ పడావో' , 'సుకన్య సమృద్ధి యోజన' పథకాలు సరియైన లక్ష్యంతో ప్రవేశపెట్టిన మంచి పథకాలని సర్వే పేర్కొంది. అలాగే తప్పనిసరిగా పాలిచ్చే తల్లులకు సెలవు ఇవ్వాలనే పథకాన్ని కూడా ఉదహరించింది. మహిళలకు విద్య, ఉపాధి కల్పన రంగాల్లో అవకాశాలు పెంచడానికి అన్ని రాష్ట్రాలు, సంబంధీకులు అందరూ కీలక పాత్ర వహించాలని కూడా పిలుపునిచ్చింది. ఈ సర్వే ప్రకారం 47 శాతం మంది మహిళలు ఎటువంటి గర్భ నిరోధక సౌకర్యాన్నీ వాడరు. కావలసినంత మంది కొడుకులు పుట్టేందుకు అనువుగా సంతాన నిరోధక మార్గాలను తల్లిదండ్రులు వాడుతున్నట్లు కూడా సర్వే తెలిపింది. ఆడపిల్లలను అవాంఛనీయం అనుకొనే ధోరణికి మూలాలు కూడా ఇటువంటి వైఖరిలో ఉన్నాయి. ఈ అక్రమ ఆనవాయితీలను చరిత్రలో కలిపేసే లక్ష్యశుద్ధి కలిగి ఉండాలని ప్రజలకు సర్వే పిలుపు నిచ్చింది. దేశంలో 62.3 శాతం మంది మహిళలు 2005 – 06 లో తమ ఆరోగ్యం గురించి సొంతంగా నిర్ణయాలు తీసుకున్నారు. 2015–16లో ఈ సంఖ్య 74.5 శాతానికి పెరిగింది. అలాగే శారీరక, భావాత్మక హింసాకాండకు గురికాని మహిళల సంఖ్య కూడా 63 శాతం నుంచి 71 శాతానికి పెరిగింది. మహిళలకు సంబంధించిన పురోగతిలో ఈశాన్య రాష్ట్రాలు తక్కిన దేశం కంటే ముందుంటున్నాయి. తక్కిన రాష్ట్రాలు ఈ విషయంలో వెనుకబడ్డాయి. అయితే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు కొన్ని మహిళల పురోగతిలో ఆశించిన దాని కంటే అధ్వానంగా ఉండడం ఆశ్చర్యం గొలుపుతోంది.

గోరక్షణ పేరిట దాడుల నియంత్రణలో విఫలం

మూడు బిజెపి పాలిత రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: గోరక్షణ పేరుతో జరుగుతున్న దాడులను నియంత్రించడంలో రాజస్థాన్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలు విఫలమయ్యాయని, దీనిపై వివరణ ఇవ్వాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 3వ తేదీ లోగా స్పందించాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం నాడు ఆదేశించింది. తుషార్ గాంధీ వేసిన పిటిషన్ ఆధారంగా అత్యున్నత న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటీషన్ ఆధారంగానే గత ఏడాది కూడా సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. గోసంరక్షణ పేరుతో జరుగుతున్న హింసను నియంత్రించాలని ఆ తీర్పులో 26 రాష్ట్రాలను సుప్రీం ఆదేశించింది. హింసాత్మక ఘటనలపై వివరాలు తెలియజేసేందుకు నోడల్ అఫీసర్లను ఏర్పాటు చేయాలని కోర్టు పేర్కొన్నది. శాంతి భద్రతలు అనేది రాష్ట్రాల పరిధిలో ఉంటాయని, అందుకే రాష్ట్రాలు తగిన చర్యలు తీసుకోవాలని కోర్టు తెలిపింది. అయితే తమ ఆదేశాలకు అనుగుణంగా మూడు రాష్ట్రాలు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని చురకలంటించింది. 2015లో మొదటిసారి యుపిలో గోరక్షణ పేరుతో దాడులు జరిగాయి. గోవును చంపారన్న ఆరోపణలపై ఓ వ్యక్తిని దాద్రి పట్టణంలో హతమార్చారు. ఆ తర్వాత గుజరాత్‌లోనూ నలుగురు దళితుల బట్టలు విప్పి చితకబాదారు. ఆ ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు సీరియస్‌గా స్పందించింది.



ఉద్యోగ ప్రకటనల ఫలితాలు విడుదల చేసిన టిఎస్‌పిఎస్‌సి

హైదరాబాద్: ఐదు ఉద్యోగ ప్రకటనలకు సంబంధించిన ఫలితాలను టిఎస్‌పిఎస్‌సి సోమవారం విడుదల చేసింది. పిసిబిలో ఎఇఇ, జూనియర్ అసిస్టెంట్ కం.టైపిస్ట్ ఉద్యోగ నాయామక ఫలితాలు విడుదలయ్యాయి. అలాగే గిరిజన గురుకుల పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగ నియామక ఫలితాలు కూడా విడుదల చేసింది టిఎస్‌పిఎస్‌సి. వీటితో పాటు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ పోస్టుల ఉద్యోగ నియామక ఫలితాలను వెల్లడించింది. ఫలితాల కోసం టిఎస్‌పిఎస్‌సి అధికార వెబ్‌సైట్ www.tspsc.gov.inలో చూడొచ్చు.


నదిలోపడ్డ బస్సు : 36మంది మృతి



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని దౌల్తాబాద్ గ్రామ సమీపంలో సోమవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న బస్సు అదుపు తప్పి నదిలోకి దూసుకెళ్లడంతో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. బస్సులో 42 మంది ప్రయాణిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పశ్చిమబెంగాల్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు నదియా జిల్లాలోని కరీంపూర్ నుంచి ముషీరాబాద్‌లోని బెర్హాంపూర్‌కు బయల్దేరింది. అజయ్ నదిపై నిర్మించిన బాల్లీ బ్రిడ్జిపై వేగంగా వెళ్తున్న బస్సు అదుపు తప్పి నదిలో పడిపోయింది. దీంతో ప్రయాణీకులను రక్షించేందుకు స్థానికులు ప్రయత్నించారు. పోలీసులు, రెస్క్యూ టీంలకు సమాచారం అందించారు. వారు సమయానికి సంఘటనాస్థలికి రాకపోవడంతో ఆగ్రహించిన స్థానికులు పోలీసుల వాహనాలపై రాళ్లు రువ్వి, నిప్పుపెట్టారు.

కాస్‌గంజ్ ఘర్షణలు మాయని మచ్చ

ఉత్తరప్రదేశ్ గవర్నర్ రాంనాయక్



లక్నో: కాస్‌గంజ్‌లో తలెత్తిన ఘర్షణలపై ఉత్తరప్రదేశ్ గవర్నర్ రాంనాయక్ స్పందించారు. ఏదేమైనా కాస్‌గంజ్‌లో జరిగిన ఘటనలు దురదృష్టకరమని, ఇటువంటివి రాష్ట్రానికి మాయని మచ్చగా నిలుస్తా యన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. 9–10 మాసాల వ్యవధిలో ఈ ఘటనలు రాష్ట్రంలో తొలిసారిగా చోటు చేసుకున్నాయని, ఇవి రాష్ట్రానికి సిగ్గుచేటని పేర్కొన్నారు. మరోవైపు, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఘర్షణల్లో మృతిచెందిన చందన్ గుప్తా కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అయితే ఈ సహాయాన్ని చందన్ గుప్తా కుటుంబం నిరాకరిస్తూ, చందన్ గుప్తా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరుడు (షహీద్)గా గుర్తింపు ఇవ్వాలని కోరుతోంది. రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలతో భగ్గుమన్న ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో సోమవారం నాడు కూడా పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. రిపబ్లిక్ డే ర్యాలీ సందర్భంగా రెండు వర్గాల ఘర్షణలు హింసాత్మకంగా మారి ఒక వ్యక్తి మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. దీంతో లూటీలు, దహనకాండలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి ఇంతవరకూ 112 మంది వ్యక్తులను ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద అరెస్టు చేశారు. కాస్‌గంజ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సునీల్ కుమార్ సింగ్‌ను మీరట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పీయూష్ శ్రీవాత్సవను నియమించారు.

ట్రిపుల్ తలాక్ బిల్లుకు సహకరించండి : మోడీ



న్యూఢిల్లీ : పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విజ్ఞప్తి చేశారు. సమావేశాల తొలిరోజు సందర్భంగా సోమవారం ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడారు. ముమ్మారు తలాక్ బిల్లు 2018లో ముస్లిం మహిళలకు ఇచ్చే బహుమతి అని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొంది చట్ట రూపంలోకి రావాల్సి ఉంది. తాజా బడ్జెట్ సమావేశాల్లో ఇది ఆమోదం పొందుతుందని ప్రభుత్వం నమ్మకంతో ఉంది. అన్ని పార్టీలు బిల్లుకు ఆమోద ముద్రవేసి ముస్లిం మహిళల రక్షణ కోసం పాటు పడాలని మోదీ పిలుపునిచ్చారు. ట్రిపుల్ తలాక్ వంటి విషయాల్లో ఎలాంటి రాజకీయ కోణాలు లేవని, ముస్లిం మహిళలు తమ హక్కును పొందుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత పార్లమెంటు సమావేశాల్లో సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చినప్పటికీ ట్రిపుల్ తలాక్ బిల్లు పాస్ కాలేకపోయిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్ 2018 సామాన్యుడి ఆశలను, అంచనాలను అందుకుంటుందని వ్యాఖ్యానించారు. భారత వృద్ధిని ప్రపంచం గుర్తించిందన్నారు. అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ సంస్థలు, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ భారత్ ఆర్థిక వ్యవస్థ తీరుకు సానుకూలంగా స్పందించాయన్నారు. తాజా సమావేశాలు ప్రశాంతంగా సాగేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకారం అందించాలని కోరారు. బడ్జెట్‌కు సంబంధించిన అన్ని అంశాలను పార్లమెంటరీ కమిటీలతో చర్చించామన్నారు. గ్రామీణ భారతం అభివృద్ధి, రైతులు, దళితులు, గిరిజనులు, కార్మికుల అభ్యున్నతికి చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు.

ఘనంగా బీటింగ్ రీట్రీట్





గణతంత్ర దినోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన బీటింగ్ రీట్రీట్ ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. విజయ్ చౌక్‌లో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో మిలటరీ బ్యాండు, డ్రమ్స్ బ్యాండు, రెజిమెంటల్ సెంటర్లు, బెటాలియన్ల విన్యాసాలు అలరించాయి. రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆగమనంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవల్ బ్యాండ్లు, ఇత ర ట్రూప్‌ల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, రక్షణ మంత్రి నిర్మల సీతారామన్, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఈ ఉత్సవాలకు హాజరయ్యారు.



విదేశీ విద్యకు పేద విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి


మన తెలంగాణ / హైదరాబాద్ : పేద విద్యార్థులు విదేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి ఉద్దేశించిన సిఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ పథకానికి ఆదరణ పెరుగుతోంది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల్లో పిజీ ఆపై కోర్సుల్లో చదువుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేపెట్టింది. మొదట్లో ఎస్‌సి, ఎస్‌టీల కోసం ప్రారంభించిన అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని 2015–16లో సిఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం పేరుతో వర్తింప చేయగా 2016–17లో మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి స్కాలర్‌షిప్స్ పథకం పేరుతో బీసీలకు వర్తింప చేశారు. ఈ పథకం కింద విదేశీ విద్యకు గతంలో రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందించేవారు. తెలంగాణ ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచింది. యుఎస్‌ఎ, యుకె లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత చదువులు చదువుకోడానికి ఆయా వర్గాలకు చెందిన విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. అయితే పరిమిత నిధుల కారణంగా విద్యార్థులు ఎంపిక కూడా పరిమితంగానే ఉంటోంది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో అన్ని వర్గాల కోసం ప్రభుత్వం రూ.233.7 కోట్లు కేటాయించింది. ఇందులో ఎస్‌సిలకు రూ.157 కోట్లు కేటాయించగా 300 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించారు.

'సాగునీటి'కి కేంద్రం కొత్త పథకం

రాష్ట్రాలతో పూర్తయిన చర్చలు

మన తెలంగాణ/హైదరాబాద్: రైతుల పొలాల చెంతకు ప్రాజెక్టుల నీటిని చేర్చేలా కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని రూపొందిస్తోంది. ఇరిగేషన్ ప్రాజెక్టులు తొలుత ప్రతిపాదించిన ఆయకట్టుకు, వాస్తవంగా ఆ ఆయకట్టుకు చేరుతున్న నీటి లెక్కలకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. దీంతో ఆ ప్రతిపాదనలన్నింటినీ వాస్తవం చేసే బృహత్ సంకల్పంతో ప్రధానమంత్రి కృషి సించాయీ యోజనలో భాగంగా కొత్త పథకానికి కేంద్రం శ్రీకారం చుడుతోంది. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాజెక్టుల ప్రతిపాదిత ఆయకట్టు, వాస్తవ ఆయకట్టుల మధ్య తేడాను గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఇందుకు అయ్యే ఖర్చులో దాదాపుగా 60 శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లించనుంది. సాగులో ఉన్న తేడాను తగ్గించడానికి 'ఇన్సెంటివైజేషన్ స్కీం ఫర్ బ్రిడ్జింగ్ ఇరిగేషన్ గ్యాప్ (ఐఎస్‌బిఐజి)' పేరుతో పథకంపై అన్ని రాష్ట్రాల అధికారులతో అంతర్గతంగా ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయి. గతంలో క్యాడ్‌వామ్ పేరుతో కేంద్రం ప్రకటించిన పథకంలో కూడా ఇరిగేషన్ గ్యాప్‌ను పూడ్చడంపై శ్రద్ధ పెట్టారు. అయితే అందులో కేవలం ఎఐబిపి పథకంలో భాగంగా ఉన్న ప్రాజెక్టులు, వాటి గ్యాప్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. డ్యాం, రిజర్వాయర్ల భద్రతపైనా దృష్టిపెట్టారు. తాజా పథకంలో ఎఐబిపిలో లేని పథకాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం గమనార్హం. అంటే దాదాపుగా రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు ఈ పథకం పరిధిలోకి వస్తాయి.

రైతు పొలంలోకి నీళ్లు వెళ్లేలా ఫీల్డ్ చానళ్లు ఏర్పాటు చేయడం, స్థలం చదును, కెనాల్ నెట్‌వర్క్‌లో ఇబ్బందులు తొలగించడం, మైక్రో ఇరిగేషన్ కోసం మౌలిక వసతులు, మైక్రో ఇరిగేషన్ అమలుకు వీలుగా సోలార్ విద్యుత్ ఏర్పాట్లు, మునిసిపల్, ఇండస్ట్రియల్ వృథా నీటిని పొలాల్లో వాడేందుకు వీలుగా తయారు చేయడం, ఇరిగేషన్ నెట్‌వర్క్‌ను సక్రమంగా అమలు చేసేందుకు వీలుగా పార్టిసిపేటరీ ఇరిగేషన్ మేనేజ్‌మెంట్‌తో అందరినీ భాగస్వాములు చేయడం, నీటి సామర్థ్యం, సమర్థ వినియోగానికి వీలుగా సాంకేతిక శిక్షణ ఇవ్వడం, తదితర పనులను ఐఎస్‌బిఐజి పథకంలో కేంద్రం పొందుపరిచింది. ఈ పథకంలో భాగంగా



రాష్ట్రంలోని 28 ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్టును బలోపేతం చేసే అవకాశం ఉంది. ఐఎస్‌బిఐజి పథకాన్ని ఉపయోగించుకుంటే దాదాపుగా 6 లక్షల ఎకరాల చెంతకు నీటిని తీసుకెళ్లవచ్చు. రాష్ట్రంలోని 28 ప్రాజెక్టుల పరిధిలో 11.7 లక్షల ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టుకు నీరందాల్సి ఉండగా, ఇందులో సగం కూడా పారడం లేదు. ఇందుకు కారణం మెయిన్ కెనాల్ నిర్మాణం పూర్తైనా, ఫీల్డ్ చానళ్లు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు పూర్తికాకపోవడమే. ఐఎస్‌బిఐజి పథకంలో 28 ప్రాజెక్టుల పరిధిలో ఉన్న నీరు పారని 6 లక్షల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి పనులు చేయించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు దాదాపు 60 శాతం కేంద్రం భరిస్తే, మిగతా నిధులు రాష్ట్రం భరించాలి. వీటిపై పూర్తి వివరాలు తెలియాలంటే తొలుత డిపిఆర్‌లు తయారు చేయాలి. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్స్ రావాల్సి ఉంది. అయితే త్వరలోనే కేంద్ర కేబినెట్ ఆమోదం పొందడం, రాష్ట్రంలో 28 ప్రాజెక్టులను అందులో చేర్చడం జరుగుతాయని విశ్వసనీయంగా తెలిసింది.

ఐఎస్‌బిఐజిలో చేర్చాలని భావిస్తున్న ఇరిగేషన్ పథకాలివే....

సంఖ్య	పథకం పేరు	ప్రతిపాదిత ఆయకట్టు (వేల.హెక్టార్లలో)	గ్యాప్ ఆయకట్టు (వేల హెక్టార్లలో)
1.	జూరాల	40.160	8.796
2.	నాగార్జునసాగర్	27.944	19.615
3.	గుండ్లవాగు	1.045	1.045
4.	అలీసాగర్ లిఫ్టు	21.770	6.740
5.	గుత్ప లిఫ్టు	15.698	7.606
6.	ఎఎంఆర్, ఎస్ఎల్‌బిసి	89.033	89.033
7.	బాగారెడ్డి సింగూరు	12.145	4.047
8.	డిండి	5.196	5.196
9.	నిజాంసాగర్	93.660	13.663
10.	ఆర్‌డిఎస్	35.425	26.006
11.	కడెం ప్రాజెక్టు	27.591	12.114
12.	మూసీ	12.769	4.267
13.	అసిఫ్‌నహర్	6.172	5.189
14.	కోటిపల్లివాగు	3.724	1.498
15.	ఘన్‌పూర్ ఆనికట్	8.755	1.966
16.	పోచారం	4.251	1.545
17.	కౌలాస్‌నాలా	3.643	1.619
18.	స్వర్ణ	3.621	2.221
19.	వట్టివాగు	9.919	3.320
20.	ఎన్టీఆర్ సాగర్	2.429	1.620
21.	పిపి రావు ప్రాజెక్టు	4.453	1.417
22.	సాత్నాల	9.716	6.356
23.	అప్పర్ మానేరు	5.297	3.071
24.	శనిగరం	2.064	1.113
25.	పాకాల లేక్	7.365	2.914
26.	గడ్డెన్న సుద్దవాగు	5.668	5.668
27.	తాలిపేరు	9.996	3.116
28.	నల్లవాగు	2.440	1.035

వివాదాలు పరిష్కరించుకుందాం : చైనా

బీజింగ్: డోక్లాం సహా సరిహద్దు విభేదాలపై భారత, చైనాలు ప్రశాంతంగా దృష్టి పెట్టాలని చైనా విదేశాంగమంత్రిత్వ శాఖ సోమవారం నాడు వ్యాఖ్యానించింది. చైనాకు భారత రాయబారి గౌతం బంబ్‌వాలే ఒక చైనా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూపై ఆ వ్యాఖ్య వెలువడింది.3,488 కిలోమీటర్ల సరిహద్దుల వెంబడి యథాతథస్థితి మారకూడదని ఆయన గ్లోబల్ టైమ్స్ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. దీనిపై చైనా అధికార ప్రతినిధి హువా చున్యింగ్‌పై వ్యాఖ్య చేశారు. ప్రస్తుతం అందుబాటులోగల యంత్రాంగాల ద్వారా విభేదాల పరిష్కారానికి ప్రయత్నించవచ్చన్నారు.ప్రస్తుతం సరిహద్దులకు సంబంధించి ఉభయ దేశాల్లో యంత్రాంగాలు ఉన్నాయని గుర్తు చేశారు.

కాబూల్ సైనిక అకాడమీ వద్ద ఐఎస్ దాడి : 11 మంది మృతి



కాబూల్: అఫ్గాన్ రాజధానిలో సోమవారం నాడు సైనిక అకాడమీని కావలి కాస్తున్న అఫ్గాన్ సైనికులపై ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) మిలిటెంట్లు దాడి చేసి కనీసం 11 మంది సైనికులను చంపారు. మరి 16 మందిని గాయపర్చారు. కాబూల్‌లో ఈ నెల విడవకుండా జరుగుతున్న హింసాకాండ ఘటనల్లో ఇది తాజాది. ఆ దాడులన్నీ తాలిబన్లు, ఐఎస్ ఉగ్రవాదులు సాగించినవే. తాజా దాడి తెల్లవారు జామున 4 గంటలకు మొదలయి తెల్లారిన చాలా సేపటిదాకా కొనసాగినట్లు సాక్ష్యులు చెప్పారు. ఆత్మాహుతి బాంబర్ ముందుగా అకాడమీకి భద్రత కల్పించే సైనిక కేంద్రంపై దాడి చేశాడు. అనంతరం తుపాకులతో పోరాటం సాగింది. ఉదయం దాడిలో ఐదుగురు మిలిటెంట్లు పాల్గొన్నారని తెలిసింది. తుపాకుల పోరాటంలో వారిలో ఇద్దరు మరణించారు. మరి ఇద్దరు తమ ఛాతికి కట్టుకున్న పేలుడు పదార్థాలను పేల్చుకొని చనిపోయారు. ఐదవ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన జరిగిన కొన్ని గంటలకు ఐఎస్ అఫ్గాన్ శాఖ దాడికి బాధ్యత తమదేనని చాటుకొంది. ఈ దాడిని పొరుగున ఉన్న పాకిస్థాన్ ఖండించింది. 2014లో అఫ్గాన్, ఇరాక్ యుద్ధంలో ఈ సైనిక అకాడమీ వద్దే అత్యున్నత స్థాయి అమెరికా సైనిక అధికారి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఆర్మీ మేజర్ జనరల్ హెరాల్డ్ జె గ్రీనిని అక్కడ అప్పట్లో కాల్చి చంపారు.

విత్తన ధ్రువీకరణలో నూతన విధానాలు




మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రం ఏర్పడిన తరువాత విత్తన ధ్రువీకరణలో నూతన విధానాల ను అవలంభిస్తూ విత్త న ధ్రువీకరణ సంస్థ ముందుకు వెళ్తుందని వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారధి అన్నారు. రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థలో పునరుద్ధరించి నిర్మించిన నూతన కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ కల్తీ విత్తనోత్పత్తిని నియంత్రిస్తూ రైతులకు మంచి నాణ్యమైన విత్తనాలను అందిస్తూ, దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి సంస్థ రావడంపై అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.దేశీయ విత్తన ధ్రువీకరణ మాత్రమే కాకుండా అంతర్జాతీయ, సేంద్రియ ధ్రువీకరణ అనే రెండు విభాగాలు ఏర్పాటు చేసుకుని విజయవంతం కావడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. దేశంలోనే మొదటిసారి ఆన్‌లైన్ విత్తన ధ్రువీకరణ పద్ధతిని ప్రవేశపెట్టామన్నారు. సంస్థ సంచాలకులు కె.కేశవులు ఇస్తా సభ్యులుగా ఉండటం అభినందనీయమన్నారు. వ్యవసాయ కమిషనర్ డాక్టర్ ఎం.జగన్మోహన్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు అందించాల్సిన బాధ్యత విత్తన ధ్రువీకరణ సంస్థపై ఉందన్నారు. ఈ సమావేశంలో అధికారులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులు, రేడియోగ్రాఫర్ల సమస్యలపై రెండో దశ ఉద్యమం

మన తెలంగాణ /హైదరాబాద్ : వైద్య ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు, రేడియో గ్రాఫర్ల సమస్యల పరిష్కారం ఉద్యమాలు నిర్వహించేందుకు ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. హైదరాబాద్ హిమాయత్‌నగర్ ఎఐటీయుసీ రాష్ట్ర కార్యాలయంలో ఉద్యోగులు రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. విఠల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాకు ఒక చీఫ్ రేడియోగ్రాఫర్ పోస్టును ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. సీనియారిటీ ఆధారంగా పదోన్నతి కల్పించాలని, 11వ పీఆర్సీలో రేడియో గ్రాఫర్లకు సమున్నత ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిల్లా, తాలూకా, ఏరియా, కమ్యూనిటిల వారీగా రేడియోగ్రాఫర్లకు తగిన గుర్తింపు లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. ఎక్స్‌రే కిరణాల వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని తెలిసినా ప్రభుత్వం వారి సేవలను గుర్తించడం లేదన్నారు. డార్క్ రూమ్ అసిస్టెంట్ పోస్టులకు ప్రాధాన్యతనివ్వాలని. రేడియేషన్ వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విఠల్ తెలిపారు. ఇందులో ప్రధానంగా మొదటి దశలో నిర్వహించిన ఉద్యమాల వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలగలేదన్నారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వం కనీస స్పందనను కూడా కనబర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రెండవ దశ ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగానే దీర్ఘకాలిక సమస్యలతో పాటు రేడియో గ్రాఫర్ల సమస్యలపై ఒక మెమోరాడాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

మేమూ మిత్రధర్మం పాటిస్తున్నాం



విజయవాడ: తాము కూడా మిత్రధర్మం పాటిస్తున్నామని దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు పేర్కొన్నారు. టిడిపి, బిజెపి మధ్య తలెత్తిన వివాదంపై స్పందించిన ఆయన సోమవారం మీడియాతో మాట్లాడు తూ.. తమ పార్టీ నేతలను అదుపు చేస్తామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని, ఏమైనా విభేదాలు ఉంటే పరిష్కరించుకుందామని కూడా సీఎం అన్నారని.. అందువల్ల తాము కూడా తమ పార్టీ నేతలను అదుపు చేస్తామని, ఇకపై ఎలాంటి విభేదాలు లేకుండా కలిసి పనిచేస్తామని మాణిక్యాలరావు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నేత గూడూరు నివాసంలో నేతలకు విందు


మన తెలంగాణ/ హైదరాబాద్ : టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డికి కొనసాగింపు వచ్చిన సందర్భంగా టిపిసిసి కోశాధికారి గూడురు నారాయణ రెడ్డి నివాసంలో ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు విందు ఇచ్చా రు. ఈ విందుకు ఉత్తమ్‌తోపాటు కేంద్ర మాజీ మంత్రు లు ఎస్. జైపాల్ రెడ్డి, సర్వే సత్యనారాయణ, శాసనమండలి విపక్ష నేత షబ్బీర్ అలీ, ఎఐసిసి కార్యదర్శి వి.హనుమంతరావు, పిఎసి చైర్మన్ జెగీతారెడ్డి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, దానం నాగేందర్, ముఖేశ్, మాజీ ఎం.పిలు మల్లు రవి, అంజన్ కుమార్ యాదవ్ ఎంఎల్‌ఎలు సంపత్ కుమార్, పద్మావతి, రేవంత్ రెడ్డి, రా మ్మోహన్ రెడ్డి, తదితర ముఖ్య నాయకులు, డిసిసి అధ్యక్షులు, టిపిసిసి ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శు లు, అధికార ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. చాలా కాలం తరువాత కాంగ్రెస్ నేతలంతా ఒక్క చోట చేరడంతో ఉత్సాహ వాతావరణం నెలకొంది.



వారి మధ్య రాష్ట్ర రాజకీయాలపై చర్చలు జరిగాయి. వచ్చే ఎన్నికల్లో ఐక్యంగా టిఆర్‌ఎస్‌ను గద్దె దింపాలనే భావన వారి చర్చల్లో వ్యక్తమైనట్లు విందు ఏర్పాటు చేసిన గూడూరు నారాయణ రెడ్డి తెలిపారు. నల్లగొండలో తన అనుచరుని హత్య ఘటన కారణంగా కోమటిరెడ్డి బ్రదర్స్, అక్కడికి పరామర్శకు వెళ్లినందును టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, సాగర్‌లో ఉన్న ప్రతిపక్ష నేత కుందూరు జానారెడ్డి, ఢిల్లీ నుండి ఆలస్యంగా వచ్చినందున మాజీ మంత్రి డి.కె.అరుణ తదితరులు విందుకు హాజరుకానట్లు తెలిసింది.

ప్రజా ప్రతినిధులే కోడి పందేలు నిర్వహిస్తారా?

పోలీసుల ప్రేక్షకపాత్ర వల్లే సాధ్యం : హైకోర్టు ఆగ్రహం



మన తెలంగాణ/ హైదరాబాద్ : కోడి పందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాలు జారీ చేస్తే ప్రజాప్రతినిధులే నిర్వహించడంపై హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కోర్టులంటే గౌరవించాల్సిన రాజకీయపార్టీల నేతలే కోడి పందేల్ని నిర్వహిస్తామని మీడియాలో సైతం ప్రకటించడంపై బెంచ్ మండిపడింది. 144 సెక్షన్ ఉండగా కోడి పందేల్ని ఎలా నిర్వహిస్తారని, పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తేనే నిర్వహించడం సాధ్యం అవుతుందని బెంచ్ తీవ్రంగా తప్పుపట్టింది. కోర్టులంటే లెక్కలేకుండాపోతోందని, కోడి పందేల్ని నిర్వహించిన నాయకుల పేర్ల వివరాలు, వారి అడ్రస్ సహా ఇవ్వాలని ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలను హైకోర్టు ఆదేశించింది. మీరు వివరాలు ఇస్తే సరి లేకపోతే టీవీల ఫుటేజీని తెప్పించుకుని కోడి పందేలు ఆడిన నేతలపై చర్యలకు శ్రీకారం చుట్టాల్సివస్తుందని హైకోర్టు హెచ్చరించింది. భీమవరం మండలం శ్రీరాంపురం/వెంప గ్రామాల్లో సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలనే కాకుండాజూదం, గుండాట, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యక్రమాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, వీటిని అడ్డుకోవాలని కోరుతూ కలిదిండి రామచంద్రరాజు ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జైస్వాల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం మరోసారి విచారణ జరిపింది. కోడి పందేలు నిర్వహించకుండా తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని గతంలోని ఆదేశాల్ని అమలు చేయకపోవడంతో సిఎస్/డిజిపిలు కోర్టుకు స్వయంగా హాజరుకావాలని హైకోర్టు ఆదేశించింది. డిజిపిల సదస్సుకు హాజరవ్వాలని చెప్పి మినహాయింపు పొందడంతో సోమవారం సీఎస్ దినేష్‌కుమార్ స్వయంగా హైకోర్టుకు వచ్చారు. వచ్చేవిచారణకు సీఎస్ స్వయంగా హాజరుకావాల్సిన అవసరం లేదని బెంచ్ స్పష్టం చేసింది.

'ఎలాగైనా సరే కోడి పందేల్ని నిర్వహించి తీరుతామని చెప్పిన వివిధ రాజకీయ పార్టీల నేతల పేర్లతో నివేదికను అంద జేయాలి. పందేలు నిర్వహించి తీరుతామని చెప్పిన నేతల వివరాలు వారి అడ్రస్ లతో సహా ఇవ్వాలి. పందేల్లో పాల్గొన్న నేతలను తాము టీవీల్లో చూశాం. వారి వివరాలు కూడా ఇవ్వాలి. ఇలాంటి వారిపై ఎన్ని కేసులు, ఎంత మందిపైనమోదు చేశారో ఇవ్వాలి.తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల్లో 809 బరుల్లో కోడి పందేలు జరిపిన నిర్వా హకుల అడ్రస్‌తోసహా ఇవ్వాలి. కోడి పందేల్ని నిర్వహించరాదని గత ఏడా ది ఇచ్చిన ఉత్తర్వుల్ని అమలు చేయలేకపోయిన 48 మంది సబ్ ఇన్ స్పెక్ట ర్లు, 43 మంది తహసీల్దార్లపై నమోదు చేసిన కేసుల వివరాలు అందజేయా లి 'అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలను ఆదేశించింది. విచారణ 12కి వాయిదా పడింది.

లాస్ ఏంజెల్స్‌లో లోకేశ్ పెట్టుబడుల వేట



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కాలుష్యం తగ్గించేందుకు రానున్న రోజుల్లో ప్రభుత్వ పరంగానూ ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించనున్నట్లు మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమెరికాలో పర్యటిస్తున్న ఆయన లాస్ ఏంజెల్స్ లో ఇన్వెస్ట్మెంట్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. సిస్ ఇంటెలి సిఈఓ రవి హనుమారతో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడుల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా రవి స్పందిస్తూ.. తక్షణం 100మంది ఉద్యోగులతో ఆంధ్రప్రదేశ్‌లో సంస్థను ప్రారంభిస్తామని,రెండేళ్లలో వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సులభతరంగా ఐటీ సంస్థలు ఏర్పాటు చేసేందుకు తీసుకొచ్చిన వివిధ పాలసీలను లోకేశ్ వారికి వివరించారు. అనంతరం అడ్వాన్స్ బ్యాటరీ సిస్టమ్స్ కంపెనీ సిఈఓ రిచర్డ్ కెయిన్, వైస్ ప్రెసిడెంట్ మైక్ పాలో మీరాతోను లోకేశ్ సమావేశమయ్యారు. లిథియం అయాన్ బ్యాటరీ తయారీలో ఉన్న అడ్వాన్స్ బ్యాటరీ సిస్టమ్స్ తయారీ రంగాన్ని, ఎలక్ట్రిక్ వాహనాల తయారీని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వారికి వివరించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, వినియోగం పెంచడానికి రూపొందించిన నూతన పాలసీలను సంస్థ ప్రతినిధుల దృష్టికి లోకేశ్ తీసుకెళ్లారు.త్వరలోనే రాష్ట్రానికి వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మార్కెట్ అంచనా, పాలసీలు, రాయితీల గురించి చర్చించి నిర్ణయం తీసుకుంటామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. భారత్‌లో బ్యాటరీ తయారీ కంపెనీ ఏర్పాటు చేయాలని అనుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సిస్టమ్స్ కంపెనీ సిఈఓ రిచర్డ్ కెయిన్ భరోసా ఇచ్చారు. సాఫ్ట్ హెచ్క్యూ సిఈఓ క్రాంతి పొన్నం తోను మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఎంటర్‌ప్రైస్ స్టాఫ్ అగ్యుమెంటేషన్, మెచ్యూర్ మోడల్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ కంట్రోల్, సేర్వేలెన్స్ ప్లాన్ తదితర రంగాల్లో ఈ సంస్థ సేవలు అందిస్తోంది. రాష్ట్రంలో కాగిత రహిత పాలనకు ప్రయత్నిస్తున్నామని... ఈప్రగతితో పాటు బ్లాక్ చైన్, బిగ్ డేటా, డేటా అనలిటిక్స్ ఫిన్ టెక్ లాంటి అధునాతన సాంకేతికతలను ప్రోత్సహిస్తున్న తీరును లోకేశ్ వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో తమ కార్యకలాపాలు విస్తరించాలి అనుకుంటున్నట్లు తెలిపిన సీఈవో క్రాంతి పొన్నం.. త్వరలోనే పూర్తిస్థాయి ప్రణాళికతో ముందుకు రానున్నట్లు వెల్లడించారు.

'పేరూరు'కు నిధులు

అమరావతి: అనంతపురం జిల్లా పేరూరు ప్రాజెక్ట్‌కు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జి.ఒనెం.59 జారీ చేసిన సందర్భంగా వెలగపూడిలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్. జిల్లా రైతాంగం తరపున సి.ఎం గారికి, జల వనరుల శాఖ మంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపిన మంత్రి పరిటాల సునీత రూ. 803 కోట్లు మంజూరు చేస్తూ పరిటాల రవి వర్ధంతి రోజు ఉత్తర్వులు జారీ కావడంతో పరిటాల రవి కల నెరవేరినట్లయిందని ముఖ్యమంత్రికి తెలిపిన మంత్రి. 25వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించనున్న పేరూరు ప్రాజెక్టు. అనంతపురం రైతుల కు తానెప్పుడూ అండగా ఉంటానని మంత్రి సునీతకు భరోసా ఇచ్చిన సీఎం.





ఎర్రకోట ఎదుట పేరిణి శివతాండవం

మన తెలంగాణ/ న్యూఢిల్లీ : బాషా సాంస్కృతిక వికాసంలో తెలంగాణ జాతి ఖ్యాతిని ప్రపంచానికి విదితం చేయాలనే సంకల్పానికి ఈ సాంస్కృతిక ఉత్సహాలు ఎంతగానో దోహదం చేస్తాయని దేశ సంస్కృతి, సంప్రదాయాల్లో తెలంగాణ రాష్ట్రానిది ప్రత్యేక ఆకర్షణ అని తెలంగాణ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ అన్నారు.సోమవారం ఢిల్లీలోని ఎర్రకోట ముందు ఏర్పాటు చేసిన భారత్ పర్వ్‌లో తెలంగాణ సంస్కృతి, కళా రూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భారత్ పర్వ్‌లో కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి తెలంగాణ డే కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రానికి సొంతమైన పేరిణి శివ తాండవం, ఒగ్గు రవి శిష్య బృందం డోలు విన్యాసాలు అం దర్నీ ఆకట్టుకున్నాయి. కాకతీయుల పరిపాలనకు నిలువుటద్దంగా నిలిచే పేరిణి శివతాండవం అందర్నీ ఆకట్టుకుందని వివరించారు. ఒగ్గుడోలు విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, కళాకారుల చేసిన సాంస్కృతిక నృత్యాలు తెలంగాణ సంస్కృతికి దర్పణం పట్టాయని తెలంగాణ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి తెలిపారు. కళాకారులు ప్రదర్శించిన వివిధ నృత్య అంశాలు పలువురిని విశేషంగా అలరించాయి.

టిటిడి తరహాలో పారదర్శకత : ఇఓ

విజయవాడ: తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిదే)లో కార్యక్రమాలను అధ్యయనం చేసి కనకదుర్గమ్మ ఆలయంలోనూ పారదర్శకత తీసుకొస్తామని ఈవో ఎం. పద్మ అన్నారు. సోమవారం విజయవాడలో దుర్గమ్మ ఆలయ పాలక మండలి సమావేశం జరిగింది. కొత్తగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఈవో ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిపై పాలకమండలి సభ్యులు పలు సూచనలు చేశారని, ఆలయంలో ఈఆఫీస్ ఏర్పాటుపైనా కొన్ని ప్రతిపాదనలు చేశారని ఈవో తెలిపారు ఈఆఫీస్ వల్ల అవినీతి తగ్గి భక్తులకు మెరుగైన సేవలు అందుతాయని ఆమెఅభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి నాలుగో వారంలో భక్తులకు మల్లేశ్వరస్వామి ఆలయం అందుబాటులోకి వస్తుందన్నారు. ఆలయంలో ఎలాంటి కార్యక్రమాలు చేసినా ఆగమ శాస్త్రం ప్రకారమే జరగాలన్నారు. ఇకనుంచి ప్రతి నెల మొదటి వారంలో పాలకమండలి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు ఆమె తెలిపారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
మంగళవారం
30, జనవరి 2018
www.manatelangana.news

క్రికెటర్ షమి కుటుంబసభ్యులకు చేదనుభవం



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ మహమ్మద్ షమి కుటుంబసభ్యులకు తాజాగా ఓ చేదు అనుభవం ఎదురైంది. అవార్డు ఇస్తామని పిలిచి దాన్ని అందజేయలేదు సరికదా కనీసం వారిని గుర్తించిన వారు కూడా లేదు. అసలేం జరిగిందంటే.. కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో ఆటగాళ్లను అభినందించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమ నిర్వాహకులు మహమ్మద్ షమికి 'ఖేల్ సమ్మాన్' అవార్డును గతంలో ప్రకటించారు. ఈ అవార్డు అందుకోవడానికి షమి అందుబాటులో లేదు. ప్రస్తుతం అతడు దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్నాడు. దీంతో అతనికి బదులు ఆయన భార్య హసిన్ జహన్‌తో పాటు కుటుంబసభ్యులు వెళ్లారు. కానీ, అక్కడ పట్టించుకున్న వాళ్లు ఒక్కరు కూడా లేదు. అంతేకాదు అసలు ఎందుకు పిలిచారో కూడా మరిచారు. అవార్డు అందించడానికి వారిని వేదికపైకి కూడా పిలవలేదట. దీంతో వారు ఇక చేసేది ఏమీలేక తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. 'దేశానికి ప్రాతినిధ్యం వహిస్తోన్న ఓ క్రీడాకారుడి కుటుంబానికి ఇచ్చే గౌరవం ఇదేనా?' అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు భారత్–పాక్ సెమీస్

ఐసిసి అండర్ 19 ప్రపంచ కప్‌లో తలపడనున్న దాయాది జట్లు





క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌లో జరుగుతున్న అండర్19 వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. నేడు జరిగే ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించాలని కుర్రాళ్లతో పాటు అభిమానులు కోరుకుంటున్నారు. గత గణాంకాలు పరిశీలిస్తే భారత్ మూడు సార్లు ప్రపంచకప్ గెలవగా, పాక్ రెండు సార్లు కైవసం చేసుకుంది. దాయాది దేశాలు కావడంతో పోరుపై అంతా ఎదురుచూస్తున్నారు. వరుస విజయాలతో సెమీస్ చేరిన పృథ్వీషా సేనకు పాక్‌ను ఓడించడం పెద్ద కష్టమేమీ కాకపోయినా, అతి విశ్వాసానికి పోతే మాత్రం పరాభవం తప్పదని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. ప్రారంభ మ్యాచ్‌లో అఫ్గాన్ చేతిలో ఓడిన పాక్ ఆ తర్వాత వరుస విజయాలతో సెమీస్ చేరింది. ఆ జట్టులో బౌలర్ షాహీన్ అఫ్రిది, మిడిలార్డర్‌లో అలీ జర్యబ్ ఫామ్‌లో ఉండడం వారికి కలిసొచ్చే అంశం. ఇప్పటికే జరిగిన నాలుగు మ్యాచుల్లో 11 వికెట్లు తీసిన అఫ్రిది పాక్‌కు అదనపు బలం. అఫ్రిది ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 6 వికెట్లు తీశాడు.సెమీస్‌జరిగే హెగ్లే ఓవల్ మైదానంలో పరిస్థితులు పాక్‌కు బాగా తెలుసు. క్వార్టర్స్‌లో ఆ జట్టు అక్కడ ఆడడం వారికి కలి సొస్తుందని, పాక్‌తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంటామని శుభ్‌మన్ గిల్ ధీమా వ్యక్తం చేశాడు.

జట్లు:
భారత్: పృథ్వీషా (సారథి), శుభ్‌మన్ గిల్, ఆర్యన్ జుయల్, అభిషేక్ శర్మ, అర్షదీప్ సింగ్, హార్విక్ దేశాయ్, మన్‌జ్యోత్ కార్ల, కమలేశ్ నాగర్‌కోటి, పంకజ్ యాదవ్, రియాన్ పరాగ్, ఇషాన్ పోరెల్, హిమాన్షు రాణా, అంకుల్ రాయ్, శివమ్ మావి, శివ సింగ్
పాక్: హసన్ ఖాన్ (సారథి), రొహైల్ నజీర్, మహ్మద్ అలీ ఖాన్, అలీ జర్యబ్, అమ్మద్ ఆలమ్, అర్షద్ ఇక్బాల్, ఇమ్రాన్ షా, మహ్మద్ తహా, మోషిన్ ఖాన్, మహ్మద్ మూసా, మహ్మద్ జైద్, మునీర్ రియాజ్, షాహీన్ అఫ్రిది, సులేమాన్

ఐపిఎల్‌కు కుర్రాళ్లు : బెంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన ఐపిఎల్ వేలంలో భారత యువ క్రికెటర్లు మంచి ధర పలికారు. సరాసరి 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరే ఎడమచేతి వాటం పేసర్ నాగర్‌కోటిని రూ.3.2 కోట్లు, మరో బౌలర్ శివమ్ మావిని రూ.3 కోట్లు పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ కొనుగోలు చేసింది. ఇక బ్యాటింగ్ సంచలనం, అండర్19 సారథి పృథ్వీషాను ఢిల్లీ డేర్‌డెవిల్స్ 1.2 కోట్లు, శుభ్‌మన్‌గిల్‌ను కోల్‌కతా 1.8 కోట్లు పెట్టి సొంతం చేసుకున్నాయి. ఇక ఎడమచేతి వాటం స్పిన్నర్ అంకుల్‌రాయ్‌ను రూ.20 లక్షలు పెట్టి ఢిల్లీ, అభిషేక్ శర్మను రూ.55 లక్షలు పెట్టి ముంబయి కొనుగోలు చేశాయి. షాతో ఓపెనింగ్‌కు దిగే మన్‌జ్యోత్‌ను కనీస ధర రూ.20 లక్షలకు ఢిల్లీనే సొంతం చేసుకుంది.



టెస్ట్ ర్యాంకింగ్‌లో లారాను అధిగమించిన కోహ్లి

దుబాయ్: భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఆల్‌టైమ్ కెరీర్ అత్యుత్తమ ర్యాంకింగ్స్‌లో వెస్టిండీస్ దిగ్గజం బ్రియన్ లారాను అధిగమించాడు. తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అతడు రెండో స్థానాన్ని నిలుపుకున్నాడు. ర్యాంకింగ్స్ పాయింట్లను 900 నుంచి 912కు పెంచుకున్న కోహ్లి.. అత్యుత్తమ కెరీర్ ర్యాంకింగ్ పాయింట్లలో బ్రియన్ లారా (911)ను అధిగమించాడు. సునీల్ గావస్కర్ (916) ర్యాంకింగ్‌కు చేరువయ్యాడు. అయితే తాజా ర్యాంకింగ్స్‌లో స్టీవ్ స్మిత్ (947) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.



లియాండర్‌కు మరో టైటిల్

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ కొత్త ఏడాదిలో తొలి టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఒరాకిల్ ఛాలెంజర్ సిరీస్ పురుషుల డబుల్స్‌లో 25వ ఎటిపి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. అమెరికాలో జరిగిన న్యూపోర్ట్ బీచ్ ఓపెన్ టోర్నీలో తన భాగస్వామి జేమ్స్ సెరిటాని(అమెరికా)తో కలిసి పేస్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో పేస్–సెరిటాని ద్వయం 6–4, 7–5తో డెనిస్ కుడ్లా (అమెరికా),ట్రీట్ హుయ్ (ఫిలిప్పీన్స్) జంటపై గెలుపొందింది.

గంభీర్ చేజేతులా చేసుకున్నాడు!




కోల్‌కతా: తాజాగా జరిగిన ఐపిఎల్ వేలంలో అతడిని సొంతజట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ (కెకెఆర్) తీసుకోక పోవడంపై తీవ్ర విమర్శలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రెండు సీజన్లలో కెకెఆర్‌కు ఐపిఎల్ టైటిల్స్ అందించిన క్రికెటర్‌కు అవమానం జరిగిందంటూ కొందరు కెకెఆర్ ఫ్యాన్స్ ట్వీట్లు చేశారు. అయితే దీనిపై కెకెఆర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకీ మైసూర్ వివరణ ఇచ్చుకున్నారు. గంభీర్‌కు సారీ చెబుతూనే కెకెఆర్ టీమ్ వదులుకోవడానికి ఆ క్రికెటరే కారణమని.. అది ఎలాగో వివరించాడు. సోషల్ మీడియాలో ఈ విషయాలు వైరల్ అవుతున్నాయి. 'ఈ వేలంలో స్టార్ క్రికెటర్, మాజీ కెప్టెన్ గంభీర్‌ను తీసుకోవాలని ముందుగానే కెకెఆర్ యాజమాన్యం ప్లాన్ చేసుకుంది. అతడిపై మాకు ఎప్పటికీ నమ్మకం ఉంది. కానీ వేలానికి ముందు గంభీర్ తమకు కొన్ని విషయాలు చెప్పాడు. తన కోసం వేలంలో ఆసక్తి చూపించవద్దని, ఆర్‌టిఎం (రైట్ టు మ్యాచ్) ద్వారా కూడా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించొద్దన్నాడు. గంభీర్ ప్లాన్స్ ఎలా ఉన్నాయో.. అతడు దేని కోసం ఎదురుచూస్తున్నాడో మాకు తెలియదు. దీంతో గౌతీకి ఏ విధంగా సాయం చేయలేకపోయామని, సారీ గంభీర్ అంటూ' కెకెఆర్‌తో తమ ఏడేళ్ల అనుబంధాన్ని సిఇఒ గుర్తుచేసుకున్నాడు. అయితే గౌతీని ఢిల్లీ డేర్‌డెవిల్స్ రూ.2.8 కోట్లతో సొంతం చేసుకుంది. దీంతో గంభీర్ తిరిగి సొంతగూటికి చేరినట్లయింది.

ఈసారి ట్రోఫీ మాదే



రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు జయదేవ్ ఉనాద్కట్

రాజ్‌కోట్: ఐపిఎల్11 వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో రెండోవాడు జయదేవ్ ఉనాద్కట్. ఈ ఆటగాడిని రాజస్థాన్ రాయల్స్ ఏకంగా రూ.11.5 కోట్లతో ఉనాద్‌కట్‌ను సొంతం చేసుకోవడంతో భారత్ నుంచి వేలంలో అత్యధిక ధర పలికిన క్రికెటర్‌గా నిలిచాడు.

భారీ ప్యాకేజీతో తనను కొనుగోలు చేయడంపై టీమిండియా క్రికెటర్ ఉనాద్కట్ హర్షం వ్యక్తం చేశాడు. రెండేళ్ల నిషేధం తర్వాత బరిలోకి దిగుతున్న తమ జట్టు రాజస్థాన్ ఈ సీజన్ ట్రోఫీ నెగ్గుతుందని ధీమా వ్యక్తం చేశాడు. అత్యుత్తమ ప్రదర్శనతో జట్టుకు సాధ్యమైనన్నీ విజయాలు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. తొలిరోజు వేలంలో రూ.11 కోట్ల ధర పలికిన మనీశ్ పాండే, కేఎల్ రాహుల్‌ను రెండోరోజు జరిగిన వేలంలో అధిగమించాడు ఈ సౌరాష్ట్ర ప్లేయర్. రూ.11.5 కోట్ల ధరతో ఈ సీజన్ వేలంలో బెన్ స్టోక్స్ (రూ.12.5 కోట్లు) తర్వాత అత్యంత ఖరీదైన క్రికెటర్‌గా రికార్డులు తిరగరాశాడు ఉనాద్కట్. గతేడాది పుణే తరఫున ఆడిన ఉనాద్కట్ హ్యాట్రిక్ సహా 7.02 ఎకానమీతో 24 వికెట్లు పడగొట్టి భువనేశ్వర్ (26) తర్వాత రెండో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ప్రస్తుత వేలం ధరతో ఈ ఆటగాడిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.



ఐపిఎల్ మ్యాచ్ వేళల మార్పుపై అసంతృప్తి

నష్టపోతామంటున్న ముంబై ఇండియన్స్

ముంబయి: ఐపిఎల్ సీజన్11 ఆట వేళల మార్పుపై ముంబై ఇండియన్స్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఐపిఎల్ ప్రసార హక్కులను దక్కించుకున్న స్టార్ స్పోర్ట్స్ ప్రతిపాదించిన వేళలతో ఆదాయంతో పాటు వ్యూయర్ షిప్ కూడా తగ్గుతుందని ముంబై ఇండియన్స్ సహ యజమాని ఆకాశ్ అంబానీ ఆందోళన వ్యక్తం చేశారు. ఐపిఎల్‌ను ప్రసారం చేయనున్న స్టార్ స్పోర్ట్స్ ఆట వేళల్లో కొన్ని మార్పులు ప్రతిపాదించింది. సాయంత్రం మ్యాచ్‌ను ఏడు గంటలకు, మధ్యాహ్నం మ్యాచ్‌ను 5:30 గంటలకు నిర్వహించాలని ప్రతిపాదించింది. గతంలో ఈ మ్యాచ్‌లు సాయంత్రం 4 గంటలు, రాత్రి 8 గంటలకు జరిగేవి. స్టార్ స్పోర్ట్స్ ప్రతిపాదనను ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అంగీకరించినా జట్టు యాజమాన్యాలు మాత్రం అంగీకరించడం లేదు. తమ వరకు అయితే ఈ వేళలు అంగీకార యోగ్యంగా లేవని ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు. ముంబై ప్రజలు సాయంత్రం 6:307 గంటల వరకు విధుల్లోనే ఉంటారని, కాబట్టి రెండో మ్యాచ్‌ను ఏడు గంటలకు నిర్వహించడం కొంచెం కష్టమైన పనేనని తెలిపారు. దీనివల్ల రెవెన్యూతో పాటు వ్యూయర్‌షిప్‌పైనా తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టే తాము ఈ వేళలను వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. అయితే వేళల మార్పుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ రాజీవ్ శుక్లా తెలిపారు.

సఫారీ జట్టులో వర్ణ వివక్ష ఉందా?

జొహన్నెస్‌బర్గ్: భారత్‌తో జరిగిన మూడు టెస్టు మ్యాచుల సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది దక్షిణాఫ్రికా జట్టు. వాండరర్స్ మైదానంలో చివరి టెస్టు అనంతరం ట్రోఫీ అందుకుని సఫారీ జట్టు సంబరాలు చేసుకుంది. ఇదే ఇప్పుడు వారి కొంపముంచింది. చివరి టెస్టులో ఓడిపోయినా సంబరాలు చేసుకున్నందుకు అని అనుకుంటే మాత్రం పప్పులో కాలేసినట్లే. ఫొటోను కాస్త జాగ్రత్తగా పరిశీలిచండి. ఇందులో ఒక వైపు డూప్లెసిస్, ఎల్గర్, డివిలియర్స్, మోర్కెల్, మోరిస్, డీకాక్, స్టెయిన్ తదితరులు ఉండగా.. మరోపక్క రబాడ, ఎంగిడి, ఫిలాండర్, కేశవ్ మహారాజ్, ఫెలుక్వాయో ఉన్నారు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆటగాళ్లు కావాలని అలా ఎందుకు నిల్చున్నారో తెలియదు గానీ ఫొటో మాత్రం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. దేశం తరఫున ఆడుతోన్న ఆటగాళ్ల మధ్య వర్ణ వివక్ష ఉందని ఈ ఫొటో రుజువు చేసిందని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన ఫిలాండర్, ఎంగిడి, రబాడలను కలుపుకోలేకపోయారని ట్వీట్ల వర్షం కురిపించారు. దీనిపై ఇప్పుడు అక్కడ పెద్ద చర్చే జరుగుతోంది. 'ఆటగాళ్ల మధ్య ఎలాంటి వివక్ష లేదని, వారంతా ఒకటేనని' ఆ దేశ క్రికెట్ బోర్డు సిఇఒ తబాంగ్ మోరోయ్ అన్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ..'జట్టులో ఆటగాళ్ల మధ్య ఎలాంటి తేడాలు లేవు. అందరూ దేశం తరఫునే ఆడారు. ఓ మ్యాచ్‌లో రబాడ కీలక వికెట్ తీసినప్పుడు సారథి డూప్లెసిస్ అతడి నుదురుపై ముద్దుపెట్టుకోవడం మనందరం చూశాం. అలాంటి సంఘటనలు గురించి ఎందుకు మాట్లాడరు?... జట్టు ఎంపిక విషయంలో ఏమాత్రం నియమాలను ఉల్లంఘించడం లేదు. చివరికి పదొకొండు మంది జట్టులో ఇద్దరు నల్ల జాతి ఆఫ్రికన్లు ఉండాలనే నియయాన్ని అనుసరిస్తూనే ఉన్నాం' అని స్పష్టం చేశారు.




ఐపిఎల్ వేలంలో ఆ ఇద్దరిపైనే అందరి దృష్టి



బెంగళూరు: దేశంలో అత్యంత సంపన్న లీగ్‌గా పేరొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ఆటగాళ్ల వేలంపాట ఇటీవల అట్టహాసంగా ముగిసిన సంగతి తెలిసిందే. టాప్ ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లను సొంతం చేసుకునేందుకు ఐపిఎల్ ఫ్రాంచైజీలు హోరాహోరీగా పోటీపడ్డాయి. ఈ క్రమంలో అత్యధిక ధర పలికిన ఆటగాళ్లే కాదు వేలంపాటలో పాల్గొన్న సంపన్నుల పిల్లలు కూడా పలువురి దృష్టిని ఆకర్షించారు. ఈ వేలంపాటలో ముంబై ఇండియన్స్ వద్ద ఆ జట్టు యాజమాని ముఖేశ్ అంబానీ సతీమణి నీతతోపాటు వారి తనయుడు ఆకాశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఆటగాళ్ల బిడ్డింగ్‌లో కీలక పాత్ర పోషిస్తూ పెడెల్‌ను రైజ్ చేయడంలో ఆకాశ్ ముందంజలో కనిపించాడు. ఇక 17 ఏళ్ల జాన్వీ మెహతా కూడా ఆటగాళ్ల వేలంపాటలో అందరి దృష్టి ఆకర్షించింది. కోల్‌కతా నైట్ రైడర్స్ (కెకెఆర్) జట్టు సహ యాజమానురాలైన నటి జూహీ చావ్లా, నిర్మాత జయ్ మెహతాల కూతురు జాన్వీ. ప్రస్తుతం ఆమె లండన్‌లో విద్యనభ్యసిస్తోంది. కొద్ది రోజుల ముందు భారత్‌కు వచ్చిన జాన్వి తల్లితో కలిసి ఐపిఎల్ వేలంలో పాల్గొని అందర్నీ ఆశ్చర్యపరిచింది. సహచరుల సూచనలతో ఆటగాళ్ల కోసం వేలంలో మిగతా ఫ్రాంఛైజీలతో పోటీ పడి ఔరా! అనిపించింది. అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. ఐపిఎల్ వేలంలో పాల్గొన్న అతి పిన్న వయస్కురాలిగా జాన్వి రికార్డు సృష్టించింది. 'క్రిస్ లిన్‌ను సొంతం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని' వేలం అనంతరం జాన్వి చెప్పింది. సహజంగా రిటైర్డ్ క్రికెట్ దిగ్గజాలు పాల్గొనే ఈ వేలంపాటలో ఈ యంగ్‌స్టర్స్ పాల్గొనడం ఆసక్తి రేకెత్తించింది.

కోహ్లి.. దూకుడు తగ్గించుకో

వెస్టిండీస్ మాజీ ఆటగాడు మైకేల్ హోల్డింగ్



జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో టీమిండియా ప్రదర్శన కంటే కూడా కోహ్లి దూకుడుపైనే ఎక్కువ చర్చ సాగుతోంది. ప్రధానంగా రెండు టెస్టులో ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడుతూ కోహ్లి సహనం కోల్పోవడం చర్చకు తెరలేపింది. ఇప్పుడు ఆ జాబితాలో విండీస్ దిగ్గజ బౌలర్ మైకేల్ హోల్డింగ్ కూడా చేరిపోయాడు. 'భారత జట్టుకు కోహ్లి ఒక యువ కెప్టెన్. అతడు ఇంకా కెప్టెన్‌గా ఎలా వ్యవహరించాలో నేర్చుకునే దశలోనే ఉన్నాడు. ఒక్కోసారి కొద్దిపాటి ఎమోషనల్‌కు గురయ్యే కోహ్లి, మరికొన్ని సందర్భాల్లో దూకుడుగా వ్యవహరిస్తాడు. ఇక్కడ మా జట్టు మాజీ కెప్టెన్ సర్ రిచర్డ్‌సన్‌ను చూసి కోహ్లి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఇక్కడ బ్యాటింగ్ పరంగా కాదు.. సారథిగా మాత్రమే ఇద్దరినీ పోల్చుతున్నా. రిచర్డ్స్ విండీస్ పగ్గాలు తీసుకున్న సమయంలో తన పదవికి న్యాయం చేసుకుంటూ వెళ్లాడు. అతను ఎంతో కూల్‌గా జట్టును ముందుకు తీసుకెళ్లేవాడు. ఆ క్రమంలోనే జట్టు కూడా నిలకడైన ప్రదర్శనతో ముందుకెళ్లేది. విరాట్ పదేపదే జట్టును మారుస్తూ ఉంటాడు. ప్రతీ మ్యాచ్‌కు జట్టును మార్చడంతో సరైన ఫలితాలు రావు. ఈ విధానంతో ఆటగాళ్లలోనూ ఏకాగ్రత దెబ్బతింటుంది. తుది జట్లలో మార్పులు అవసరమే.. కానీ మ్యాచ్ మ్యాచ్‌కు అవసరం లేదు. ఒకసారి అత్యుత్తమ టెస్టు జట్లను పరిశీలించు. అవి ఎలా విజయవంతమయ్యాయో చూడు. రిచర్డ్స్ వంటి దిగ్గజ కెప్టెన్లను చూసి కామ్‌గా ఉండటం కోహ్లి నేర్చుకుంటే మంచిది. ఎప్పుడైనా కెప్టెన్‌గా నీకు ఎదురైన ప్రశంసను డిఫెన్స్ చేసుకోవాలి. అంతేకానీ ఎదురు దాడి చేయకూడదు' అని హోల్డింగ్ కోహ్లికి సూచించాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.